ఈనాడు
ఖమ్మం
గురువారం 4 జనవరి 2018 16 పేజీలు

2016లో ఖమ్మం రీజియన్ పరిధిలో జాతరకు తరలిన భక్తులు
**2,51,900**
(బస్సుల ద్వారా)

ప్రథమ స్థానం: కొత్తగూడెం
ఇక్కడి నుంచి వెళ్లిన భక్తులు:
**77,800**
రెండో స్థానం: ఖమ్మం డిపో
వెళ్లిన భక్తులు:
**52,000**



# లాభాల జాతరే..


ఆదాయం ఇలా..
కొత్తగూడెం డిపో: రూ.1,13,00,000
ఖమ్మం డిపో: రూ. 78,58,329
భద్రాచలం డిపో: రూ.42,25,000
మణుగూరు: రూ. 40,62,000

- రేపు రీజియన్ కార్యాలయంలో అధికారుల సమీక్ష సమావేశం
- ఈ నెల 27నుంచి 'ఆర్టీసీ ఆపరేషన్' ప్రారంభం

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

మేడారం.. రెండేళ్లకోసారి జరిగే వన దేవతల జాతర. దేశంలో అతి పెద్ద వేడుకల్లో ఒకటి. తెలంగాణలో అత్యంత ప్రసిద్ధి చెందిన మేడారం జాతరకు ఆర్టీసీ అధికారుల కసరత్తు ఆరంభమైంది. ఎప్పటిలానే భక్తజనాన్ని వెల్లువలా తరలించి ఆదాయ పంట పండించాలన్న యోచనతో వారు ఉన్నారు. ఈ నెల 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరిగే వన మహోత్సవానికి సమాయత్తమవుతున్నారు. లక్షలాది మంది భక్తులు పాల్గొనే ఈ సంరంభం ఒక రకంగా ఆర్టీసీ సంస్థకు ఆదాయ జాతరగా చెప్పుకోవచ్చు. ప్రతీ రెండేళ్లకోసారి భక్తులను ఇష్టదేవతల చెంతకు తీసుకెళ్లే ప్రయాణ సాధనాలుగా ఉపయోగడపటమే కాకుండా కోట్లాది రూపాయల ఆదాయాన్ని సమకూర్చుకోవడంలో ఆర్టీసీకి దన్నుగా నిలుస్తోంది. వరంగల్ జిల్లా తరువాత మేడారం జాతర ద్వారా ఆదాయాన్ని గడించడంలో పూర్వ ఖమ్మం రెండో స్థానాన్ని పదిలం చేసుకుంటూ వస్తోంది. ప్రస్తుత భద్రాద్రి జిల్లాకేంద్రమైన కొత్తగూడెం డిపో 2016లో రూ. 1,13,00,000 ఆదాయంతో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. ఈ దఫా అంతకంటే ఎక్కువ ఆదాయాన్ని సాధించాలనే లక్ష్య సాధనతో రీజియన్ అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. అందులో భాగంగా లక్ష్యాన్ని నిర్దేశం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉభయ జిల్లాల్లోని అధికారులందరూ శుక్రవారం ఖమ్మం రీజియన్ కార్యాలయంలో సమీక్ష మిగతా 2వ పేజీలో

# స్వచ్ఛతకు 'పరీక్ష'



నేటి నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

ఉభయ జిల్లాల్లోని పురపాలకాలు గట్టెక్కటం కష్టమే..

పాల్వంచ పట్టణం, ఖమ్మం కార్పొరేషన్ న్యూస్‌టుడే

జిల్లాలో పట్టణాలను పీడిస్తున్న ప్రధాన సమస్యల్లో చెత్తది మొదటి స్థానం. కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వం సంపూర్ణ పారిశుద్ధ్యమే లక్ష్యంగా పనిచేస్తోన్నా పరిస్థితుల్లో మార్పులు రావడం లేదు. స్వచ్ఛ భారత్ లాంటి కార్యక్రమాల వల్ల కొన్ని చోట్ల చెత్తతో సంపదను సృష్టిస్తున్నా.. మన దగ్గర ఆ పరిస్థితి లేదు. పెరిగిపోతున్న చెత్తతో రెండు జిల్లాలోని పట్టణ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం నుంచి ఉభయ జిల్లాల్లోని పురపాలకాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం ఆకస్మిక తనిఖీలను నిర్వహించనుంది. నాలుగు అంశాల ప్రాతిపదికన పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణను అంచనా వేయనుంది. అయితే పారిశుద్ధ్య నిర్వహణలో చాలా లోపాలున్న మన పురపాలకాలు ఈ పరీక్షలో నెగ్గగలవా అన్న సందేహాలున్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్-18లో అత్యంత కీలకమైన అంశం తడి, పొడి చెత్త సేకరణ. ప్రతీ పట్టణానికి చెత్త సేకరణ అనేది పెను సవాలుగా మారింది. ఇంటి నుంచి వచ్చే వ్యర్థాల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వడం ద్వారా తడి చెత్త(వంటింటి నుంచి వచ్చే వ్యర్థాలు)ను తిరిగి ఎరువుగా ఉపయోగించవచ్చు. ఇక పొడి చెత్త(ప్లాస్టిక్, గాజు, కాగితం, అట్టపెట్టెలు, ఇతరత్రా)ను విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చు. ప్రస్తుతం ఇంట్లో నుంచి వచ్చే వ్యర్థాలను కలిపి ఇవ్వటం ద్వారా తిరిగి వాటిని వేరు చేయడానికి చాలా సమయం పడుతోంది. వేరుచేయని పక్షంలో డంపింగ్ యార్డుకు నేరుగా తరలిస్తారు. దీని ద్వారా డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాలు కాలుష్యానికి గురవుతున్నాయి. అలా కాకుండా తడిచెత్తను ఇంటి నుంచే వేరు చేసి ఇవ్వటం ద్వారా వీటిని కంపోస్టు ఎరువును తయారుచేసే యార్డుకు తరలించే అవకాశం ఉంటుంది. రెండు జిల్లాలోని ఏ ఒక్క మున్సిపాలిటీలో తడి, పొడి చెత్త నుంచి ఎరువులను తయారుచేసే కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఖమ్మం లాంటి నగరాల్లో కొంత మేర తడి మిగతా 2లో

ప్రధాన అంశాలు:
1. తడి, పొడి చెత్త సేకరణ
2. రీసైక్లింగ్

తనిఖీ పద్ధతులు:
1. డాక్యుమెంటేషన్
2. క్షేత్ర స్థాయి పరిశీలన
3. తనిఖీలు
4. సిటిజన్ ఫీడ్‌బ్యాక్

| ఖమ్మం జిల్లా | |
|---|---|
| చెత్త సేకరణ ప్రాంతాలు | రోజుకు ఉత్పత్తయ్యే చెత్త (టన్నుల్లో) |
| 350 | 210 |
| ఒక ఇంటి నుంచి సగటున రోజుకు.. | 700 (గ్రాములు) |

# మళ్లీ రంగంలోకి సీసీఐ!

- వాణిజ్య కొనుగోళ్లకు సిద్ధం
- పోటీ మార్కెట్‌తో పత్తి ధరలు పెరిగే అవకాశం



ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

భారత పత్తి సంస్థ(సీసీఐ) మళ్లీ రంగంలోకి దిగుతోంది. వ్యవసాయ మార్కెట్లలో వాణిజ్య కొనుగోళ్లకు సిద్ధమవుతోంది. అవిభాజ్య ఖమ్మం జిల్లాలో మొత్తం 13 వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. ఖమ్మం, నేలకొండపల్లి, మధిర, వైరా, కల్లూరు, సత్తుపల్లి, ఏన్కూరు, కొత్తగూడెం, బూర్గంపాడు, దమ్మపేట, ఇల్లెందు, చర్ల, భద్రాచలంలో ఇవి ఏర్పాటయ్యాయి. ఇవికాక మరో ఏడు సీసీఐ కేంద్రాలు కూడా ఏర్పాటు చేశారు. మార్కెట్‌లో కనీస మద్దతు ధర రైతులకు లభించనప్పుడు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన సీసీఐని ప్రభుత్వం రంగంలోకి దించుతుంది. ఈ సంవత్సరం సీజన్ ప్రారంభంలో జిల్లాలో సీసీఐ పత్తిని కొనుగోలు చేసింది. ఆ తర్వాత వ్యాపారులు పత్తి కొనుగోలుకు పోటీ పడుతుండటంతో కొంత కాలం తర్వాత కొనుగోళ్లను నిలిపివేసింది. పత్తికి ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాకు రూ. 4320. ప్రస్తుతం క్వింటా రూ. 5300ల వరకు మిగతా 2వ పేజీలో

అతివేగం, నిర్లక్ష్యం మూడు నిండు ప్రాణాల్ని బలిగొన్నాయి. పొట్టకూటి కోసం వచ్చిన జీవితాలు ఛిద్రం అయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం భీముని గుండం కొత్తూరు గ్రామం వద్ద బుధవారం ఉదయం మణుగూరు ప్రధాన రహదారిపై రెండు డీసీఎం వ్యాన్లను, ఓ లారీ వేగంగా వెనుకనుంచి ఢీకొట్టిన సంఘటనలో అక్కడికక్కడే ఇద్దరు మృతిచెందారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతిచెందారు. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే..

# మృత్యు శకటం

- ఆగిఉన్న వ్యాన్లను ఢీకొట్టిన బొగ్గు లారీ
- ముగ్గురు దుర్మరణం.. ఆరుగురికి తీవ్ర గాయాలు

అశ్వాపురం, న్యూస్‌టుడే: మణుగూరు ప్రధాన రహదారి మార్గంలో కొంతకాలంగా బీఎస్ఎన్ఎల్ హెచ్‌డీ పీఈ కేబుల్ లైన్ ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. తవ్వకాల కోసం పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం నుంచి పలు కుటుంబాలు వచ్చాయి. అశ్వాపురం మండలంలోని నెల్లిపాక బంజర, మొండికుంట వద్ద తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేసుకుని కేబుల్ పనులు చేస్తున్నాయి. బుధవారం ఉదయం గుంటూరు నుంచి రెండు డీసీఎం వ్యాన్లలో హెచ్‌డీ పీఈ కేబుల్ బండిల్స్‌ను తీసుకువచ్చారు. వాటిని పనిచోట దించాల్సి ఉంది. ఇదే మండలంలోని భీమునిగుండం కొత్తూరు వద్ద తుమ్మలచెరువు చదల వాడ కాలువ సమీపంలో డీసీఎం వ్యాన్లను నిలిపి ఉంచగా.. సుమారు 15 మిగతా 2వ పేజీలో



దూసుకువచ్చిన లారీ ఇదే..

## మళ్లీ రంగంలోకి సీసీఐ!

(మొదటిపేజీ తరువాయి) కూడా వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పత్తి దిగుబడులు గణనీయంగా తగ్గిపోవటంతో డిమాండ్ పెరిగింది. మార్కెట్‌లో పత్తి దొరకని పరిస్థితి ఏర్పడింది. బుధవారం వరంగల్ జోన్ పరిధిలోని అన్ని వ్యవసాయ మార్కెట్లలో, సీసీఐ కేంద్రాల్లో కూడా తిరిగి పత్తి కొనుగోలు చేయాలని భారత పత్తి సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు అన్ని చోట్ల ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. తాజాగా మార్కెట్లలో వ్యాపారులతో కలిసి పత్తి కొనుగోలు చేసేందుకు సీసీఐ తిరిగి సిద్ధమవుతోంది. మార్కెట్‌లో వ్యాపార పోటీ పెరగటం వల్ల పత్తి ధరలు మరింత పెరిగే అవకాశం కన్పిస్తోంది. ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 1,26,000 క్వింటాళ్లను సీసీఐ కొనుగోలు చేసింది. ఖమ్మంలో 45,000 క్వింటాళ్లు, నేలకొండపల్లిలో 50,000 క్వింటాళ్లు, మధిరలో 11,000, ఏన్కూరులో 10,000, వైరాలో 10,000 క్వింటాళ్లను కొనుగోలు చేసింది. అదే వ్యాపారులు మాత్రం 6లక్షల క్వింటాళ్లకు పైగా కొనుగోలు చేశారు.

### వ్యవసాయ మార్కెట్ ధరలు

| సరకు | కనిష్ఠ | గరిష్ఠ |
|---|---|---|
| పత్తి | 4200 | 5050 |
| ఎండుమిర్చి | 6300 | 8821 |
| తాలుమిర్చి | 3000 | 4500 |
| పెసలు | 2500 | 4000 |
| కందులు | 3550 | 4025 |
| వేరుసెనగకాయలు | 2800 | 3800 |

### తెరపై ఈనాడు

| | |
|---|---|
| నర్తకి | ఖాకీ |
| వినోద | ఎంసీఏ |
| శ్రీతిరుమల | టైగర్ జిందా హై |
| ఆదిత్య | ఒక్క క్షణం |
| కిన్నెరసాని | 2కంట్రీస్ |
| శ్రీనివాస | హలో |
| శ్రీసుందర్ | ప్రాజెక్ట్ |

### చికెన్ ధరలు



వెన్‌కాబ్ (కిలో 1కి రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్ ఫారం ధర | 86 |
| రిటైల్ ధర | 108 |
| చికెన్ విత్ స్కిన్ | 157 |
| చికెన్ స్కిన్‌లెస్ | 178 |



# మృత్యు శకటం

(మొదటిపేజీ తరువాయి) మంది కూలీలు కేబుల్స్‌ను దించుతున్నారు. అదే సమయంలో సరిగ్గా ఉదయం 7 గంటల సమయంలో మణుగూరు నుంచి కొత్తగూడెం వైపు వచ్చే ఓ బొగ్గు లారీ రహదారి పక్కగా నిలిపి ఉంచిన వ్యాన్లలో ఒకదాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ప్రమాదం ధాటికి రెండు వ్యాన్లు కూడా పొలంలోకి దూసుకెళ్లాయి. ప్రమాదానికి కారణమైన లారీ సుమారు అర కిలోమీటరు దూరం వరకూ ముందుకు దూసుకెళ్లి నిలిచిపోయింది. ఈ సంఘటనలో బండిల్స్‌ను దించుతున్న వారిలో పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన శివరాత్రి గోపయ్య (50), గుంటూరు జిల్లా కొండారెడ్డి గూడెం గ్రామానికి చెందిన వ్యాను డ్రైవరు తోడేటి భాగ్యారావు (23) అక్కడికక్కడే మృతిచెందారు. భద్రాచలంలోని ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డి గూడెం పట్టణానికి చెందిన సన్నాసిపేట కనకారావు (43) అనే కూలీ మృత్యువాతపడ్డారు. జంగారెడ్డి గూడేనికి చెందిన ఒకే కుటుంబం, బంధువులైన మరో ఆరుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని అశ్వాపురం సీఐ అల్లం నరేందర్, ఎస్సైలు రవీందర్, రాంజీ సందర్శించారు. ప్రమాదానికి కారణమైన లారీ మణుగూరుకు చెందినదిగా భావిస్తున్నారు. లారీ డ్రైవరు ప్రస్తుతం పరారీలో ఉన్నారు.



సంఘటన ప్రదేశంలోనే మృతి చెందిన శివరాత్రి గోపయ్య

### మృతులు వీరే..

★ శివరాత్రి గోపయ్య (50): పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు గ్రామానికి చెందిన వ్యక్తి. భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కూలీ పనులే జీవనాధారం. అశ్వాపురం మండలంలోని నెల్లిపాక బంజర వద్ద తాత్కాలిక నివాసాల్లో ఉంటున్నారు.

★ తోడేటి భాగ్యారావు(23): గుంటూరు జిల్లా కొండారెడ్డిగూడెం గ్రామవాసి. ప్రస్తుతం రాజమండ్రిలో ఉంటున్నారు. డీసీఎం వ్యాను డ్రైవరుగా పనిచేసేవారు. కూలీలు కేబుల్ బండిల్స్‌ను అన్‌లోన్ చేస్తుండగా వాహనం వద్ద నిల్చుని ఉన్నారు. ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందారు.

★ సన్నాసిపేట కనకారావు (43): పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం వాసి. భార్య, ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. కూలీ పనులే జీవనాధారంగా జీవిస్తున్నారు. మొండికుంట వద్ద తాత్కాలిక నివాసాల్లో ఉంటున్నారు.

### గాయపడిన వారు వీరే..

క్షతగాత్రులంతా పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డి గూడెంకు చెందిన వారే. అందరూ ఒకే కుటుంబానికి చెందిన సభ్యులు, బంధువులు అవుతారు. కొందరు అశ్వాపురం మండలంలోని నెల్లిపాక బంజర, మరికొందరు మొండికుంట వద్ద తాత్కాలిక నివాసాల్లో ఉంటున్నారు.

★ శివరాత్రి రామచంద్రరావు(30) నడుం, కాళ్లూ చేతులకు తీవ్ర గాయాలయ్యాయి.

★ శ్రీనివాస్ (36) కాలు, తలకు గాయాలయ్యాయి.

★ తురక వెంకన్న (25) కాళ్లూ చేతులకు తీవ్ర గాయాలయ్యాయి.

★ బెజవాడ రాజు (20) పక్కటెముకలు విరిగాయి. కాళ్లూ చేతులకు గాయాలయ్యాయి.

★ సంపంగుల వెంకటేశ్ (45) ఛాతికి బలమైన దెబ్బలు తగిలాయి.

★ భద్రరాజు (54) కన్నుకు దెబ్బ తగిలింది. కాళ్లూ చేతులకూ గాయాలయ్యాయి.

### కొద్ది సేపైతే క్షేమంగా ఇళ్లకు..

పొట్టచేత పట్టుకుని బతుకు దెరువుకై వచ్చిన వారు పరాయి చోట ప్రాణాలు విడిచిన దుర్ఘటన తీరును చూసి చూపరులు, స్థానికులు కంటతడిపెట్టారు. ప్రమాదానికి ముందు... కూలీలు రోజు మాదిరిగానే ఉత్సాహంగా పనిని ప్రారంభించారు. గుంటూరు నుంచి రెండు కేబుల్స్‌తో వచ్చిన వ్యాన్ల డ్రైవర్లు కూలీలను వారి కుటుంబాల వద్దకు వెళ్లి ఎక్కించుకున్నాయి. మార్గం మధ్యలో నెల్లిపాకబంజర, మల్లెలమడుగు గ్రామాల వద్ద కేబుల్స్‌ను అన్‌లోడ్ చేశారు. ఆ సందర్భంగా కూలీలు చర్చించుకుని మిగిలిన కేసుల్స్‌ను మొండికుంట, చదలవాడ కాలువల పక్కన దించేస్తే పనిపూర్తయిందనుకున్నారు. ఆ తర్వాత నేరుగా ఇళ్లకు తిరిగి రావొచ్చని భావించారు. అనుకున్నట్లే మొండికుంట వద్ద కొన్ని బండిల్స్‌ను అన్‌లోడ్ చేశారు. చివరగా భీముని గుండం కొత్తూరు వద్ద బండిల్స్‌ను దింపుతుండగా బొగ్గు లారీ మృత్యువు రూపంలో దూసుకొచ్చి ముగ్గురిని బలిగొంది. కొద్దిసేపు గడిస్తే కూలీలు క్షేమంగా ఇంటికి చేరేవారని ఆ మార్గంలో ఉదయం నడకకు వచ్చిన పలువురు బాధతో తెలిపారు.

### ఎంతో కష్టపడి పనిచేసేవారు..

రోడ్డు ప్రమాదంలో చిక్కుకున్న కూలీల కుటుంబాలన్నీ రెక్కాడితే కాని డొక్కాడనివే. అంతా జంగారెడ్డిగూడెంకు చెందిన వారే. వీరంతా బంధువులే అవుతారు. ఎక్కడ పని ఉంటే అక్కడకు వెళ్లడం.. అనుకూల ప్రదేశాల్లో తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేసుకోవడం చేస్తుంటారు. పనులు పూర్తికాగానే మరోచోటుకు వెళ్తుంటారు. కొంతకాలంగా అశ్వాపురం మండలంలో బీఎస్ఎన్ఎల్ హెచ్‌డీ పీఈ కేబుల్ లైన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఓ గుత్తేదారు ఆయా కుటుంబాలను ఒప్పందంపై ఇక్కడకు తీసుకొచ్చారు. సుమారు నెలరోజులుగా పలు కూలీ కుటుంబాలు ఇక్కడ పనిచేస్తున్నాయి. ఆయా కుటుంబాల మహిళలు కూడా మగవారితో సమానంగా కష్టపడి పనులను సకాలంలో పూర్తిచేసేవారు.

### బిక్కుబిక్కుమంటూ..

కూలీ కుటుంబాలకు చెందిన బడిఈడు పిల్లలు చదువును మానేసి తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధిత కుటుంబాలకు చెందిన చిన్నారులు భీతిల్లారు. ఏం జరిగిందో అర్థంకాక బిక్కుబిక్కుమంటూ నివాసాల వద్దే ఉండిపోయారు. మిగిలిన కుటుంబ సభ్యులు, బంధువులంతా భద్రాచలం వైద్యశాలకు తరలివెళ్లారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.





మృతి చెందిన తోడేటి భాగ్యారావు, కనకారావు



భద్రాచలం వైద్యశాల వద్ద విషాదంలో బంధువులు

# లాభాల జాతరే..

(మొదటిపేజీ తరువాయి) నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఎక్కువ శాతం కొత్తగూడెం నుంచి మేడారం జాతరకు భక్తులు తరలి వెళ్లనున్న నేపథ్యంలో అవకాశాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. మేడారం జాతరకు సంబంధించి బస్సులను కేటాయించేందుకు ఈ నెల 27 నుంచే ఆర్టీసీ అధికారులు ఆపరేషన్ ప్రారంభించనున్నారు. ఫిబ్రవరి 4వరకు ఆపరేషన్స్ కొనసాగనున్నాయి. రోడ్డు మార్గం ద్వారా(ఆర్టీసీ) ప్రయాణాలు సాగించే వారి సంఖ్య అధికమే అయినప్పటికీ రైలు మార్గం ద్వారా వెళ్లే వారి సంఖ్య సైతం అదే స్థాయిలో ఉండే ఆస్కారం లేకపోలేదు. చాలామంది ప్రయాణికులు రైలు మార్గం ద్వారా వరంగల్ వరకు వెళ్లి అక్కడి నుంచి మేడారం జాతరకు పయనం అవుతుంటారు. ఈ నేపథ్యంలో అలాంటి వారిని తిరుగు ప్రయాణంలో ఆర్టీసీ ద్వారా తరలించడంపైనే దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలోనే వచ్చే నెల 3,4 తేదీల్లో సైతం తిరుగు పయనం అయ్యే వారికి బస్సుల సౌకర్యాన్ని సమకూర్చేందుకు సన్నాహాలు చేపడుతున్నారు. మొత్తం భద్రాద్రి జిల్లా కొత్త డివిజన్ పరిధిలోని కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం డిపోల పరిధి నుంచి 190 బస్సులను కేటాయించేందుకు ప్రాథమికంగా నిర్ణయించుకున్నారు. అందు కోసం మూడు డిపోల పరిధిలోని సాధారణ బస్సులనే కాకుండా నల్గొండ జిల్లా, మధిర డిపోల పరిధి నుంచి కొన్ని బస్సులను దిగుమతి చేసుకుని వాటిని సైతం ప్రత్యేక సర్వీసులుగా కొనసాగించేందుకు రంగం సిద్ధంచేశారు. ఇది ప్రాథమికంగా తీసుకున్న నిర్ణయమే అయినప్పటికీ అవకాశాన్ని బట్టి(ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని) అదనంగా మరో 15 సర్వీసుల వరకు పెంచుకునే అవకాశాలను అన్వేషిస్తున్నారు. ఈ లెక్కన ఇతర జిల్లాల నుంచి మొత్తానికి 80 సర్వీసులను అదనంగా ఆర్టీసీ అధికారులు దిగుమతి చేసుకోనున్నారు.

### భద్రాద్రి జిల్లా కేంద్రంలో మూడు కేంద్రాలు

జిల్లాకేంద్రం కొత్తగూడెం నుంచి మేడారం బస్సులను తరలించేందుకు అధికారులు ఎప్పటి మాదిరిగానే మూడు కేంద్రాలు(పాయింట్ల)ను గుర్తించారు. అందులో కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండు, పాల్వంచ, టేకులపల్లి నుంచి ప్రత్యేక సర్వీసులు ఆరంభమవుతాయి. ఈ మూడు కేంద్రాల నుంచి మొత్తం 130 సర్వీసులను తిప్పనున్నారు. అందులో కొత్తగూడెం డిపో నుంచి 90 బస్సులు, పాల్వంచ నుంచి 30, టేకులపల్లి నుంచి 10 బస్సులు నడిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కొత్తగూడెం డిపోలో 86 బస్సుల వరకు(అద్దె, ఆర్టీసీ) బస్సులున్న నేపథ్యంలో వాటిల్లో నుంచి కేవలం 40 బస్సులను వినియోగించుకుంటూ మిగతా వాటిని నల్గొండ, మధిర డిపోల నుంచి తీసుకొచ్చేందుకు సమాయత్తమవుతున్నారు.

### నోడల్ పాయింట్‌గా మణుగూరు

కొత్తగూడెం డివిజన్‌లో నోడల్ పాయింట్‌గా మణుగూరు ప్రాంతాన్ని నిర్దేశించారు. కొత్తగూడెంలోని మూడు పాయింట్ల నుంచి వెళ్లే బస్సులు, భద్రాచలం డిపో నుంచి మేడారం వెళ్లాల్సిన బస్సులు, మణుగూరు డిపో నుంచి మేడారం వెళ్లాల్సిన బస్సులన్నీ కూడా మణుగూరు మీదుగానే తరలి వెళ్లేలా చర్యలు చేపడుతున్నారు. అందు కోసం నోడల్ పాయింట్‌గా మణుగూరును నిర్దేశించుకున్నారు. డివిజనల్ పరిధిలోని బస్సులన్నీ సైతం మణుగూరు మీదుగానే మేడారం జాతరకు వెళ్లే విధంగా చర్యలు చేపట్టనున్నారు.

### ఖమ్మం నుంచి ఇల్లెందు మీదుగా

ఇక ఖమ్మం డివిజన్ నుంచి గతంలో ఇల్లెందు మీదుగా మేడారం జాతరకు సంబంధించిన బస్సులను తరలించారు. ఖమ్మం నుంచి వెళ్లేవాటికి ఇల్లెందు ప్రధాన పాయింట్‌గా నిలుస్తోంది. ఈ దఫా సైత ఖమ్మం నుంచి ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు మీదుగా మంగపేట నుంచే బస్సులను తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు సన్నాహాలు చేస్తున్నారు. 2016లో ఖమ్మం డిపో నుంచి 2016లో 106 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. మొత్తం 1040 ట్రిప్పుల్లో 52 వేల మందిని తరలించారు. సత్తుపల్లి డిపోకు సంబంధించిన బస్సులను వాజేడు, వెంకటాపురం, చర్ల మీదుగా మేడారం వైపు నడిపించారు. ఇందు కోసం 40 ప్రత్యేక సర్వీసులను కొనసాగించి 916 ట్రిప్పులతో 45,800ల మంది భక్తులను తరలించి రూ. 20,72,216 ఆదాయాన్ని ఆ డిపో ఖాతాలో వేసుకుంది. మధిర డిపోకు సంబంధించిన బస్సులను కొత్తగూడెం పరిధిలోకి వినియోగించుకోవడం ఆనవాయితీగానే వస్తోంది. రెండేళ్లక్రితం జరిగిన జాతరకు మధిర నుంచి కొత్తగూడెం డిపోకు 30 బస్సులను వినియోగించుకున్నారు.

# స్వచ్ఛతకు 'పరీక్ష'

(మొదటిపేజీ తరువాయి) పొడి చెత్త సేకరణ చేస్తున్నా డంపింగ్ యార్డు దగ్గరకు వచ్చేసరికి ఒక్కటవుతునఆనయి. అన్ని పురపాలకాల్లోని యార్డుల్లో ప్రతీ రోజు ఉత్పత్తి అవుతున్న చెత్తంతా గుట్టలు గుట్టలుగా పేరుకపోతుంది. మరో పక్క ఎక్కడి చెత్తను అక్కడే పోగు చేసి దహనం చేస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా పదేళ్లకు పైగా ఇదే తంతు పురపాలకాల్లో కొనసాగుతోంది. కచ్చితంగా చెప్పాల్సి వస్తే అసలు తడి, పొడి చెత్త సేకరణ వేర్వేరుగా జరగడం లేదు. దీనికి సంబంధించిన సామగ్రి నేటికీ పూర్తిస్థాయిలో అందుబాటులో లేదు.

### రీసైక్లింగ్ ఏది?

పట్టణాల్లో ఉత్పత్తి అవుతున్న చెత్తను చూస్తే ప్రతీ చోటా రీసైక్లింగ్ వ్యవస్థ అవసరమని అర్థమవుతుంది. దీన్ని కొన్ని జిల్లాలు అమలు చేస్తూ ఆదాయాన్ని పొందుతుండగా.. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఆ దిశగా అడుగులు పడటం లేదు. దశాబ్ద కాలంగా చెత్త నిర్మూలన, చెత్తతో సంపద సృష్టిలాంటి మాటలు వింటూనే ఉన్నాం.. కానీ ఎక్కడా కార్యరూపం దాల్చడం లేదు. ఖమ్మం, కొత్తగూడెం, పాల్వంచ, సత్తుపల్లి, ఇల్లెందు, మధిర, మణుగూరు వంటి సంస్థల్లో ఎక్కువ ఇళ్లు ఉండే సముదాయాలు, హోటళ్లు, ఆసుపత్రుల ద్వారా రోజుకి 600నుంచి 750 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పన్నమవుతుంది. వీటి నిర్వహణకు, ఉద్యోగుల జీతభత్యాలకు సంబంధించి సుమారుగా రూ. 50కోట్ల వరకు ఖర్చు అవుతోంది. గతంలో ఖమ్మం జిల్లాలో, కొత్తగూడెంలో చెత్తను ఉపయోగించి విద్యుత్తు సేంద్రీయ ఎరువులు తయారు చేసేందుకు అధికారులు ప్రయత్నించారు. కానీ విఫలమయ్యారు. దీంతో పట్టణాల్లోని చెత్తంతా డంపింగ్ యార్డులకు చేరుతోంది. చెత్తను రీసైకిల్ చేసే విధానం లేకపోవడంతో తీసుకుపోయిన చెత్త మొత్తం కొండలా పేరుకపోతుంది. రోడ్లపై ఏర్పాటుచేసిన కుండీల్లో తడి, పొడి చెత్తలను వేరు చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వీటి నిర్వహణ మరింత కష్టంగా మారుతోంది. తడి, పొడి, వైద్య సంబంధిత ప్రమాదకర వ్యర్థాలను వేరువేరుగా నిర్వహించేందుకు రెండు జిల్లాలోని హోటళ్లు, రైల్వేస్టేషన్లు, పెద్ద పెద్ద హోటళ్లు, ఎక్కువగా ఇళ్లు ఉండే గృహ సముదాయాల వద్ద పచ్చ, నీలం, ఎరుపు, పసుపు రంగు డబ్బాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఎక్కడా ఏర్పాటు చేయలేదు. కొందరు ఏర్పాటుచేసినా పురపాలక సిబ్బంది చెత్తతో పాటు డబ్బాలను తీసుకెళ్తుండటంతో ఎవరూ ఆసక్తి చూపడం లేదు.

### నాలుగు పద్ధతుల్లో పరిశీలన..

స్వచ్ఛ సర్వేక్షణ్-2018 పోటీ కఠినతరమైంది. మైనస్ మార్కులు సైతం ఉంటాయి. స్వచ్ఛభారత్ మిషన్ జారీ చేసిన నిబంధనల ప్రకారం స్వచ్ఛత కార్యక్రమాలుండాలి. లేనిపక్షంలో మైనస్ మార్కులు వేస్తారు. నాలుగు పద్ధతుల్లో పరిశీలన ఉంటుంది.

1. **డాక్యుమెంటేషన్..:** మొదటి పట్టణానికి సంబంధించిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల అమలుకు డాక్యుమెంటేషన్ రూపొందించాలి.
2. **క్షేత్ర స్థాయి పరిశీలన..:** నగరపాలక, పురపాలక సంస్థలు సమర్పించిన డాక్యుమెంటేషన్ వివరాలు క్షేత్ర స్థాయిలో అమలవుతున్నాయో లేదా పరిశీలన చేస్తారు. లేకపోతే మైనస్ మార్కులు ఇస్తారు.
3. **తనిఖీలు..:** ఢిల్లీ నుంచి వచ్చే స్వచ్ఛభారత్ బృందం సభ్యులు పట్టణాల్లో తనిఖీలు నిర్వహిస్తారు. రైల్వే, బస్‌స్టేషన్లు, పాఠశాలలు, కళాశాలలు, ప్రధాన రహదారులు, పార్కులు, కూరగాయలు, మాంసం, వ్యవసాయ మార్కెట్లను పరిశీలిస్తారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండానే తనిఖీలు చేస్తారు.
4. **సిటిజన్ ఫీడ్‌బ్యాక్..:** ఇంటింటా చెత్తసేకరణ, తడి, పొడి చెత్తను వేరుచేయడం, శాస్త్రీయ పద్ధతుల్లో చెత్తను ఖననం చేయడం, శానిటేషన్ పనితీరు, 1969 టోల్‌ఫ్రీ నెంబర్‌కు వచ్చిన ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారు.

# అడ్తిదారుల విముఖత

**గుదిబండగా మారిన ప్రభుత్వ ఉత్తర్వు ▮నగదు డిపాజిట్, బ్యాంకు గ్యారంటీ తప్పని సరి ▮భారీగా పెంచిన ఫీజుతో ఆందోళన**

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

రాష్ట్రమార్కెటింగ్‌శాఖ గత నెల 27న విడుదల చేసిన ప్రభుత్వ ఉత్తర్వు నెం.58 వ్యవసాయ మార్కెట్లలో పనిచేస్తున్న అడ్తిదారులకు గుదిబండగా మారింది. ఇప్పటి వరకు నామమాత్రపు ఫీజు చెల్లించి వ్యాపారం చేసిన వీరు ఇక నుంచి నగదు డిపాజిట్లు, బ్యాంకు గ్యారంటీ భారీగా చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో వ్యాపారులంతా తాము పెద్ద మొత్తంలో చెల్లించి వ్యాపారం చేయలేమని చెప్పి ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఇది 'ఏ'గ్రేడు మార్కెట్. జిల్లాలోని ఇతర మార్కెట్లు వివిధ గ్రేడ్లలో ఉన్నాయి. ఒక్క ఖమ్మం వ్యవసాయ మార్కెట్లోనే కమీషన్ వ్యాపారులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఏన్కూరు, వైరా, మధిర, నేలకొండపల్లి, ఇల్లెందు, బూర్గంపాడు, కొత్తగూడెం మార్కెట్లలో చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారు. అలాగే రాష్ట్రంలో 'ఏ'నుంచి 'ఎఫ్' గ్రేడ్ల వరకు మార్కెట్‌లు ఉన్నాయి.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సుమారు 600ల మంది కమీషన్ వ్యాపారులు(అడ్తిదారులు) పని చేస్తున్నారు. ఇప్పటి వరకు ఒక్కొక్కరు కేవలం రూ.20వేల డిపాజిట్ మాత్రమే చెల్లించి వ్యాపారం చేస్తున్నారు. ఖరీదు దారులకు, రైతులకు మధ్య వీరు అనుసంధాన కర్తలుగా ఉండి రైతుల నుంచి 2శాతం కమీషన్ తీసుకొని వ్యాపారులకు సరకు అమ్మిపెడ్తున్నారు. ఇప్పుడు ఉన్నపళంగా ప్రభుత్వం ఒక్కసారి డిపాజిట్‌తో పాటు బ్యాంకు గ్యారంటీ నిబంధన కూడా పెట్టటంతో వీరి గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయ్యింది. ఇక నుంచి నగదు డిపాజిట్ చేయటంతో పాటు బ్యాంకు గ్యారంటీ ఇస్తేనే వ్యాపారం చేయాల్సి ఉంటుంది. ఇప్పుడున్న పాత కమీషన్ వ్యాపారులకు, కొత్తగా లైసెన్సులు తీసుకునే వారికి కూడా ఈనిబంధన వర్తిస్తుంది. వచ్చే ఏప్రిల్ 1వతేదీ లోగా రెన్యువల్స్ పూర్తి చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు సుమారు 52పేజీల విధివిధానాలను కూడా వ్యవసాయ మార్కెట్లకు పంపింది. త్వరలో లైసెన్సులు రెన్యూవల్ జరగనున్న సమయంలో తీసుకున్న ఈనిర్ణయాన్ని కమీషన్ వ్యాపారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రైతులు వ్యవసాయ మార్కెట్లలో విక్రయించిన సరకు కొనుగోలు చేసిన తర్వాత కొంత మంది వారికి డబ్బులు ఇవ్వకుండా ఐపీలు పెడుతుండటంతో రైతులకు భరోసా కల్పించటం కోసం ప్రభుత్వం ఈనిర్ణయం తీసుకుంది. దీని వల్ల రైతులకు రక్షణ కలిగే అవకాశం ఉంది. అయితే తాము సకాలంలోనే డబ్బులు చెల్లిస్తున్నామని, ఖరీదు దారులు మాత్రమే తమకు ఇవ్వకపోవటం వల్ల ఇబ్బందిపడుతున్నామని అడ్తిదారులు చెబుతున్నారు.

● ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అడ్తిదారులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. గత నెల 30, 31తేదీల్లో వరంగల్ వ్యవసాయ మార్కెట్లో తమ ఆందోళన చేసి తమ నిర్ణయాన్ని ప్రభుత్వానికి తెలిపారు. అదే విధంగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో కూడా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

**ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం అడ్తిదారులు ఇలా చెల్లించాల్సి ఉంటుంది..**

| మార్కెట్ గ్రేడు | వ్యాపారం విలువ | నగదు డిపాజిట్లు (రూ.లక్షల్లో) | బ్యాంకుగ్యారంటీ |
|---|---|---|---|
| ఏగ్రేడు | రూ.20లక్షల పైన | రూ.10.00లక్షలు | రూ.25.00లక్షలు |
| బిగ్రేడు | 10-20 | 5.00 | 15.00 |
| సిగ్రేడు | 5.00-20 | 3.00 | 9.00 |
| డిగ్రేడు | 3.00-5.00 | 2.00 | 6.00 |
| ఈగ్రేడు | 1.00-3.00 | 1.00 | 3.00 |
| ఎఫ్‌గ్రేడు | 1.00 లోపు | 0.50 | 1.00 |




ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

## న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి: జిల్లా న్యాయమూర్తి

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా న్యాయమూర్తి ఎం.లక్ష్మణ్ అన్నారు. నూతన సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా జిల్లా బార్ అసోసియేషన్ బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కేక్‌కట్ చేసి అందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ క్యాంటిన్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా అందరి సమస్యలను పరిష్కరించే క్రమంలో న్యాయవాదుల సమస్యల పట్లకూడా సానుకూలంగా స్పందిస్తానన్నారు. కొత్త ఏడాదిలో ఖమ్మం జిల్లా ప్రజలందరూ సుఖశాంతులతోపాటు ప్రశాంత జీవనాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి. పట్టాభి మాట్లాడుతూ న్యాయవాద వృత్తి సంక్షోభంలో ఉందన్నారు. ఏడేళ్ల శిక్షపడే నేరాలకు పోలీసు స్టేషన్లలో బెయిలు ఇస్తున్నందున న్యాయవాదులు పనిని కోల్పోయారన్నారు. జూనియర్ న్యాయవాదుల సంక్షేమానికి అందరూ కృషి చేయాలని కోరారు. సహకార సంఘాన్ని నిర్మాణాత్మకంగా రూపొందించాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో ఆదనపు జిల్లా జడ్జి ప్రేమలత, ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి డా.జ్ఞానేశ్వర్‌రావు, న్యాయసేవా సంస్థ కార్యదర్శి వినోద్‌కుమార్, పీడీఎం అపర్ణాదేవి, న్యాయమూర్తులు రెహెనా, గీతారాణి, ఉషాశ్రీ, రుబీనా ఫాతిమా, సీనియర్ న్యాయవాది పోట్ల మాధవరావు, ఉపాధ్యక్షుడు సుధీసింగ్, కార్యదర్శులు ఎస్‌కె జానీమియా, గద్దల దిలీప్‌కుమార్, మహిళా ప్రతినిధి దొబ్బల శిరీష తదితరులు పాల్గొన్నారు.




కేక్ కట్ చేస్తున్న న్యాయమూర్తి ఎం.లక్ష్మణ్

## దిల్లీ వెళ్లిన కలెక్టర్ లోకేశ్‌కుమార్

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ లోకేశ్‌కుమార్ బుధవారం దిల్లీ వెళ్లారు. ఖమ్మం నుంచి ఉదయం బయలుదేరి మహబూబాబాద్ వెళ్లి అక్కడ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుని విమానంలో దిల్లీ వెళ్లారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'న్యూ ఇండియా' పథకంలో పూర్వ ఖమ్మం జిల్లాను చేర్చింది. దేశంలో వెనుకబడిన 115 జిల్లాలను న్యూ ఇండియా పథకంలో చేర్చారు. ఈ జిల్లాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయనుంది. ఇందులో భాగంగా ఇటీవల న్యూ ఇండియా పథకం అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి జిల్లాకు నోడల్ అధికారిగా నియమితులైన కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి రాజీవ్ రాజన్ మిశ్రా జిల్లాలో పర్యటించి వెళ్లారు. న్యూ ఇండియా పథకం అమలుపై సమీక్షించేందుకు గురు, శుక్రవారాలు 115 జిల్లాల కలెక్టర్లతో రెండు రోజుల సమావేశం దిల్లీలో నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు కలెక్టర్ లోకేశ్ కుమార్ దిల్లీ వెళ్లినట్లు సమాచారం. ఆయన తిరిగి సోమవారం ఖమ్మం చేరుకోనున్నారు.

## దివ్యాంగులకు ఉచిత శిక్షణ

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, బ్యాంకింగ్ వంటి ఉద్యోగాలకు దరఖాస్తు చేసే దివ్యాంగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇప్పించనున్నట్లు మహిళా శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సంక్షేమ అధికారిణి ఆర్.వరలక్ష్మి తెలిపారు. డిగ్రీ, పీజీ, ఇతర విద్యార్హతలు కలిగి ఉన్న అభ్యర్థులు వీడీవోస్ కాలనీలోని తమ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారం కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీవీసీసీ.తెలంగాణ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తులను తమ కార్యాలయంలో సమర్పించాలని, తదుపరి వచ్చే దరఖాస్తులను తిరస్కరించనున్నట్లు డీడబ్ల్యూవో బుధవారం ఒక ప్రకటనలో స్పష్టంచేశారు.

## చెన్నై అధికారుల బృందం పర్యటన

**సీతారామా ప్రాజెక్టు అటవీ భూములు పరిశీలన**

**ఖమ్మం నగరం, న్యూస్‌టుడే:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీతారామా ప్రాజెక్టు నిర్మాణంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 3800 అటవీ భూములు సేకరించాల్సి ఉంది. రిజర్వ్ ఫారెస్ట్ భూములు కావటంతో కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖకు చెందిన చెన్నైలోని ప్రాంతీయ కార్యాలయం ఉన్నతాధికారుల బృందం అటవీ భూములు పరిశీలించేందుకు బుధవారం ఉదయం ఖమ్మం చేరుకుంది. సీతారామా ప్రాజెక్టు అధికారులు చెన్నై అధికారుల బృందాన్ని తోడ్కొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. సీతారామా ప్రాజెక్టు కాలువల తవ్వకానికి రిజర్వ్ ఫారెస్ట్ భూములు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం అంతే మేరకు వేర్వేరు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు కేంద్ర ప్రభుత్వంలోని అటవీ శాఖకు అప్పగించాల్సి ఉంటుంది. రిజర్వ్ ఫారెస్ట్ భూములు 3800 ఎకరాలు సేకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల జిల్లాల్లో ప్రభుత్వ భూములు కేంద్ర అటవీ శాఖకు అప్పగించేందుకు భూములు గుర్తించింది. చెన్నై నుంచి వచ్చిన ఐఎఫ్ఎస్ అధికారుల బృందంలో డాక్టర్ ఎం.రాంగోపాల్‌రెడ్డి (సీసీఎఫ్), డి.సత్యన్ (సీఎఫ్), ఆర్. శోభ (తెలంగాణ) ఉన్నారు. ఈబృందం బుధవారం చర్ల మండలం, అశ్వాపురం మండలం అమీర్దా, బూర్గంపాడు మండలం కృష్ణసాగర్, ముల్కలపల్లి మండలం పూసుగూడెం అటవీ ప్రాంతంలో పర్యటించారు. ఈప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర అటవీ శాఖకు ఇచ్చేందుకు గుర్తించిన ప్రభుత్వ భూములను అధికారులు పరిశీలించారు. దీంతోపాటు కిన్నెరసాని అభయారణ్యంలో వన్యప్రాణుల సంరక్షణ ప్రదేశాలను సైతం పరిశీలించారు. బుధవారం రాత్రి కొత్తగూడెంలో బస చేశారు. గురు, శుక్రవారాల్లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఈ బృందం వెంట సీతారామా ప్రాజెక్టు ఛీఫ్ ఇంజినీర్ సుధాకర్, ఎస్ఈ తన్నీరు నాగేశ్వరరావు, ఈఈలు, డీఈలు ఉన్నారు.



అటవీ భూములను పరిశీలిస్తున్న చెన్నై అధికారుల బృందం

## ఇద్దరు ఎంపీడీఓలకు పోస్టింగ్

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: టీఎస్‌పీఎస్సీ ద్వారా గ్రూప్-1 పరీక్షలో ఎంపికైన ఇద్దరు ఎంపీడీఓలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేటాయిస్తూ ఇటీవల పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాకు కేటాయించిన చిట్యాల సుభాషిణికి దమ్మపేట ఎంపీడీఓగా, బాణోత్ రవికుమార్‌కు మణుగూరు ఎంపీడీఓగా పోస్టింగ్ కల్పిస్తూ జడ్పీ సీఈఓ మారుపాక నాగేశ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దమ్మపేట, మణుగూరు ఎంపీడీఓ పోస్టులు కొంతకాలంగా ఖాళీగా ఉన్నాయి. దీంతో ఖాళీలను భర్తీ చేశారు.

## బ్రాడ్‌బ్యాండ్ విస్తరణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు

**పార్లమెంటులో ఎంపీ లిఖిత పూర్వక ప్రశ్న**

ఖమ్మం బుర్హాన్‌పురం, న్యూస్‌టుడే: దేశంలో బ్రాడ్‌బ్యాండ్ విస్తరణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటని ఖమ్మం పార్లమెంటు సభ్యుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం పార్లమెంటులో లిఖితపూర్వకంగా ప్రశ్నించారు. దీనికి ఆశాఖ మంత్రి మనోజ్‌సిన్హా సమాధానమిస్తూ ఇప్పటి వరకు దానిని విస్తరించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని, భారత్‌టెల్, ఆప్టికల్ ఫైబర్ కనెక్టివిటీతో లక్ష గ్రామాల్లో అంతర్జాల సేవలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు రెండో దశలో తెలంగాణ రాష్ట్రంలో పలు నమూనాలను ఎంపిక చేసి, ఆమోదించినట్లు ఆయన తెలిపారు. దేశంలోని 6647 గ్రామపంచాయతీల్లో రూ.1243.23 కోట్లతో డిజిటలైజేషన్ పనులు నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

# సత్తుపల్లి

## మల్లవరంలో సీసీ రహదారి నిర్మాణం ప్రారంభం

**తల్లాడ, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని మల్లవరం గ్రామంలో బుధవారం సీసీ రహదారి నిర్మాణ పనులను సర్పంచి మేడి సీతారాములు ప్రారంభించారు. గ్రామ పంచాయతీ టీఎఫ్‌సీ నిధులు సుమారు రూ. 2లక్షలతో రహదారి నిర్మాణ పనులను చేపట్టినట్లు సర్పంచి తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు బెల్లంకొండ శ్రీనివాసరావు, ఎర్రి నరసింహారావు, కటికి కృష్ణయ్య, కటికి చిట్టెమ్మ, దుగ్గిదేవర నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ రాజకీయ విధానాలు టీ-మాస్‌తోనే సాధ్యం

**సత్తుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే:** ప్రత్యామ్నాయ రాజకీయ విధానాలు టీ-మాస్‌తోనే సాధ్యమని, ప్రజలు ఈ ఉద్యమంలో ఉద్ధృతంగా పాల్గొనాలని టీ-మాస్ జిల్లా నాయకుడు బత్తుల లెనిన్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని మూడో వార్డులో జరిగిన ఇంటింటికీ టీ-మాస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వస్తే తమ ఆశలు నెరవేరుతాయని ప్రజలు భావించి అనేక మంది అమరుల త్యాగాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారని, అలాంటిది రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రకులాల పేదల ఆశలు అడిఆశలయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఎం.పాండురంగారావు, కె.సర్వేశ్వరరావు, సప్పిడి భాస్కరరావు, వెంకటేశ్వరరావు, రమాదేవి, బండి శ్రీను పాల్గొన్నారు.

## పట్టణంలో మాజీ మంత్రి సంభాని పర్యటన

**సత్తుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే:** మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ బుధవారం పట్టణంలో పర్యటించారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం కిరణ్ సోదరి దయామణికి వివాహం కాగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. స్థానికంగా పలువురిని పరామర్శించారు. సంభాని వెంట కాంగ్రెస్ నాయకులు పరెడ్ల సత్యనారాయణరెడ్డి, కొర్రపాటి సాల్మన్‌రాజు, ఉడతనేని అప్పారావు, గాదె చెన్నకేశవరావు, పింగిలి సామ్యేలు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ విప్లవ స్త్రీ... సావిత్రిబాయి పూలే

### ఘనంగా జయంతి వేడుకలు

**సత్తుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలం, పట్టణంలో సావిత్రిబాయి పూలే 187వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కళాభారతి ఆడిటోరియంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షుడు పాలపాటి గోవర్ధన్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు ఎస్సై వసంతకుమార్ హాజరై మాట్లాడుతూ దేశంలో మొదటి ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయిపూలే పని చేశారని అన్నారు. ప్రస్తుత కాలంలో మహిళలపై అనేక దాడులు సాగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీ-మాస్ జిల్లా నాయకుడు మోరంపూడి పాండు రంగారావు, జిల్లా అధ్యక్షుడు చింతల రమేష్, సుధారాణి, పట్టణ అధ్యక్షుడు ఎం.శివ, నివాస్, జయ్, బాజీ పాల్గొన్నారు.

✸ పట్టణంలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మిని విద్యార్థులు పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కంకటి వెంకటేశ్వరరావు, మురళి, బోసు, వెంకటేశ్ పాల్గొన్నారు.

✸ స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి దిశ జిల్లా కమిటీ సభ్యుడు డాక్టర్ మట్టా దయానంద్‌విజయకుమార్, ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాసరావు, భాజపా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మద్దిశెట్టి సామేలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాఘవాచార్యులు, రాంబాబు, సాగర్, హైమావతి పాల్గొన్నారు.



తల్లాడలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పిస్తున్న టీమాస్ సభ్యులు

**తల్లాడ, న్యూస్‌టుడే:** భారతదేశ మొట్టమొదటి ఉపాధ్యాయురాలు, అభ్యుదయ మహిళ, క్రాంతిజ్యోతి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను అభ్యుదయ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మల్లవరంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పండ్లు పంపిణీ చేశారు. యువజన సంఘం అధ్యక్షులు షేక్ మగ్బుల్‌పాషా మాట్లాడుతూ ప్రజలను చైతన్య పరుస్తూ రండి చదువుకోవటానికి, చదవండి అని ప్రచారం చేస్తూ 1846 నుంచి 1876 వరకూ పూలే దంపతులు 50కి పైగా పాఠశాలలను శూద్రులు, అతిశూద్రుల, బాలికల కోసం ఏర్పాటుచేశారని వివరించారు. కార్యక్రమంలో ఈలప్రోలు నరసింహారావు, షేక్ నాగుల్‌మీరా, సీహెచ్ హనుమంతు, మొహిన్‌పాషా, రఫీ, కోటయ్య, గౌరి తదితరులు పాల్గొన్నారు.

### టీమాస్ ఆధ్వర్యంలో...

స్థానిక బాలభారతి విద్యాలయంలో సావిత్రిబాయి పూలే 187వ జయంతి వేడుకలను టీమాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టీమాస్ మండల నాయకురాలు శీలం పకీరమ్మ మాట్లాడుతూ సావిత్రిబాయి మహిళల కోసం, మహిళల చదువుకోసం, అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని వివరించారు. జనవరి 3ని భారత మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను టీమాస్ మండల కమిటీ డిమాండ్ చేసింది. కార్యక్రమంలో తమ్మిశెట్టి నాగమణి, సత్తెనపల్లి నరేశ్, తమ్మిశెట్టి శ్రీను, కోటగిరి రాధ, ప్రవీణ్, గౌసియా తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న విద్యార్థులు

**వేంసూరు, న్యూస్‌టుడే:** సావిత్రిబాయి పూలే నేటి మహిళలకు స్ఫూర్తిదాయకమని మండల టీమాస్ కన్వీనరు చంద్రశేఖర్ అన్నారు. స్థానిక యర్రా రామయ్య భవనంలో బుధవారం నిర్వహించిన సావిత్రీబాయిపూలే 186వ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అరవపల్లి జగన్‌మోహనరావు, గోపాలరావు, సీపీఎమ్ నాయకులు కొత్తా సత్యనారాయణ, టీమాస్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

**కల్లూరు, న్యూస్‌టుడే:** సావిత్రిబాయి పూలే 187వ జయంతిని స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. టీమాస్, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బండి శ్రీలక్ష్మిని సన్మానించారు.

**వీఎం బంజర్(పెనుబల్లి), న్యూస్‌టుడే:** వీఎం బంజర్‌లో టీమాస్(సామాజిక ప్రజాసంఘాల ఐక్యవేదిక) ఆధ్వర్యంలో బుధవారం జ్యోతిసావిత్రిబాయి పూలే 187 జయంతి వేడుకల్ని సంఘ కన్వీనర్ తాండ్ర రాజేశ్వర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. సంఘ నాయకులు కె.దేవమందిరం చలమాల విఠల్‌రావు ప్రసంగించారు. సామాజిక పరివర్తన కోసం పరితపించిన సామాజిక విప్లవకారిణి క్రాంతి జ్యోతిసావిత్రిబాయి పూలే అని కొనియాడారు. మామిళ్ల వెంకటేశ్వర్లు, చిరంజీవి, కుక్కా శ్రీనివాసరావు, మరీదు వాసు, షేక్ భాషా, తేళ్లూరి నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## కలల్ని సాకారం చేసుకోండి

**సత్తుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే:** కలలను కనడమే కాదు. . వాటిని సాకారం చేసుకోవాలని దిశ జిల్లా కమిటీ సభ్యుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన జన్మదినం సందర్భంగా స్థానిక పాత సెంటర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి రూ.25వేలను ప్రధానోపాధ్యాయుడు ఎన్.రాజేశ్వరరావుకు అందజేశారు. పదేళ్లుగా పాఠశాల అభివృద్ధికి ఆర్థికసాయం అందిస్తున్న దయానంద్‌కు పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

## అగ్ని ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

**కిష్టారం (సత్తుపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే:** అగ్ని ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలైన ఘటన బుధవారం మండల పరిధిలోని కిష్టారంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామంలోని ఉడతనేని సత్యం బజారుకు చెందిన దురిశేటి తులశమ్మ కట్టెల పొయ్యిపై వంట చూస్తూ మండుతున్న పొయ్యిలో కిరోసిన్ పోయడంతో ప్రమాదవశాత్తు మంటలు పెరిగి తులశమ్మకు అంటుకున్నాయి. దీంతో ఆమెకు తీవ్ర గాయాలు కాగా సత్తుపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రానికి 108 ద్వారా తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

## లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**తుంబూరు (సత్తుపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే:** మండల పరిధిలోని తుంబూరు శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి భక్తులు ప్రత్యే పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. ధనుర్మాసం సందర్భంగా శ్రీరామయాగం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

### రేజర్ల రామాలయంలో...

**రేజర్ల (సత్తుపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే:** మండల పరిధిలోని రేజర్ల రామాలయంలో బుధవారం శ్రీరాముడి జన్మనక్షత్రమైన పునర్వసు సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమం యొక్క విశిష్టతను ప్రముఖ ప్రవచనకర్త శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల విరాళం

**కుచపర్తి(వేంసూరు), న్యూస్‌టుడే:** మండల పరిధిలోని కుంచపర్తి ఉన్నతపాఠశాల నుంచి జాతీయ ప్రతిభా పురస్కార ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులు ఆ పాఠశాల అభివృద్ధికి మూకుమ్మడిగా రూ. 5500 విరాళమందించారు. వీరికి జాతీయ ప్రతిభా పురస్కార వేతనాలు ఒక్కొక్కరికి రూ. 20వేలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ఆరెంపుల ఉదయ్‌కుమార్, కిన్నెర చంటి, కిన్నెర మధు, బీమాల నవ్యశ్రీ, చిట్టిమాది నవ్యశ్రీ, బీమాల మానస, మొగపర్తి చంద్రకళావతి, పమ్మి సౌజన్య, ఆరెంపుల శైలజ, జమ్ముల రేవతి, ఆరెంపుల మౌనిక ఒక్కొక్కరు రూ. 500 చొప్పున 11మంది విద్యార్థులు రూ. 5500 అందజేశారు. ప్రస్తుతం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఈ విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజారావు, సర్పంచి తులసి, ఛైర్మన్ బాలకృష్ణ అభినందించారు.

## పరిశుభ్రంగా చెన్నూరు

**చెన్నూరు(కల్లూరు), న్యూస్‌టుడే:** జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్)లో భాగంగా బుధవారం చెన్నూరు గ్రామంలో కల్లూరు ప్రభుత్వ కళాశాల విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. వీధులను శుభ్రంచేసి కంపచెట్లను తొలగించారు. ఎస్సీ కాలనీలో మద్యపాన నిషేధంపై అవగాహన కల్పించారు. సుమారు 100 మంది విద్యార్థులు గ్రామాన్ని పరిశుభ్రం చేస్తున్న క్రమంలో గ్రామస్థులు కొందరు వారికి తోడ్పాటునందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఫోగ్రాం అధికారి ఎస్కే అతహర్‌అలీ, పాఠశాల హెచ్ఎం నున్నా కృష్ణయ్య, అధ్యాపకులు వీరభద్రం, రామునాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



రహదారులపై చెత్తను తొలగిస్తున్న విద్యార్థులు

## మానవ జన్మను సార్థకం చేసుకోండి

**ఉప్పలచెలక(పెనుబల్లి), న్యూస్‌టుడే:** భక్తి, జ్ఞాన భావాలను పెంపొందించడం కోసం, ఆధ్యాత్మిక సాధనలు తెలుసుకొని మంచి పనులు ఆచరిస్తూ, ఆచరింపజేసి మానవ జన్మను సార్థకం చేసుకోవాలని శ్రీసద్గురు ఫౌండేషన్ వ్యవస్థాపకులు జి.వీరభద్రం అన్నారు. పెనుబల్లి మండలం ఉప్పలచెలకలోని రామాలయంలో మంగళవారం రాత్రి సద్గురు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీరభద్రం సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ఆలయానికి వచ్చి స్వామిని చిరునవ్వుతో దర్శించుకోవడంతో పాటు మన కోరికలు ధర్మానికి అనుగుణంగా ఉండాలని తెలిపారు. అనంతరం భగవద్గీత ప్రవచనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెక్కిలాల లక్ష్మారావు, మాజీ ఎంపీపీ చెక్కిలాల విజయమోహన్‌రావు, శివ, సతీశ్, మల్లయ్య, మురళి, అన్నపురెడ్డిపల్లి, పాల్వంచ, జానికీపురం, మర్రిగూడెం, రామచంద్రారావు బంజర్ గ్రామాల నుంచి ఫౌండేషన్ సభ్యులు హాజరయ్యారు.



సత్సంగం నిర్వహిస్తున్న సద్గురు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వీరభద్రం

## విలువైన మందులు నేలపాలుపై విచారణ

**తల్లాడ, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని అన్నారుగూడెం ఆరోగ్య ఉపకేంద్రంలో విలువైన మందులు నేలపాలుపై కల్లూరు డిప్యూటీ డీఎం హెచ్‌వో ఎల్.భాస్కర్‌నాయక్ బుధవారం విచారణ చేపట్టారు. ఆరోగ్య ఉపకేంద్రంలోని విలువైన ఔషధాలు, సూది మందులను కాల్చివేయడం, బావిలో పడవేసిన ఘటనపై పత్రికల్లో కథనాలు రావడంతో డిప్యూటీ డీఎం హెచ్‌వో అన్నారుగూడెం గ్రామంలో, తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విచారణ నిర్వహించారు. అయితే అప్పటికే ఔషధాలు కాల్చివేసిన ప్రదేశం, బావిలో పడేసిన మందులను అక్కడి నుంచి తొలగించారు. ఆ ప్రదేశాలను శుభ్రం చేశారు. అన్నారుగూడెం ఆరోగ్య ఉపకేంద్రానికి ఎన్ని ఔషధాలు, ఇంజక్షన్లు ఇచ్చారు, ఎన్ని పంపిణీ చేశారనే అంశాలను పరిశీలించారు. విలువైన మందుల కాల్చివేత, బావిలో పడవేయడంపై ఉన్నతాధికారులకు నివేదికలను పంపిస్తానని తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న భాస్కర్‌నాయక్

## మాస్టర్ అథ్లెటిక్స్‌లో స్వర్ణ పతకాలు

**బయ్యన్నగూడెం(పెనుబల్లి), న్యూస్‌టుడే:** పెనుబల్లి మండలం బయ్యన్నగూడేనికి చెందిన పల్లెబోయిన వెంకటసుబ్బారావు మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ చూపిన నేపథ్యంలో గ్రామస్థులు అభినందించారు. డిసెంబరు 9, 10 తేదిలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్లలో జరిగిన 37వ రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలలో 70 ఏళ్ల పైబడిన విభాగంలో 400 మీటర్ల పరుగులో బంగారుపతకం సాధించారు. అలాగే డిసెంబరు 29, 30 తేదీల్లో తెలంగాణ బెల్లంపల్లిలో నిర్వహించిన 5వ రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో 100, 200, 400 మీటర్ల పరుగులో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించడంతో ఆయనకు స్థానికులు అభినందనలు తెలిపారు.



బంగారు పతకాలతో వెంకట సుబ్బారావు

# సత్తుపల్లి

## మండలంలో ప్రారంభమైన గ్రామసభలు

**సత్తుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే:** మండల పరిషత్ ఆధ్వర్యంలో మూడు నెలలకోసారి నిర్వహించే గ్రామసభలు బుధవారం ప్రారంభమైయ్యాయి. ఈ సందర్భంగా మండల పరిధిలోని గంగారం, రుద్రాక్షపల్లి, సిద్ధారం పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు నిర్వహించారు. ప్రజలు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయా గ్రామాల సర్పంచులు కోటమర్తి రమేశ్, సోయం కమల, మోరంపూడి ప్రమీలారాణి, కార్యదర్శులు పాల్గొన్నారు.

## బెల్లం లోడు పట్టుకున్నారు.. పరీక్షించి వదిలేశారు!



స్వాధీనం చేసుకున్న బెల్లం లోడు

**కల్లూరు, న్యూస్‌టుడే:** సంక్రాంతి పండుగ సందర్భంగా విక్రయించేందుకు తెచ్చిన బెల్లం లోడును పోలీసులు బుధవారం అనుమానంతో స్వాధీనం చేసుకున్నారు. ఎస్.ఐ. పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమగోదావరి జిల్లా ఎర్రవరం నుంచి కల్లూరుకు చెందిన ముగ్గురు బెల్లం వ్యాపారులు మోటమర్రి వేణు, గౌరవరపు చంద్రశేఖర్, జెల్లా శ్రీనులు 10 టన్నుల బెల్లంను కొనుగోలు చేసి కల్లూరులోని దుకాణాల్లో దిగుమతికి తెచ్చారు. ఎస్సై పవన్‌కుమార్ దీనిని స్వాధీనం చేసుకుని లారీని సీజ్‌చేసి, బెల్లం విక్రయదారులను ఆబ్కారీ ఎస్సై కుమారస్వామికి అప్పగించారు. ఎక్సైజ్ ఎస్సై కుమారస్వామి లారీని సత్తుపల్లికి తీసుకుని వెళ్లి పరీక్షించగా అది తెల్లబెల్లంగా నిర్ధారించారు. అది సారా తయారీకి పనికిరాదని నిర్ధారిస్తూ కేసు నమోదు చేయకుండా లారీని వదిలేశారు.

## అన్ని మతాల వారి మనోభావాలను గౌరవించాలి : సండ్ర

**సత్తుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే:** అన్ని మతాల వారి మనోభావాలను గౌరవించాలని సత్తుపల్లి శాసన సభ్యుడు సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని మదర్సాను సందర్శించి ఆయన మట్లాడారు. నాడు తెదేపా హయంలో తుమ్మల నాగేశ్వరరావు మదర్సా నిర్మాణానికి స్థలాన్ని కేటాయించారని, నేడు తమ ఆధ్వర్యంలోనే కొంత అభివృద్ధి చేయడం సంతోషకరంగా ఉందన్నారు. మదర్సా ఆవరణ గోతులమయంగా ఉండటంతో రూ. 1.50లక్షలతో గ్రావెల్ పోయించి చదును చేయించామన్నారు. పట్టణ శివారులోని దేవాలయాల సముదాయాల వద్ద రహదారికి గ్రావెల్ తోలించినట్లు వివరించారు. ఈ సందర్భంగా మదర్సా నిర్వాహకులు సండ్రను శాలువ, పూల మాలతో సత్కరించారు. కార్యక్రమంలో దిలావర్‌ఖాన్, రఫీ, మున్వర్ హుస్సేన్, ఖుద్దూస్, తెదేపా మండల, పట్టణ అధ్యక్షులు దొడ్డా శంకరరావు, కూసంపూడి మహేశ్, అద్దంకి అనీల్‌కుమార్, పవన్, చాంద్‌పాషా, మునీర్, పాషా పాల్గొన్నారు.

### శేషవాణి కుటుంబానికి పరామర్శ..

పట్టణంలోని లలితకుమారి ఆసుపత్రి రోడ్డులో నివాసం ఉంటున్న అమిర్నేని శేషవాణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె భర్త నాగేశ్వరరావును ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పరామర్శించారు. ఆయన వెంట తెదేపా నాయకులు ఉన్నారు.



ఎమ్మెల్యే సండ్రను సత్కరిస్తున్న మదర్సా బాధ్యులు



## తాళ్లపెంట సర్వేను పరిశీలించిన డిప్యూటీ ఇన్‌స్పెక్టర్



సర్వేయర్లకు సూచనలిస్తున్న డీఐ శ్రీనివాస్

**తాళ్ల పెంట(పెనుబల్లి), న్యూస్‌టుడే:** పెనుబల్లి మండలం తాళ్ల పెంట రెవెన్యూలో వాస్తవ సర్వే నంబర్లకు బదులుగా కొత్త నంబర్లను సృష్టించి రెవెన్యూ రికార్డులలో నమోదు చేశారు. దీంతో రైతుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లటంతో నాలుగు రోజులు క్రితం గ్రామంలో సర్వేయర్ల బృందం సర్వే నంబర్ల గుర్తింపునకు సర్వే చేపట్టారు. బుధవారం క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్న ప్రదేశాన్ని సర్వే అండ్ లాండ్ రికార్డుల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పరిశీలించి సర్వేయర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు లక్ష్మీకుమారి, నాగు, ప్రసాద్‌రెడ్డి, ఈశ్వరి ఉన్నారు.

## డీసీసీబీ ఆధ్వర్యంలో బీమా పంపిణీ

**తల్లాడ, న్యూస్‌టుడే:** తల్లాడ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో బుధవారం బీమా చెక్కును తల్లాడ సోసైటీ ఛైర్మన్ గుర్రం వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. తల్లాడ సోసైటీ సభ్యత్వం కల్గిన బాలపేట గ్రామానికి పాలెపు శ్రీను ఇటీవల మృతి చెందారు. మృతుడి భార్య మంగమ్మకు రూ. 50వేల బీమా చెక్కును సోసైటీ ఛైర్మన్ గుర్రం వెంకటేశ్వరరావు, డీసీసీబీ బ్యాంకు మేనేజరు ఉషాకుమారి అందజేశారు. సోసైటీ డైరెక్టర్లు గొవిందు శ్రీనివాసరావు, దుండేటి వీరారెడ్డి, తెరాస నాయకులు, సీఈవో వజ్రాల వీరారెడ్డి, పాల్గొన్నారు.

## విద్యార్థులకు వైద్య పరీక్షలు



**తల్లాడ, న్యూస్‌టుడే:** రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా బుధవారం తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వైద్యులు పరీక్షలను నిర్వహించారు. ఆరోగ్య సమస్యలతో బాధపడే విద్యార్థులకు స్థాయిని బట్టి సమీప ఆరోగ్య కేంద్రానికి, జిల్లా ప్రధాన ఆసుపత్రికి పంపుతామని తెలిపారు. ప్రతి విద్యార్థి ఎత్తు, బరువు, ఆరోగ్య అంశాలకు సంబంధించి ఆరోగ్య కార్డులు ఇస్తామని వైద్యులు కంచర్ల రజని, బండారు శ్రీనివాసులు తెలిపారు.

## నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**సత్తుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే:** ప్రకృతి వైపరిత్యం, గులాబి పురుగు వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎదుట ధర్నా, ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో పత్తి పంటకు గులాబిరంగు పురుగు పట్టి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, విత్తన సంస్థలు అనుసరించిన సీడ్ ప్రాసెస్ విధానం, రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ దొడ్డే పుల్లయ్యకు అందజేశారు. తొలుత పట్టణంలో ప్రదర్శన చేపట్టారు. సంఘ నాయకులు లాజర్, రాము, రాజు పాల్గొన్నారు.




పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఏఐకేఎస్ఎంఎస్ నాయకులు

## సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటం

**బుగ్గపాడు (సత్తుపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే:** సమస్యల పరిష్కారానికి ప్రజలు సంఘటితంగా, సైన్యంలా పోరాడాలని టీ-మాస్ జిల్లా ఛైర్మన్ డి.జ్వలిత పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని బుగ్గపాడులో భూనిర్వాసితుల సంఘం అధ్యక్షుడు మేకపోతుల లాలేశ్వరరావు అధ్యక్షతన జరిగిన తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్యవేదిక (టీ-మాస్) సదస్సులో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలన కొనసాగుతోందని, పథకాల పేరుతో ప్రపంచ బ్యాంకుల నుంచి కోట్ల రూపాయలు అప్పులు తెచ్చి ప్రజలపై పెనుభారం మోపుతున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారానికే టీ-మాస్ ఏర్పాటైందన్నారు. ఈ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. పోడు సాగుతో 30 ఏళ్లుగా జీవనం సాగిస్తున్న బుగ్గపాడు పోడు రైతులను ప్రభుత్వం ఆందోళనకు గురిచేస్తోందని, వారికి అండగా నిలబడి పోరాడతామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ పుడ్‌పార్కు భూ నిర్వాసితులకు న్యాయం జరిగేంత వరకు పోరాటాలు చేస్తామన్నారు. ఈ సదస్సులో టీ-మాస్ జిల్లా నాయకుడు బత్తుల లెనిన్, భూక్యా వీరభద్రం, మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాసరావు, రావుల రాజబాబు, జగదాంబ, యార్లగడ్డ దయానంద్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న టీ-మాస్ జిల్లా ఛైర్మన్ డి.జ్వలిత

## లక్ష్మీపురంలో జోరుగా కోడిపందాలు

◆ పోలీసుల దాడి ◆ 24 మందిపై కేసులు



లక్ష్మీపురంలో కోడిపందాలు నిర్వహిస్తున్న దృశ్యం

**కల్లూరు, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామ శివారు మామిడితోటలో కోడి పందాలు జోరుగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఈ ప్రాంతంలో పందాలు జోరుగా సాగుతున్నాయన్న సమాచారంతో పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో రెండు ద్విచక్ర వాహనాలు, 5 కోడిపుంజలు, రూ.2350 నగదును స్వాధీనం చేసుకున్నారు. స్థావరం వద్ద కోడిపందాల్లో పాల్గొన్న 24 మందిని ఎస్సై పవన్‌కుమార్ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

## ఈ పాస్ యంత్రాలను ప్రారంభించిన ఆర్డీవో

**సత్తుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే:** పట్టణంలో మూడో నంబరు చౌకధరల దుకాణంలో బుధవారం ఆర్డీవో కుముదినిసింగ్ ఈ పాస్ యంత్రాలను ప్రారంభించారు. గురువారం సాయంత్రంలోగా మండలంలోని అన్ని చౌకధరల దుకాణాల్లో ఈ పాస్ యంత్రాలను ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దొడ్డే పుల్లయ్య, పౌరసరఫరాల డీటీ రాములు, డీలర్ రవి పాల్గొన్నారు.

## సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామం రామన్నపాలెం



**రామన్న పాలెం(వేంసూరు), న్యూస్‌టుడే:** వేంసూరు మండలం రామన్నపాలెంను సమష్టి కృషితో సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామంగా తీర్చిదిద్ది ఆదర్శంగా నిలిపారు. గ్రామంలో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మించుకోవడంతో స్ఫూర్తిదాయకంగా మారింది. గ్రామంలో మొత్తం 590 కుటుంబాలకు గాను అందరూ మరుగుదొడ్లు నిర్మించుకుని మండలంలో తొలిసంపూర్ణ పారిశుద్ధ్య గ్రామం, బహిరంగ మల మూత్ర విసర్జన రహిత గ్రామంగా రూపుదిద్దుకుంది. సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామంగా తీర్చిదిద్దిన నేపథ్యంలో సర్పంచి, అధికారులకు అభినందన సమావేశాన్ని పంచాయతీరాజ్ గ్రామీణ విస్తరణాధికారి బి, అశోక్ బుధవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో గోవిందరావు మాట్లాడుతూ రామన్నపాలెం సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామంగా తీర్చిదిద్దడంలో కృషిచేసిన సర్పంచి కుక్కపల్లి నాగమణి, ఆమె భర్త సత్యనారాయణ, వీరికి సహకరించిన ఉపాధి క్షేత్రాధికారి ప్రసాదరెడిని అభినందించారు. ఇందుకు కృషి చేసిన అందరినీ ఎంపీపీ జగన్నాథం, జడ్పీటీసీ సభ్యుడు బాస్యానాయక్, ఎంపీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు, రైతుసమన్వయ కమిటీ మండల కన్వీనరు జగన్మోహనరావు ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో మండలంలోని అన్ని గ్రామాల్లో నూరుశాతం మరుగుదొడ్లు నిర్మించి సంపూర్ణ పారిశుద్ధ్య మండలంగా చేయాల్సిందిగా కోరారు.

◆ రామన్నపాలెం గ్రామంలో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉన్నందున గ్రామంలో ఎవరైనా బహిరంగ మలవిసర్జన చేస్తే వారిపై కేసులు పెడతామని, పింఛను, రేషను నిలిపివేస్తామని ఎంపీడీవో గోవిందరావు, ఎస్సై వెంకన్న హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరేశ్ రెడ్డి, ఉపాధి ఏపీవో సూరయ్య, అంగన్‌వాడీ, ఆశా, సాక్షర భారత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆటో స్టార్టర్లను స్వచ్ఛందంగా తొలగించుకోవాలి

**కుర్నవల్లి(తల్లాడ), న్యూస్‌టుడే:** వ్యవసాయ బోర్లకు ఉన్న ఆటో స్టార్టర్లను రైతులు స్వచ్ఛందంగా తొలగించాలని మండల వ్యవసాయాధికారి శీలం చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. బుధవారం తల్లాడ మండల పరిధిలోని కుర్నవల్లి, బస్వాపురం, తెలగవరం గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆటోస్టార్టర్ల తొలగింపుపై రైతు సమన్వయ సమితుల ద్వారా రైతులకు అవగాహన సదస్సులను నిర్వహించారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు తమ పంటల అవసరాలకు తగినంత మేరే నీటిని వాడుకోవాలని, ఆరుతడి పంటలను సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించడమే గాక భూగర్భజలాలను కాపాడుకోవచ్చునని వివరించారు. సూక్ష్మపోషక లోపాలను అధిగమించవచ్చునన్నారు. ఆటో స్టార్టర్లను తొలగించి భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు నాగేశ్వరరావు, నాగుల్‌మీరా, గురుమూర్తి, సర్పంచులు మువ్వా మురళీధర్‌రావు, గంటల రమాదేవి, మహ్మద్ వెంకటమైబు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శీలం చంద్రశేఖర్‌రెడ్డి

### 9గంటల విద్యుత్తు చాలని వినతి...

**తల్లాడ, న్యూస్‌టుడే:** వ్యవసాయానికి 24గంటలు విద్యుత్తు సరఫరా వలన బోర్లు, బావులలో నీళ్లు అయిపోయి మోటార్లు కాలిపోతున్నాయని పగటిపూట 9 గంటలే విద్యుత్తు సరఫరా చేయాలని తల్లాడ మండలం అంజనాపురం(రేజర్ల) గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, రైతులు బుధవారం తహసీల్దారు జి. శిరీషకు వినతిపత్రం అందించారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో కాయకల్ప నిపుణుల బృందం పరిశీలన

**భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే:** భద్రాచలం ఏరియా ఆసుపత్రిని బుధవారం హైదరాబాద్ నుంచి వచ్చిన కాయకల్ప బృందం పరిశీలించింది. అక్కడి నుంచి వచ్చిన కాయకల్ప నిపుణులు అశోక్‌కుమార్, ఉమాశంకర్, శ్రీకృష్ణ, వివేక్ ఆసుపత్రిలోని ప్రతీ విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతీ విభాగంలో ఉన్న పరిసరాలను, అక్కడ పని చేస్తున్న వైద్యుల తీరు, సిబ్బంది తీరు, సిబ్బంది ఉపయోగించే పరికరాలు, రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది ప్రవర్తించే తీరును పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులను వైద్యం అందే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని ఐసీయూ, ఆపరేషన్ థియేటర్, రక్త పరీక్షా విభాగం, శిశువులకు చికిత్స అందించే విధానాలను అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మరుగుదొడ్ల పరిశుభ్రత, చెత్తాచెదారం వాడకం, ఆసుపత్రి వెలుపల ప్రదేశాల పరిశుభ్రత, రోగులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆసుపత్రిలోని దాదాపు అన్ని ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అన్ని ప్రదేశాలు పరిశుభ్రంగా ఉన్నాయని, వైద్యులు సిబ్బంది రోగులకు వైద్యం అందించే తీరు బాగుందని అన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షణాధికారి కోటిరెడ్డి, యుగందర్, రామకృష్ణ, నాగేంద్ర ప్రసాద్, క్వాలిటీ మేనేజర్ శ్రుతి, నర్సింగ్ విభాగం యశోద, నర్సింగు స్టాఫ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



శిశు విభాగంలోని నూతన శిశువు ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న కాయకల్ప నిపుణులు



వైద్య సేవల వివరాలు అడిగి తెలుసుకుంటున్న బృందం సభ్యులు

## జమలాపురం ఆలయాన్ని దర్శించుకున్న రావి కొండలరావు

**ఎర్రుపాలెం, న్యూస్‌టుడే:** జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సినీ నటుడు, రచయిత రావి కొండలరావు దర్శించుకున్నారు. ఆయనకు ఈఓ ఏవీ రమణ మూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం కొండలరావు శ్రీవారు, అలివేలు మంగా, పద్మావతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కొండలరావుకు ఆలయ విశిష్ఠతను ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ వివరించారు. ఈ సందర్భంగా కొండల రావు మాట్లాడుతూ.. స్వయంభుగా వెలిసిన శ్రీవారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆయన వెంట జమలాపురపు గోపాలకిషన్‌రావు, టీవీ వ్యాఖ్యాత కృష్ణవేణి శఠగోపన్, బసవరాజు ఉపేందర్‌లు పాల్గొన్నారు.



కొండలరావును సన్మానిస్తున్న ఈఓ రమణమూర్తి

## రేపు కళాశాలల ప్రధానాచార్యుల సమావేశం

**ఖమ్మంమయూరిసెంటర్, న్యూస్‌టుడే:** 2017-18 విద్యాసంవత్సరానికి సంబంధించి షెడ్యూల్డు కులముల అభివృద్ధి శాఖ ద్వారా మంజూరు చేసే పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాల మార్గదర్శకాల కోసం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రధానాచార్యుల సమావేశం ఈనెల 5న నిర్వహిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ అధికారి కె.సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం జరుగుతుందని తెలిపారు. కళాశాలల ప్రధానాచార్యులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

## జిల్లా రవాణా అధికారిగా శంకర్‌నాయక్

**ఖమ్మం గట్టయ్యసెంటర్, న్యూస్‌టుడే:** జిల్లా రవాణా అధికారిగా బదావత్ శంకర్‌నాయక్ పూర్తి అదనపు బాధ్యతలను తీసుకున్నారు. ప్రస్తుతం వైరా మోటారు వాహన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన సత్తుపల్లిలో ఇన్‌ఛార్జి మోటారు వాహన ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వైరా, సత్తుపల్లిలతో పాటు ఖమ్మం జిల్లా రవాణా అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలను నిర్వహించనున్నారు.



### ఈనాడు-ఈటీవీ తెలంగాణ నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీలో జనవరి 2 విజేతలు

1. డి. అనిత, హైదరాబాద్; 2. జ్యోతి, ఖమ్మం; 3. కె. మాధవీలత, హన్మకొండ; 4. వి.విజయలక్ష్మి, హైదరాబాద్; 5. వి.ఉష, చెన్నై; 6. టి. సరళ, మంచిర్యాల్; 7. ఏ.రాధిక, గోదావరిఖని; 8. జె. నవ్యశ్రీ, ఖమ్మం; 9. ఏ. శ్రీలక్ష్మి, అడశర్లపాడు, ఖమ్మం; 10. వై. జయ, బెల్లంపల్లి. విజేతల వివరాలు ఈనాడు డాట్ నెట్‌లో చూడవచ్చు.

ETV తెలంగాణ

## కరుణకు సావిత్రిబాయిపూలే అవార్డు

**ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** తెలంగాణ జాగృతి జిల్లా మహిళా కన్వీనర్ గట్టు కరుణకు వరంగల్ జిల్లాకు చెందిన సావిత్రిబాయిపూలే ప్రజాసంక్షేమ సంఘం వారు సావిత్రి పూలే అవార్డును అందజేశారు. బుధవారం వరంగల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం నిర్వాహకులు అవార్డును కరుణకు అందజేశారు. మహిళా సాధికారత కోసం కరుణ చేసిన కృషిని గుర్తించి ఈ అవార్డును ఇచ్చినట్టు నిర్వాహకులు తెలిపారు. అవార్డును హన్మకొండ శాసన సభ్యుడు దాస్యం వినయ్‌భాస్కర్ అందజేసినట్టు అవార్డు గ్రహీత కరుణ తెలిపారు.



అవార్డు అందుకున్న కరుణ

# 20 నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పోటీలు

**ఖమ్మం నగరం, న్యూస్‌టుడే:** జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు ఈనెల 20, 21, 22 తేదీల్లో ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సహకార పరపతి, పొదుపు సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మంలోని టీఎన్జీఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం రాత్రి 72 ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కూడిన సొసైటీ సమావేశం జరిగింది. ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్, కార్మిక, పెన్షనర్స్, పోలీస్, ఎల్ఐసీ, రైల్వే, పంచాయతీరాజ్, రెవెన్యూ, ఆబ్కారీ, విద్యుత్తు, ఉపాధి హామీ పథకం, సెర్ప్, వైద్యులు సహా అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొని క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలపై సమీక్షించారు. క్రీడల నిర్వహణకు కలెక్టర్ అనుమతి పొందాల్సి ఉందని, ఉద్యోగులు పోటీల్లో పాల్గొనేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరాలని నిర్ణయించారు. పురుషులతోపాటు, మహిళా ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు 50 రకాల అంశాల్లో ఆటల పోటీలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఉద్యోగులంతా ఐక్యంగా ముందుకు సాగాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సమావేశంలో టీఎన్జీఓ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామయ్య, గంగవరపు బాలకృష్ణ, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కారుమంచి శ్రీనివాసరావు, వెంకటపతిరాజు, కృష్ణయ్య, వల్లోజు శ్రీనివాసరావు, వీరబాబు, ఉషారాణి, శ్రీదేవి, చంద్రశేఖర్, గురుమూర్తి, గుంటుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

“మణుగూరు డిపో మేనేజరుగారికి..

మీ డిపో బస్సుల పేరు వినగానే అతి వేగం అనే పదం గుర్తుకొస్తోంది. తరచూ ఇక్కడి బస్సులు ఎక్కడో ఒక చోట ప్రమాదాలకు గురవుతున్నాయి. బస్సు ఎక్కితే వేగంగా గమ్యంకు చేరుకుంటాం. కానీ, ఏ క్షణం.. ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నాం. బస్సు ప్రమాదం అనగానే మణుగూరు డిపోను గుర్తుకు తెచ్చుకుంటున్నారు. ఎంత దూరం వెళ్లాల్సి వచ్చినా బస్సులో కాసేపైనా విశ్రాంతిని తీసుకోలేకపోతున్నాం. ఏదో ఆందోళన వెంటాడుతోంది. దయచేసి బస్సులను సురక్షితంగా నడపడంతో పాటు ప్రమాద రహిత ప్రయాణాలకు కేంద్రంగా డిపోను మార్చేందుకు చర్యలు తీసుకోగలరు.”

ఇట్లు..
పాల్వంచ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న వీరస్వామి, నదీం, గోపీనాథ్, పూర్ణ తదితరులు..

**మణుగూరు డిపో పరిధిలో..**
**గంటకు బస్సుల నిర్దేశిత వేగం ఇలా..**

ఆర్డినరీ: **55** కి.మీ.

ఎక్స్‌ప్రెస్: **60 - 65** కి.మీ.

డీలక్స్: **65 - 70** కి.మీ.

సూపర్ డీలక్స్: **70-75** కి.మీ.

# వేగం.. ఆగమాగం..?

- మణుగూరు డిపో బస్సుల వేగంపై సామాజిక మాధ్యమాల్లో చర్చ
- 2017లో బస్సు ప్రమాదాల్లో 11 మంది మృతి
- డ్రైవర్ల తప్పేమీ లేదన్న డీఎం



ఇటీవల బూర్గంపాడు మండలం అంజనాపురం వద్ద ప్రమాదంలో దెబ్బతిన్న మణుగూరు బస్సు

మణుగూరు, న్యూస్‌టుడే

ఈ లేఖ.. మణుగూరు ప్రాంతంలో సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశమైంది. అధ్యాపకుల ఆవేదనను ‘న్యూస్‌టుడే’ డిపో మేనేజరుకు తెలపగా.. ఆయన వెంటనే స్పందించారు. బస్సుల వివరాలు, వాటి వేగం, 2017లో జరిగిన ప్రమాదాలు తెలియజేస్తూనే దిద్దుబాటు చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు తెలిపారు.

## ఒకవైపు ఇష్టం..మరో వైపు భయం..

మణుగూరు బస్సు డిపోలో మొత్తంగా 81 బస్సులు నడుస్తున్నాయి. ఖమ్మం, హైదరాబాద్, తిరుపతి, భూపాలపల్లి, విజయవాడ, భద్రాచలం, కొత్తగూడెం తదితర ప్రాంతాలకు నిత్యం పదుల సంఖ్యలో బస్సులు నడుస్తున్నాయి. జిల్లాలో మణుగూరు బస్సులు వేగంగా వెళతాయని ఎక్కువమంది అనుకుంటారు. గమ్యంకు త్వరగా వెళ్లాలంటే మణుగూరు బస్సులు ఎక్కాలనుకునే వారూ ఉన్నారు. అదే వేగం తరచూ ప్రమాదాలకు కారణమవుతోందని భయపడే ప్రయాణికులు చాలా మందే ఉన్నారు. ఈ డిపో పరిధిలో అధిక ప్రమాదాలు నమోదవుతున్నాయి. 2017లో ఆరు ప్రమాదాల్లో 11 మంది మరణించారు. వీటిలో నాలుగు ప్రమాదాలను విశ్లేషిస్తే.. ఆయా బస్సు డ్రైవర్ల తప్పిదం లేకుండా వెనుకనుంచి వాహనాలు వచ్చి ఢీకొట్టాయి. అయినప్పటికీ బస్సు ప్రమాదాలను ప్రస్తావిస్తూ ప్రయాణికులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. నిబంధన ప్రకారం మాత్రమే స్పీడ్ లాక్ పద్ధతిని పాటిస్తున్నారు. ఈ బస్సులకు నిర్దేశించిన వేగం మాత్రమే వెళ్లగలుగుతాయి. ఏదేమైనా ప్రయాణికుల ప్రశంసలు అందుకునేలా బస్సులను నడిపించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

### 2017లో జరిగిన ప్రమాదాలు..

- **మార్చి 10:** హైదారాబాద్‌లో జరిగిన ప్రమాదంలో ఒక యాచకుడు మృతిచెందాడు.
- **మార్చి 23:** కుక్కునూరులో జరిగిన ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు.
- ఇదేనెలలో హైదరాబాద్‌లో బస్సును డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో ఒక వ్యక్తి చనిపోయారు.
- **ఆగస్టు 12:** ఏన్కూరు మండలం గార్లఒడ్డు ఒద్ద బస్సు ఢీకొట్టడంతో ఒకరు మరణించారు.
- **సెప్టెంబరు 17:** చండ్రుగొండ మండలం మద్దుకూరు గ్రామంలో బొగ్గులారీ, బస్సు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు చనిపోయారు.
- **డిసెంబరు 28:** బూర్గంపాడు మండలం బస్సును ఢీకొన్ని లారీ ప్రమాదంలో ముగ్గురు చనిపోయారు.

## నిర్దేశిత వేగంలోనే రాకపోకలు: బీఎల్‌స్వామి, డిపో మేనేజరు

మణుగూరు డిపోలోని అన్ని బస్సులకు నిబంధనలకు అనుగుణంగా వేగం పద్ధతి ఒకటి ఉంటుంది. కొందరు ప్రయాణికులు డిపో బస్సులు వేగంగా వెళుతున్నాయని ఫిర్యాదులు చేస్తున్నారు. మరికొందరు బస్సుల వేగాన్ని మరింతగా పెంచాలని కోరుతున్నారు. ఏదేమైనా మా నిబంధనలకు అనుగుణంగానే బస్సుల వేగం ఉంటుంది. ప్రమాదాల విషయానికి వస్తే.. 2017లో ఎక్కువ జరిగాయి. డ్రైవర్ల తప్పిదం లేనప్పటికీ వేరే వాహనాలు వచ్చి ఢీకొట్టిన ప్రమాదాలే అధికం. ఈ విషయాన్ని ప్రయాణికులు గ్రహించాలి. ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చేందుకు నిరంతరం కృషిచేస్తున్నాం. అన్ని డిపోల మాదిరిగానే మణుగూరు బస్సులు కూడా నిబంధనలకు లోబడి రాకపోకలు సాగిస్తుంటాయి.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

**ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే:** ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం ఏర్పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖమ్మం గ్రామీణ మండలం ముత్తగూడెంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముత్తగూడేనికి చెందిన గుడిపాటి సాంబయ్య ఆలియాస్ సాత్విక్(26) సెల్‌పాయింట్ దుకాణాన్ని నిర్వహిస్తూ, ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్నాడు. బుధవారం పక్కింటివారు విద్యుత్తు మరమ్మతులు చేయాలని సాంబయ్యను పిలిచారు. ఇతను మరమ్మతు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. ప్రమాద సంఘటనపై మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

**ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే:** నగర శివారు గోపాలపురం వద్ద బుధవారం ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో కామేపల్లి మండలం మద్దులపల్లి గ్రామానికి చెందిన అద్దంకి వెంకటాచారి, ఆయన భార్య రజితలు తీవ్రంగా గాయపడ్డారు. ఖానాపురంహవేలి సీఐ కె.నాగేంద్రాచారి కథనం ప్రకారం... వెంకటాచారి, ఆయన భార్య రజితలు ద్విచక్రవాహనంపై గ్రీన్‌వుడ్ స్కూల్‌లో చదువుతున్న తమ కుమార్తె వీణను చూసేందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో గోపాలపురం వద్ద టిప్పర్ ఢీకొని ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. ఇరువురిని స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. సంఘటనపై వెంకటాచారి సోదరుడు రామాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ వివరించారు.

## ట్రాక్టర్ డ్రైవర్‌కు 6నెలల జైలు

**ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే:** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి పోలీసు ఠాణా పరిధి బుద్ధారం గ్రామ పొలిమేరల్లో 2014 జనవరి 20న రాత్రి ట్రాక్టర్‌ను అతివేగంగా అజాగ్రత్తగా నడిపి ద్విచక్రవాహన చోదకుడు మోహన్‌రావు మృతికి కారకుడైన ట్రాక్టర్ డ్రైవర్ కంతు ఉపేందర్‌కు 6నెలల జైలు శిక్ష రూ.10వేలు జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ జడ్జి ఎం.లక్ష్మణ్ బుధవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో 10మంది సాక్షులను విచారించారు. కేసును ప్రాసిక్యూషన్ రుజువు చేయలేదని ఖమ్మం అప్పటి మొబైల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ 2016 జూన్ 1న కేసును కొట్టివేస్తూ నిందితుడైన కె.ఉపేందర్‌ను విడుదల చేశారు. కొట్టివేతను సవాల్ చేస్తూ ప్రాసిక్యూషన్ జిల్లా కోర్టులో అప్పీలు దాఖలు చేశారు. కింది కోర్టులో నమోదు చేసిన సాక్ష్యాధారాలను తిరిగి పరిశీలించిన జిల్లా సెషన్స్ జడ్జి డ్రైవర్ నేరం చేశాడని నిందితుడ్ని పై విధంగా శిక్షించారు. ఈకేసును నేలకొండపల్లి పోలీసులు 2014 జనవరి 20న నమోదు చేశారు. కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.కె. రామారావు వాదించారు.



## గుట్కా పొట్లాల పట్టివేత

**కారేపల్లి, న్యూస్‌టుడే:** అక్రమంగా తరలిస్తున్న గుట్కా ప్యాకెట్లను బుధవారం సీఐ సాంబరాజు, ఎస్సై కిరణ్‌కుమార్ ఆదేశానుసారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. భాగ్యనగర్‌తండాకు చెందిన గుగులోతు హతిరాం (జిత్తానాయక్) ద్విచక్ర వాహనంపై ఖమ్మం నుంచి రూ.40 వేల విలువగల గుట్కాలు, అంబర్ ప్యాకెట్లను తరలిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అతని ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేసే ప్రయత్నంలో అతను బండిని ఆపకుండా తీసుకెళ్లాడు. ఈ క్రమంలో పోలీసులు అతన్ని వెంబడించి గిద్దవారిగూడెంస్టేజీ వద్ద పట్టుకున్నారు. ఠాణాకు తీసుకువెళ్లి ద్విచక్ర వాహనంతో సహా సీజ్ చేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శశిధర్, పోలీసులు బి.హరి, పాపారావు, టి.నాగేశ్వరరావు, రాజేశ్ పాల్గొన్నారు.



పటుబడిన గుట్కా, అంబర్ ప్యాకెట్లను చూపుతున్న సీఐ, ఎస్సై

## యువకునిపై దాడి.. ఎనిమిది మందిపై కేసు

**ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే:** తనపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారంటూ ఓ యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లి శ్యామ్‌కుమార్ అనే వ్యక్తితోపాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఖానాపురంహవేలి సీఐ కె.నాగేంద్రాచారి తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. ధంసలాపురం కాలనీలో నివాసం ఉంటున్న గంగిసర్వ రామారావు ఓ ప్రయివేటు సంస్థలో పనిచేస్తున్నాడు. గత డిసెంబరు 30న రాత్రి ఇంటి వద్ద ఫోను మాట్లాడుతున్న రామారావుపై అతని ఇంటి వెనుక నివసించే శ్యామ్‌కుమార్ మరికొందరితో కలిసి వచ్చి దాడిచేశాడు. కర్రలు, బెల్టులు, పైపులతో విచక్షణరహితంగా కొట్టారు. చంపుతామని బెదిరించి దుస్తులు ఊడదీయించారు. తీవ్రంగా గాయపడి పడిపోయిన రామారావును స్థానికులు 108 ద్వారా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. శ్యామ్‌కుమార్ దాడిలో తన రెండు చేతులు విరిగాయని, దాడి సందర్భంగా తన జేబులోని రూ.10వేల నగదు, చరవాణి పోయాయని బాధితుడు ఫిర్యాదు చేశాడు. తప్పుడు కేసుపెట్టి నిన్ను ఇరికిస్తానని, కేసు పెడితే చంపుతానంటూ బెదిరించాడని అందులో పేర్కొన్నాడు. దీనిపై ప్రాథమిక విచారణ జరిపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వివరించారు.

## మైనర్లకు కౌన్సెలింగ్

**ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే:** విద్యార్థినిని వేధిస్తున్న ఇద్దరు మైనర్ విద్యార్థులకు షీటీమ్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ అంజలి కథనం ప్రకారం.. నగరానికి చెందిన ఇంటర్ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటూ అందిన ఫిర్యాదు మేరకు కూసుమంచి మండలం జీళ్లచెర్వు గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్ విద్యార్థులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారు కొంతకాలంగా విద్యార్థినిని వేధిస్తూ వెంటపడుతున్నట్లు తెలిపారు. మైనర్లకు వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు సీఐ వివరించారు. పిల్లల కదలికలు, ప్రవర్తనపట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ఈ సందర్భంగా సీఐ సూచించారు.




# పటిష్ఠ ప్రణాళిక

**వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి**

**మ్యాచ్ అండ్ బ్యాచ్‌లుగా బృంద శిక్షణ**

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే


మార్చి సమీపిస్తోంది. పది పరీక్షలకు సన్నద్ధత అవుతున్నారు. మిగిలిన రోజులు విద్యార్థులకు కీలకమైనవి. ఈనేపథ్యంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు ఈసారి పటిష్ఠ ప్రణాళిక తయారు చేశారు. గత డిసెంబరు 31వ తేదీ వరకే సిలబస్‌ను పూర్తి చేశారు. ఈనెల2వ తేదీ నుంచి రివైజ్‌డ్ తరగతులు ప్రారంభించారు. ఎస్ఏ-1 దగ్గర్నుంచి విద్యార్థుల్ని గ్రేడింగ్‌లు చేసి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

## వెనుకబడిన విద్యార్థులపై 'గురు'తర బాధ్యత

చదువులో వెనుకబడిన వారిని గుర్తించి సబ్జక్టుల వారీగా వారి చదువును మెరుగుపరిచే బాధ్యతలను సంబంధిత ఉపాధ్యాయులకు అప్పగించారు. చదివే వారితో కలిపి మ్యాచ్ అండ్ బ్యాచ్‌లుగా చేసి బృంద శిక్షణ ఇస్తున్నారు. జనవరి 2వతేదీ నుంచి జరిగే రివిజన్ తరగతుల్లో భాగంగా పరీక్షల్లో వచ్చే పోటీని ఎదుర్కొనేందుకు అవసరమైన తర్ఫీదు ఇవ్వనున్నారు. మొత్తం సిలబస్‌ను నాలుగు భాగాలుగా చేసి ప్రతి భాగంలో ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీటి ద్వారా పరీక్షలను రాయగలమనే ఆత్మస్థైర్యాన్ని, సామర్థ్యాన్ని వారిలో పెంచేందుకు కృషి చేస్తున్నారు. ప్రత్యేక టెస్టులు పూర్తయిన తర్వాత ప్రతి రెండు భాగాలకు కలిపి ప్రధానోపాధ్యాయులతో రివిజన్ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో గుర్తించిన అంశాలను దృష్టిలో ఉంచుకొని తదుపరి ప్రణాళిక తయారు చేస్తారు. ఇవన్నీ కూడా ప్రీఫైనల్ పరీక్షలకు ముందే పూర్తి చేస్తారు. ప్రీఫైనల్‌నే ఫైనల్ పరీక్షలుగా భావించేలా విద్యార్థులను తీర్చిదిద్దటం జరుగుతుంది. మార్చి 1వతేదీ నుంచి ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహిస్తారు.

## గత వైఫల్యాలు చూసి..

గత సంవత్సరం జిల్లాల్లో అత్యధికంగా గణితం, భౌతికశాస్త్రం, ఆంగ్లం సబ్జెక్టుల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. అనుత్తీర్ణత శాతాన్ని తగ్గించేందుకు ఈసారి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇందుకోసం ఇటీవల ఖమ్మంలో నియోజకవర్గాల వారీగా సబ్జక్టు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలంటే భయం పోగొట్టేందుకు మోటివేషన్



తరగతులు నిర్వహించారు. ఆహారం విషయంలో, ఇతర విషయాల్లో పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు సబ్జక్టు నిపుణులచే అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా జిల్లాల్లోని కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో, ఆదర్శపాఠశాలల్లో కూడా ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఇదే ప్రణాళికను అమలు చేస్తున్నారు. గత ఏడాది పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఈసంవత్సరం రెండు, మూడు చోట్ల తప్ప మిగతా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయటం విశేషం. ప్రైవేటు పాఠశాలలపై ఆధారపడకుండా విద్యాశాఖ ఈచర్యలు తీసుకుంది.

**పది పరీక్షలు:**
మార్చి 15 నుంచి 30 వరకు
(ఏప్రిల్ 2వ తేదీ వరకు వృత్తి విద్యా పరీక్షలు)

| | ఖమ్మం జిల్లా | భద్రాద్రి |
|---|---|---|
| బాలురు | 9,173 | 6,493 |
| బాలికలు | 9,253 | 6,742 |
| మొత్తం | 18,426 | 13,235 |
| పరీక్ష కేంద్రాలు | 88 | 71 |
| పాఠశాలలు | 461 | 271 |

**ప్రైవేటు**

| | ఖమ్మం | భద్రాద్రి |
|---|---|---|
| విద్యార్థులు | 739 | 1787 |
| పరీక్ష కేంద్రాలు | 4 | 8 |

★ ఇప్పటికే రెగ్యులర్, ప్రైవేటు పరీక్ష కేంద్రాలను గుర్తించే ప్రక్రియ పూర్తయింది. పరీక్షల సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఇప్పటి నుంచే జిల్లా విద్యాశాఖాధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

**గతేడాది ఉత్తీర్ణత శాతం**

ఖమ్మం జిల్లా: 87.57 (31 జిల్లాల్లో ఆరో స్థానం)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: 80.49

### వంద శాతం ఫలితాలు సాధించటమే లక్ష్యం

**డి.వాసంతి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల విద్యాశాఖాధికారి**



ఈసారి పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించటమే లక్ష్యం. గత ఏడాది సాధించిన ఫలితాలను దృష్టిలో పెట్టుకుని అందుకు తగిన విధంగా పటిష్ఠ ప్రణాళిక తయారు చేశాం. ఇందు కోసం గత అక్టోబరు నుంచే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రధానోపాధ్యాయులకు కూడా తగిన సలహాలు, సూచనలు అందజేశాం. వీటిని తప్పనిసరిగా పాటించి ఫలితాల మెరుగు కోసం కృషి చేయాలి. ప్రతి పాఠశాలలో నూరుశాతం ఫలితాలు వచ్చే విధంగా ప్రయత్నం చేయాలి. అలా చేయని వారిపై చర్యలు తప్పవు. జిల్లా స్థాయిలో ప్రత్యేక దృష్టి పెట్టి పాఠశాలలను సందర్శిస్తాము. మండల స్థాయిలో కూడా మండల విద్యాశాఖాధికారులు, జిల్లా సెక్టోరియల్ అధికారులు కూడా తరచు పాఠశాలలను పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలి. స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు అల్పాహార ఏర్పాట్లు చేసుకోవాలి. ఈవిషయంలో ప్రభుత్వం ఎలాంటి నిధులు విడుదల చేయటం లేదు. ప్రధానోపాధ్యాయులే తగిన చొరవతీసుకోవాల్సిన అవసరం ఉంది.





# సూక్ష్మ రూపం.. కళ అపురూపం!

**గౌరీశంకర్ వినూత్న ప్రతిభ**

**లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు సాధన దిశగా అడుగులు**

న్యూస్‌టుడే – సత్తుపల్లి గ్రామీణం

ప్రతి ఒక్కరికీ ఏదో ఒకటి సాధించాలనే లక్ష్యం ఉంటుంది. అయితే ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు చేసే కృషి, నైపుణ్యంతోనే విజయం సిద్ధిస్తుంది. ఇందుకు ఆలోచనలు కార్యరూపం దాల్చాలి... ఆ దిశగా ప్రయత్న లోపం లేకుండా కృషి సాగాలి. అప్పుడే అనుకున్నది సాధించగలం. ఈ కోవలోనే సత్తుపల్లికి చెందిన పాలిటెక్నికల్ విద్యార్థి గుమ్మిడదల గౌరీశంకర్ సూక్ష్మ కళాఖండాలు రూపొందిస్తూ లిమ్కా బుకాఫ్ ఆఫ్ రికార్డు సాధన దిశగా పట్టుదలతో సాగుతున్నారు. గౌరీశంకర్‌కు చిత్రలేఖనంపై చిన్ననాటి నుంచే ఎంతో మక్కువ... పాఠశాల స్థాయి నుంచే చిత్రలేఖనంలో రాణించేవారు. అందరికంటే భిన్నంగా ఉండాలనే తలంపుతో చైనాకు చెందిన మైక్రో ఆర్టిస్ట్ చింగ్‌చాంగ్‌చూను ఆదర్శంగా తీసుకుని పెన్సిల్స్, చాక్‌పీస్‌లతో ఎంతో కష్టతరమైన, సున్నితమైన కళాఖండాలను రూపొందించి పలువురితో శభాష్ అనిపించుకుంటున్నారు. తల్లిదండ్రులు శివ, నవలోక, తోటి మిత్రుల ప్రోత్సాహంతో సూక్ష్మ కళాఖండాలు రూపొందిస్తున్నాడు. చాక్‌పీస్‌లు, పెన్సిల్‌ను ఉపయోగించి పాము, సంకెళ్లు, కత్తులు, మనిషి ముఖచిత్రాలు, అస్థిపంజరం, కర్రకు చుట్టుకుని ఉన్న పాము, చాక్‌పీస్‌తో త్రిడీలో 'తెలంగాణ' అక్షరాలు రాయడం, అంతే కాకుండా 15 భాషల్లో తెలంగాణ అని చాక్‌పీసులపై రాయడం వంటి అంశాలతో తన ప్రతిభను నిరూపించుకుంటున్నారు. పెన్సిల్‌తో అతి కష్టమైన చైను లింకులు తయారు చేయడం కూడా ఎంతో నేర్పుతో చేస్తున్నాడు. ఓ పక్క చదువులో మరో పక్క తాను ఎంచుకున్న లిమ్కా బుకాఫ్ రికార్డు సాధనకు ఎంతో శ్రమిస్తున్న గౌరీశంకర్ ఆశయం నెరవేరాలని ఆకాంక్షిద్దాం.


పెన్సిల్‌తో 15 చైన్ లింకులు తయారి


పెన్సిల్‌తో తయారు చేసిన కత్తి


పాము ఆకారంలో పెన్సిల్

### నమ్మకంతో కృషి..

"లిమ్కా బుకాఫ్ రికార్డులో స్థానం కోసం శ్రమిస్తున్నా. పెన్సిల్‌తో విభిన్న కళాఖండాలు చేస్తూ ఆ దిశగా సాగుతున్నాను. గతంలో ఉన్న రికార్డులను అధిగమించాలన్నది నా ప్రయత్నం. ఆ రికార్డును సాధిస్తానన్న నమ్మకం నాకుంది."

**గౌరీశంకర్, డిప్లొమా ద్వితీయ సంవత్సర విద్యార్థి**

# ఒక్క గోవు.. మేలు వేనవేలు!

**జీవామృతంతో పైరుకు జయం!**

**గోఆధారిత వ్యవసాయం దిశగా రైతులు**

'ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలను గుర్తించాలి... గోవు పురాతన కాలం నుంచి మన జీవన విధానంలో భాగం.. జీవామృతం విధానంలో గోవు ప్రయోజనాలను సద్వినియోగం చేసుకుంటే పంట దిగుబడిని పెంచుకోవడమే కాకుండా రసాయనిక ఆనవాళ్లు లేని మంచి ఆహారాన్ని భావి తరాలకు అందించవచ్చు' ఈ అంశాలను నియోజకవర్గంలోని దమ్మపేట, అశ్వారావుపేట మండలాల రైతులు నిజం చేస్తున్నారు. జీవామృతం విధానంలో అద్భుతాలను సృష్టిస్తున్నారు.

దమ్మపేట, న్యూస్‌టుడే

నేటికి ఆహార ఉత్పత్తుల్లో పురుగు మందులు, రసాయనిక అవశేషాలు పెరిగిపోతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తున్న తరుణంలో... ఇటు వ్యవసాయశాఖ అధికారులు, ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయ విధానాలను రైతులు అవలంబించేలా పలు చర్యలు చేపడుతోంది. పొరుగునే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పలువురు రైతులు ఇప్పటికే సేంద్రియ విధానాలు, జీవామృత పద్ధతులతో అద్భుతాలు సాధిస్తున్నారు. ఇటీవల ఆ సాగు తీరును పరిశీలించేందుకు ఇక్కడి రైతులతో కలసి వెళ్లి వ్యవసాయ శాఖాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఆంధ్రా ప్రాంత రైతులకు దీటుగా ఈ ప్రాంతంలోని కొంతమంది రైతులు ఈ సాగులో చక్కని విజయాలను సాధిస్తున్నారు. అతి తక్కువ ఖర్చుతో రసాయనిక ఎరువుల ఊసే లేకుండా మంచి దిగుబడులు సాధిస్తున్నారు.


అల్లిపల్లి గ్రామంలో గోశాలను పరిశీలిస్తోన్న రాష్ట్ర మంత్రి జగదీష్‌రెడ్డి


సేంద్రియ సాగుతో విరగకాసిన కోకో పంటను పరిశీలిస్తోన్న మంత్రి తుమ్మల

## పెరుగుతున్న ఆసక్తి..

దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో జీవామృతం తయారీ, సేంద్రియ సాగు పద్ధతులపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఈ రెండు మండలాల్లో ఇప్పటికే 20కి పైగా గోఆధారిత వ్యవసాయ క్షేత్రాలు వెలిశాయి. ఒక్కో రైతు సరాసరిన 10కి పైగా గోవులను కేవలం జీవామృతం కోసమే పెంచుతున్నారు. తమ సొంత అవసరాలకు పోను మిగిలిన వాటిని సాటి రైతులకు అతి తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. వారిలోను ఈ సాగు పట్ల చైతన్యం కల్పిస్తున్నారు.

## నాయకులూ మక్కువతో..

ఈ సాగుపై సామాన్య రైతులేగాక.. నేతలూ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సేంద్రియ సాగుపై రాష్ట్ర రోడ్లు భవనాల శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు గో ఆధారిత వ్యవసాయంపై మక్కువ చూపారు. గండుగులపల్లిలోని ఆయన క్షేత్రంలో అధిక శాతం వ్యవసాయం ఈ పద్ధతిలోనే సాగుతోంది.

◆ దమ్మపేట మండలంలోని రాష్ట్ర ఆయిల్‌పాం రైతు సంఘం అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్ 20 ఆవులతో గోశాలను ప్రారంభించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దేవరపల్లి హరికృష్ణ గత నాలుగేళ్లుగా గోఆధారిత వ్యవసాయంలో చక్కని ఫలితాలు సాధిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన కౌతా శ్రీరామచంద్రమూర్తి, ఉమామహేశ్వరరావు, మందలపల్లికి చెందిన దేవరపల్లి అజయ్‌కుమార్, అడపా ధర్మారావు, మోరంపూడి రామచంద్రరావులు గోఆధారిత వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

◆ అశ్వారావుపేట మండలంలో కాసాని వెంకటేశ్వరరావు, మురళీ, గారపాటి రాంబాబు, చీమకుర్తి వెంకటేశ్వరరావు సహా పలువురు రైతులు గో ఆధారిత వ్యవసాయంలో దూసుకుపోతున్నారు. మండలంలోని చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయంలో భారీ గోశాల నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ గోశాలలో జీవామృతం తయారు చేసి రైతులకు అతి తక్కువ ధరకు సరఫరా చేసే ఆలోచనలకు దేవాయల కమిటీ సమాలోచనలు చేస్తోంది.

ఆదర్శం

## జీవామృతం తయారీ ఇలా..

ఒక్కో గోవు రోజుకు సుమారుగా 200 లీటర్ల మూత్రాన్ని అందిస్తోంది. దీనికోసం భూగర్భ సిమ్మెంట్ తొట్టెలను నిర్మిస్తారు. గోవులను ఉంచిన పాక నుండి గో మూత్రం నేరుగా తొట్టిలోకి వచ్చేలా పైపులను ఏర్పాటుచేసి దానిలో నింపుతారు.. తొట్టిలోకి చేరుకొన్న గోమూత్రంలో, గో మేధికాన్ని కలపి దానిలో అమూల్య, హెర్ట్ వంటి బయో ఉత్పత్తులను మరికొంత మంది బెల్లం, పప్పుధాన్యాల పొట్టు వంటి పదార్థాలను కలుపుతారు. ఈ మిశ్రమాన్ని 10 రోజుల పాటు ఊరబెడతారు. వీటి వల్ల ఈ మిశ్రమంలో మంచి బ్యాక్టీరియా అభివృద్ధి చెందుతుంది. ఈ మిశ్రమాన్ని చెట్లకు అందిస్తారు.. దీంతో చెట్లకు సమృద్ధిగా పోషకాలు అందుతున్నాయి. దీంతో పాటు చీడపీడల నివారణకూ ఉపయోగపడుతుంది. ఏడాది రసాయనిక ఎరువుల ఖర్చుతో శాశ్వతంగా గో ఆధారిత వ్యవసాయ ఏర్పాట్లు పూర్తి అవుతాయి. ఒక్క రుపాయి రసాయనిక ఎరువులకు వాడకుండా చక్కగా వ్యవసాయం సాగిపోతుంది.

## ప్రోత్సాహం అందిస్తే మేలు...

ఉద్యాన పంటలు పండించే రైతులను గోఆధారిత వ్యవసాయం దిశగా మరింత ప్రోత్సాహిస్తే మరిన్ని సత్ఫలితాలు సాధించవచ్చు. ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నియోజకవర్గంలో రైతులకు గేదెలకు బదులుగా ఆవుల కొనుగోలుకు రాయితీ అందించాలని పశుసంవర్ధకశాఖ అధికారులకు సూచించారు. దీనికి కేంద్ర సహకార బ్యాంకు ముందుకు వచ్చింది. ఇది కార్యరూపం దాల్చితే, ఉద్యాన పంటలకు కేరాఫ్ అడ్రస్ అయిన దమ్మపేట, అశ్వారావుపేట మండలాలు గో ఆధారిత వ్యవసాయంలో అగ్రస్థానంలో నిలుస్తాయి.

### సులువైన పద్ధతి

**కాసాని వెంకటేశ్వరరావు, ఆదర్శ రైతు**



గో ఆధారిత వ్యవసాయం ఎంతో సులువైన పద్ధతి. ఈ విధానం ద్వారా ఎరువుల ఖర్చు భారం పూర్తిగా తొలగుతుంది. 5 ఎకరాలు ఉన్న రైతు కేవలం రెండు ఆవులను సమకూర్చుకుంటే సరిపోతుంది. ఆయిల్‌పాంకు గో ఆధారిత వ్యవసాయం అందిస్తున్న నాటి నుంచి తోటలో దిగుబడి బాగా పెరిగింది. సరాసరిన ఎకరాకు 12 నుండి 13 టన్నుల దిగుబడి అందుకుంటున్నాం. రసాయనిక ఎరువులు వాడిన నాటి కంటే సుమారు రెండు టన్నుల దిగుబడి పెరిగింది.


గోమూత్రంతో తయారు చేసిన మిశ్రమాన్ని చెట్లకు పోస్తున్న కూలీలు

### కావల్సినవన్నీ సేంద్రియంతోనే..!

**హరికృష్ణ, ఆదర్శ రైతు, రైతు నేస్తం పురస్కార గ్రహీత**



కొబ్బరి, కోకో, పామాయిల్ పంటలను పూర్తిగా సేంద్రియ పద్ధతుల్లో పండిస్తున్నాను. మా కుటుంబ అవసరాల కోసం జీవామృతం పద్ధతిలో ఒక ఎకరం వరి పంటను సాగు చేస్తున్నాను. దీనితో పాటుగా వ్యవసాయ క్షేత్రంలో ఖాళీ ప్రదేశాల్లో బీర, కంది, ఇతర కాయకూరలను సాగు చేస్తున్నాను. జీవామృతంతో చెట్లలో బోరాన్, మెగ్నీషియం వంటి లోపాలను అధిగమించవచ్చు.




# ఇదో టైపు దారి



**నేడు 'స్టెనోగ్రాఫర్' పితామహుడు సర్ ఇసాక్ పిటమిన్ జయంతి**

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే

గత కొన్ని దశాబ్దాలుగా షార్ట్‌హ్యాండ్ విద్యను, టైప్‌రైటింగ్(జంట కళలు) అభ్యసిస్తూ ఎంతో మంది యువత కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల్లో కొలువులు పొందుతూ ఉన్నత స్థానానికి చేరుకున్నారు. ఒకప్పుడు పత్రికా రంగంలో దీనికి గొప్ప ప్రాధాన్యం ఉండేది. న్యాయశాఖలో ఇప్పటికీ న్యాయమూర్తుల వద్ద స్టెనోగ్రాఫర్‌లకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఆధునిక యుగంలో యువతీ యువకులు సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ రంగాల వైపు మొగ్గు చూపుతూ ఎంతో విలువైన విద్యను చిన్నచూపు చూడటంతో ఆదరణ తగ్గింది. ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌లో, ఇతర శాఖల్లో స్టెనోగ్రాఫర్ గూపు-సి, గ్రూపు-డి, గెజిటెడ్ స్టెనో కొలువులకు ఉద్యోగ ప్రకటన విడుదల చేస్తుంది. అతి తక్కువ మంది దీనిని అభ్యసించటం వలన పూర్తి స్థాయిలో ఉద్యోగాలు భర్తీ కావటం లేవు.

## కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహం

దీనిపై యువతను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం గత 25 సంవత్సరాల నుంచి ఇంటర్మీడియట్ వృత్తి విద్య విభాగంలో 'ఆఫీసు అసిస్టెంట్' కోర్సును ప్రారంభించి ఇప్పటికీ కొనసాగిస్తున్నాయి. రాష్ట్ర సాంకేతిక విద్యామండలి, శిక్షణ హైదరాబాద్ వారు ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, సెప్టెంబరులలో నిర్వహించే రాష్ట్ర టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ పరీక్షలకు ప్రభుత్వ గుర్తింపు పొందిన శిక్షణ కేంద్రాల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10వేల మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ప్రభుత్వ రంగంలోనే కాక ప్రైవేటు రంగంలోనూ ఎంఎన్‌సీలో పర్సనల్ అసిస్టెంట్ పోస్టులకు షార్ట్‌హ్యాండ్, టైప్‌రైటింగ్‌ను అర్హతగా తీసుకుంటున్నారు. 2012నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం జూనియర్, సీనియర్ స్టెనోగ్రాఫర్ కొలువులకు సంబంధించి ఉద్యోగ ప్రకటన విడుదల చేయకపోవటం వల్ల ఈవిద్యలో ఉత్తీర్ణత సాధించిన అనేక మంది ఎదురుచూస్తున్నారు.

### గెజిటెడ్ ర్యాంకు ఉద్యోగం సాధించాను

**ఎస్‌కె.ఆరిఫ్, పర్సనల్ సెక్రటరీ, హైకోర్టు**


డిగ్రీ పూర్తి చేసిన అనంతరం షార్ట్‌హ్యాండ్, టైప్‌రైటింగ్‌పై పూర్తి పట్టు సాధించాను. 2012లో హైకోర్టులో పర్సనల్ సెక్రటరీ ఉద్యోగానికి దరఖాస్తు చేశాను. కఠోర సాధన చేసి పరీక్షకు హాజరయ్యాను. అతి చిన్న వయస్సులోనే అత్యున్నత న్యాయస్థానంలో గెజిటెడ్ ర్యాంక్ గల కొలువు సాధించగలిగాను.

### కఠోర సాధన అవసరం



ఈ జంట కళలు అభ్యసించాలంటే క్రమశిక్షణతో కూడిన కఠోర శ్రమ అవసరం. అదే విధంగా ఆంగ్ల భాషలో కొన్ని మెలకువలు కూడా అవసరం. ముఖ్యంగా పేద విద్యార్థులు వారి జీవితాలను ఉన్నత శిఖరాలకు చేరుకోటానికి ఈకోర్సు ప్రభుత్వం కల్పిస్తున్న చక్కని విద్య. మా వద్ద ఈ కోర్సు నేర్చుకున్న అనేక మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు సాధించటంతో పాటు గ్రూప్-1 అధికారి స్థాయికి చేరారు.

**రాజేశ్, షార్ట్‌హ్యాండ్, టైపు రైటింగ్ ఒప్పంద అధ్యాపకుడు, నయాబజారు జూనియర్ కళాశాల, ఖమ్మం**



"సర్ ఇసాక్ పిటమిన్ జనవరి 4వ తేదీ 1813లో ఇంగ్లాండ్‌లో జన్మించారు. వృత్తి రీత్యా ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఆంగ్లంలో ఎంతో ఉపయోగకరమైన శబ్దాలను ఆధారం చేసుకొని మొట్టమొదట 1837లో 'స్టెనోగ్రాఫర్' విధానాన్ని కనుగొన్నారు. ఈవిధానం తెలియాలంటే 'షార్ట్‌హ్యాండ్'ను అభ్యసించటం తప్పని సరి. అందుకే ఇతన్ని 'ఫాదర్ ఆఫ్ షార్ట్ హ్యాండ్' అని కూడా అంటారు."

**ఖమ్మం జిల్లాలో ఈ కోర్సును అందిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలు**

- ◆ ప్రభుత్వ జూనియర్ కళాశాల, నయాబజారు, ఖమ్మం
- ◆ ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికలు, ఖమ్మం
- ◆ ప్రభుత్వ జూనియర్ కళాశాల మధిర, ముదిగొండ, నేలకొండపల్లి, సిరిపురం
- ◆ ఒక్కో కళాశాలలో 40సీట్లున్నాయి. ఇవి కాక ప్రైవేటు సంస్థల్లో కూడా అవిభాజ్య ఖమ్మం జిల్లాలో సుమారు 1000మంది విద్యార్థులు ఈ విద్యను అభ్యసిస్తున్నారు.

### చాలా మందికి సరైన అవగాహన లేదు

**కేఎస్ రామారావు, నయాబజారు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రిన్సిపల్**



ఈ కోర్సుతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు చాలా ఉన్నాయి. దీని పట్ల సరైన అవగాహన లేకపోవటం వల్ల సాఫ్ట్‌వేర్ రంగం వైపు వెళ్తున్నారు. శిక్షణ పొందిన అనేక మంది విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించారు. షార్ట్‌హ్యాండ్ నేర్చుకున్న వారికి ప్రైవేటు సంస్థల్లో కూడా ఉద్యోగ అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి.

### ప్రత్యేకత, ప్రతిభ ఉంటేనే ఉద్యోగం

**ఎస్.అనిల్‌కుమార్, స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3, ఎన్ఎఫ్‌సీ, హైదరాబాద్**

మాది కొణిజర్ల మండలం పెద్దమునగాల. నేటి పోటీ ప్రపంచంలో ప్రత్యేక చదువుతో పాటు ప్రతిభ ఉంటేనే ఉద్యోగం సాధించే అవకాశం ఉంది. షార్ట్‌హ్యాండ్, టైపు నేర్చుకున్నాను. హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్‌లో ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం నెలకు రూ.30వేలు సంపాదిస్తున్నాను.

### వృత్తి విద్యతో మారిన జీవితం

**పాతకోటి నవీన్, స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3, జ్యుడీషియల్ డిపార్ట్‌మెంట్, సత్తుపల్లి**

మాది ఖమ్మం గ్రామీణ మండలం మద్దులపల్లి. నయాబజారు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ వృత్తి విద్యలో చేరి కోర్సు పూర్తి చేశాను. ఆ తర్వాత ప్రత్యేక శిక్షణ తీసుకొని 2017 నవంబరులో సత్తుపల్లిలోని అడిషనల్ సివిల్ జడ్జి న్యాయస్థానంలో స్టెనోగ్రాఫర్ గ్రేడ్-3 ఉద్యోగం సాధించాను. వృత్తి విద్యతో నాజీవితం మారిపోయింది.

# హాయ్! బుజ్జీ!!



రంగు రంగుల పేపర్ వెయిట్‌లు...
వాటి లోపల్లోపల చిత్రమైన ఆకారాలు...
మధ్య మధ్యలో గాలి బుడగలు...
అక్కడక్కడా అలంకారాలు...
అన్నీ కలిసి గుండ్రటి ఆ గాజులో...
ఎలా దూరాయి చెప్మా?

## పేపర్ వెయిట్.. తయార్!

మనం స్కూళ్లలో, కార్యాలయాల్లో గాజు పేపర్ వెయిట్‌లను చూస్తూనే ఉంటాం కదూ. పరీక్షించి వాటిని ఎప్పుడైనా చూశారా? లోపల బోలెడు రంగులుంటాయ్. ఆకులు, పువ్వుల్లాంటి డిజైన్‌లుంటాయ్. మధ్య మధ్య నీటి బిందువుల్లా కనిపించే గాలి బుడగలుంటాయ్. అవన్నీ లోపలికి ఎలా వెళ్లి ఉంటాయ్? ఎప్పుడైనా ఆలోచించారా? లోపలికి వెళ్లినట్టు ఎక్కడా దారి కనిపించదు. ఎక్కడా అతికినట్టూ అనిపించదు. మరి అంత అందంగా, గుండ్రంగా అవి ఎలా తయారవుతాయబ్బా?

### తయారీ ఎలా?



1

◆ గాజు పేపర్ వెయిట్‌లను తయారు చేయడానికి మూల పదార్థంగా కరిగి ఉన్న గాజు ద్రవాన్ని వాడతారు. గాజు ముక్కల్ని 2000డిగ్రీల ఫారన్‌హీట్ దగ్గర మండించి ద్రవరూపంలోకి మారుస్తారు. అది ఒక కొలిమి దగ్గర ద్రవరూపంలో పై నుంచి కారుతుంటుంది. అక్కడ దూరం నుంచి గాలి ఊదడానికి వీలుగా ఉండేలా స్ట్రాలాంటి ఇనుప గొట్టాన్ని వాడతారు. దాని చివరను గాజు ద్రవం పడే దగ్గర పెట్టి గుండ్రంగా తిప్పుతూ ఉష్ణోగ్రతని తగ్గిస్తారు.



2

◆ అది కొంచెం కొంచెం గట్టి బడే సమయంలో చమ్కీల్లాంటివాటిని, రంగుల్నీ అద్దుతారు. పొడవు గొట్టాన్ని అటూ ఇటూ తిప్పుతూ మెత్తగా ఉన్న గాజును మెలికలు తిప్పి రకరకాల ఆకారాలు సృష్టిస్తారు.



3

◆ లోపలి డిజైన్ పూర్తయిన తర్వాత పైన మరోసారి గాజు ద్రవం పోసి గొట్టాన్ని గుండ్రంగా తిప్పుతారు. దాన్ని ఓ గుంట గరిటలాంటి దాంట్లో పెట్టి గుండ్రంగా తిప్పుతూ బంతి ఆకారం తెస్తారు.



4

◆ గొట్టానికి చివరిగా ఉన్న గాజు బంతిని చాకుతో కత్తిరించి అడుగుభాగాన్ని చదును చేస్తారు. అంతే. వేడి పూర్తిగా చల్లారే వరకూ పక్కన పెట్టి తర్వాత దాన్ని ప్యాక్ చేసేస్తారు. వాటినే మనం బజార్‌లో కొనుక్కుంటాం.

◆ ఇది సాధారణంగా గాజు పేపర్ వెయిట్ తయారీలో పాటించే విధానం. ప్రాంతాల్ని బట్టి ఈ విధానంలో కొన్ని మార్పులు ఉంటుంటాయి. కొన్నింటిని ఒక్కొక్కటిగా మనుషులే తయారు చేస్తే మరి కొన్ని ఫ్యాక్టరీల్లో పెద్ద ఎత్తున తయారవుతున్నాయి. గాజు పేపర్ వెయిట్‌లతోపాటు ఇప్పుడు ప్లాస్టిక్, రెజీన్‌లతో చేసిన పేపర్ వెయిట్‌లనూ ఎక్కువగా వాడుతున్నారు.

### పుట్టింది ఎప్పుడంట?


● 1845 నుంచి 1860ల మధ్యలో తొలిసారిగా యాంటిక్ పేపర్ వెయిట్‌లను తయారుచేశారు.
● జస్టిన్ స్కూబర్ట్ అనే ఆయన మొదటగా వీటిని తయారు చేశారని చెబుతారు. ఎక్కడంటే ఫ్రాన్స్‌లో.
● ఇప్పుడు మనం చూస్తున్న గాజు వెయిట్‌లు మాత్రం 1940ల తర్వాత పుట్టినవే.

### లోపల పువ్వులెలా?

● ద్రవపు గాజు మెత్తబడే సమయంలో ప్రత్యేకమైన పరికరాల్ని ఉపయోగించి చిన్న పువ్వులు, ఆకుల్లాంటి డిజైన్‌లను ముందే చేసి పెట్టుకుంటారు. వాటిని వెయిట్ తయారు చేసేప్పుడు లోపలే ముందు అందంగా పేరుస్తారు. రంగులు అద్దడం అయినా అంతే. నీటి బిందువుల్లా కనిపించాలనుకున్న చోట స్ట్రాలాంటి గొట్టంలో నుంచి గాలిని ఊదుతారు. దీంతో లోపల సన్నని గాజు బుడగలొస్తాయి.



## బింబో & బబ్లూ — అండమాన్‌లో సాహసాలు 1




## ఛత్తీస్‌గఢ్ రాజధాని ఏది?

### స్కూల్ సవాల్

1. మన దేశంలో సిపాయిల తిరుగుబాటు ఎప్పుడు జరిగింది?
2. వాస్కోడీగామా ఏ దేశస్థుడు?
3. ఛత్తీస్‌గఢ్ రాజధాని ఏది?



- షణ్ముఖరావు, తొమ్మిదో తరగతి బి. నేతాజీ, ఏడో తరగతి, జడ్‌పీ హెచ్ స్కూల్, చల్లవానిపేట, శ్రీకాకుళం జిల్లా

### ఆణిముత్యం

మంచిపనిని మించిన పూజలేదు, మానవత్వాన్ని మించిన సంపద లేదు

- మదర్ థెరిసా

### నేర్చుకుందాం!

ఆంగ్లంలో చాలా పదాల్లో సైలెంట్ లెటర్స్ ఉంటాయి. తెలియక మనం వాటిని తప్పుగా పలికేస్తుంటాం. వాటి సరైన ఉచ్చారణ తెలుసుకుంటే సరి.


Thumb - థమ్
Subtle - సటల్



### కవలలేవి? ఒకేలా ఉన్న జతను పట్టుకోండి



### దారి కనుక్కోండి!



### సబ్జెక్ట్ ల్యాబ్ — సైన్స్

ఇక్కడున్న బొమ్మలు, వాక్యాల ఆధారంగా ఖాళీల్లో వచ్చే పదాలేంటో కనుక్కోగలరా?

1. We [ ] with our (nose)
2. We [ ] with our (eyes)
3. We [ ] with our (ear)
4. We [ ] with our (tongue)
5. We [ ] with our (hands)

జవాబులు: స్కూల్ సవాల్: 1. 1857 2. పోర్చుగల్ 3. రాయ్‌పూర్
కవలలు: 2,4 సబ్జెక్ట్ ల్యాబ్ - సైన్స్: 1.Smell 2.See 3.Listen 4.Taste 5.Touch



# పొడగరికే పట్టం

## ● బాస్కెట్‌బాల్ పోటీల్లో వీరే ప్రతిభావంతులు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. సీనియర్ విభాగం పోటీలు కావడంతో రాష్ట్రంలో అందెవేసిన సీనియర్ క్రీడాకారులంతా పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారు. పొడగరులు ఎక్కువగా ఉన్న జట్లు మిగిలిన జట్లపై ఆధిక్యం ప్రదర్శిస్తున్నాయి. ఇలాంటి జట్లలో హైదరాబాదు, రంగారెడ్డి జట్లు ముందున్నాయి. ఈ జట్లలో ఇప్పటికే జాతీయస్థాయిలో పతకాలు సాధించిన వారున్నారు. సహజంగానే ఈజట్లు ఆధిక్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. హైదరాబాదు జట్టుగా రంగంలో దిగిన క్రీడాకారులు ఆరడుగుల ఎత్తుపై వారే ఉన్నారు. శరీర ఎత్తు, అనుభవంలో రాటుదేలిన క్రీడాకారులు పూర్తి ఆధిక్యాన్ని ప్రదర్శిస్తున్నారు. పాల్గొన్న జట్లలో ఒకరిద్దరు ఆరడుగులు ఎత్తున్న క్రీడాకారులు ఉండగా వారి ప్రతిభే ఆయా జట్లకు అదనపు బలంగా మారింది. ఖమ్మం, మహబూబ్‌నగర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇరు జట్ల లోని పొడగరులే జయాపజయాలను నిర్ణయించారు.



పొడగరుల హైదరాబాదు జట్టు

### డంక్ షాట్‌లో ఆరితేరారు

బాస్కెట్‌బాల్ క్రీడలో వేగంగా కదులుతూ బంతిని బాస్కెట్‌లో వేసి రింగ్‌ను పట్టుకొని గాల్లో ఉంటారు. ఈ ప్రక్రియను బాస్కెట్‌బాల్లో డంక్‌షాట్‌గా వ్యవహరిస్తారు. ఇందులో ఉన్న చోటు నుంచి గాల్లోకి లేచి బంతిని బాస్కెట్‌లో వేసేవారు ఉన్నారు. శరీర బరువు అదుపులో ఉంచుకునే పొడగరులు వారు చేసే సాధనను బట్టి బాస్కెట్‌బాల్ క్రీడలో ప్రత్యేకంగా చూసే డంక్‌పై పట్టుసాధిస్తున్నారు. ఇలాంటి క్రీడాకారులు హైదరాబాదు జట్టు మొత్తంగా ఉన్నారు. ఖమ్మం జిల్లా జట్టులో ఇద్దరు, మిగిలిన జట్లలో ఒకరిద్దరు ఉన్నారు. హైదరాబాదు జట్టులో అనుభవం ఉన్న పొడగరులు ఉండటంతో ఆజట్టు అప్రతిహతంగా విజయాలు అందుకుంటోంది. పురుషుల మ్యాచ్‌లో ఖమ్మం జట్టును హైదరాబాదు ఏకపక్షంగా ఓడించింది. హైదరాబాదు జట్టుతో తలపడిన ప్రతీ జట్టుకు ఇలాంటి అనుభవమే ఎదురైంది.



### అందుకే ఆరడగులు ఉంటేనే జట్టులోకి

క్రీడారంగంలో పొడగరులకు ప్రత్యేక ఆహ్వానం ఉంటోంది. పుట్‌బాల్ మినహాయించి మిగిలిన అన్ని బాల్ గేమ్స్‌లో ఆరడుగులు ఆపై ఎత్తున్న వారికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా బాస్కెట్‌బాల్ అంశంలో ఎంతటి ప్రతిభావంతులైనా ఆరడుగులకు తక్కువ ఎత్తున్నవారిని జట్టులోని తీసుకోవడంలేదు. జాతీయ శిక్షణా శిబిరాల్లోనూ కనీసం ఆరు అడుగుల ఎత్తున్నవారినే శిక్షకులు ఎంచుకుంటున్నారు. దీన్ని రాష్ట్రస్థాయి పోటీలు మరోసారి నిరూపించింది.

## శభాష్ బేటా.. అరే ఏంటీ ఆట

### దిక్కులు పిక్కటిల్లేలా అరుస్తూ క్రీడాకారులకు ప్రోత్సాహం

బాస్కెట్‌బాల్ పోటీల్లో ఒక మ్యాచ్ 40 నిమిషాలు జరుగుతుంది. ఈ సమయంలో క్రీడాకారులు అటూఇటూ పరుగుతీస్తూనే ఉండాలి. బరిలో ఉన్న ఆటగాళ్లను శిక్షకులు పెద్దపెద్దగా అరుస్తూ మార్గదర్శనం చేస్తూ జట్టును ముందుకు నడపడం ఒక్క బాస్కెట్‌బాల్‌కే సొంతం. ఎంతగా అరుస్తారంటే రెండు మ్యాచుల తర్వాత వారి గొంతు పలకదు. ఖమ్మం, రంగారెడ్డి మహిళల మ్యాచ్ బుధవారం ఖమ్మం పెవలియన్ మైదానంలో కొనసాగుతుండగా ఖమ్మం జట్టు శిక్షకుడు పి.వి.రమణ, రంగారెడ్డి శిక్షకుడు నయీమ్ ఇద్దరూ పోటీ పడుతూ తమ జట్లకు సూచనలిచ్చే క్రమంలో కొన్ని సందర్భాల్లో శబాష్‌బేటా.. దబాదో.. అంతేరా నాన్న.. బంతి వస్తే చూసుకోవా ఈడియట్, బంతి ఇటేయి.. అదిరా.. అంతే అంతేరా... ఇలా మైదానం అంతా వినిపించేలా పెద్దగా అరుస్తూ తమతమ జట్లకు అండగా నిలిచారు.



రంగారెడ్డి శిక్షకుడు నయీమ్



ఖమ్మం శిక్షకుడు పి.వి.రమణ

## క్రీడాకారుల ఆట జిహ్వా'చేప'ల్యం



ఐ.ఎం.హాల్లో వంటల సందడి

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు 150 మంది క్రీడాకారులు, 50 మంది శిక్షకులు, మేనేజర్లు, వందమంది తల్లిదండ్రులు, 50 మంది రాష్ట్ర బాస్కెట్‌బాల్ సంఘం కార్యనిర్వాహక బృందం, 70 మంది నిర్వాహక బృందం ఇలా వందల సంఖ్యలోనే భోజనాలు సిద్ధం చేయాల్సి వచ్చింది. పోటీలు జరిగిన మూడు రోజులు మాంసాహారాలే సిద్ధం చేశారు. రెండో రోజు చేపల పులుసు ప్రత్యేక వంటకంగా వడ్డించారు. ఇక్కడికి వచ్చిన అతిథులు, క్రీడాకారుల్లో ఎక్కువ మంది ఖమ్మం చేపలు రుచిగా ఉంటాయని విన్నాం. గోదావరి నుంచి తెస్తారా అంటూ అడిగారు. విషయం గ్రహించిన నిర్వాహకులు వారి కోరికకు అనుగుణంగా చేపల పులుసు సిద్ధం చేశారు. గోదావరి భద్రాచలం వద్ద ఉంది. ఇక్కడికి చాలా దూరం స్థానికంగా చెరువులు చాలా ఉన్నాయి. అక్కడి నుంచే చేపలు వస్తాయని నిర్వాహకులు వివరించారు. వంట మాస్టర్ రుచికరంగా సిద్ధం చేయడంతో అందరూ చేపల పులుసుకు ఫిదా అయ్యారు. కొసమెరుపు ఏమిటంటే చేపల పులుసుకు డిమాండ్ పెరగడంతో వండిన చికెన్ మిగిలింది.



## హోరాహోరీ పోరులో బాస్కెట్‌బాల్ జట్లు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: సీనియర్ బాస్కెట్‌బాల్ పోటీలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఖమ్మం పెవిలియన్ మైదానంలో బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచుల్లో పురుషులు, మహిళలు రెండు విభాగాల్లో జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ప్రతిభకు తగ్గట్టుగానే పురుషుల విభాగంలో హైదరాబాదు జట్టు సునాయసంగా సెమీస్‌కు చేరుకోగా కరీంనగర్, వరంగల్ జట్లు అదేబాటలో నిలిచాయి. లీగ్ దశలో హైదరాబాదు జట్టు మహబూబ్‌నగర్ జట్టును 98-38, ఖమ్మంను 75-26 స్కోర్‌తో కంగుతినిపించి సెమీస్‌లో నిలిచింది. వరంగల్ జట్టు నిజామాబాద్ జట్టును 71-46 స్కోర్ ఓడించి, మరో మ్యాచ్‌లో నల్గొండ జట్టుతో హోరాహోరీగా తలపడి 45-32 స్కోర్‌తో గెలుపొంది సెమీస్ బరిలో నిలిచింది. మహిళా విభాగంలో జరిగిన మ్యాచుల్లో నల్గొండపై మహబూబ్‌నగర్ 38-16 స్కోర్‌తో, నిజామాబాద్‌పై రంగారెడ్డి 33-6 స్కోర్‌తో, కరీంనగర్‌పై మెదక్ 38-21 స్కోర్‌తో, వరంగల్‌పై కరీంనగర్ 32-18 స్కోర్‌తో, ఖమ్మంపై రంగారెడ్డి జట్టు 73-42 స్కోర్‌తో, వరంగల్‌పై మెదక్ జట్టు 33-19 స్కోర్‌తో, నిజామాబాద్‌పై ఖమ్మం 45-13 స్కోర్‌తో, మహబూబ్‌నగర్‌పై హైదరాబాదు జట్టు 53-13 స్కోర్‌తో, నల్గొండపై హైదరాబాదు 40-8 స్కోర్‌తో గెలుపొందాయి. గురువారం ఫైనల్ మ్యాచులు నిర్వహించి అనంతరం ముగింపు కార్యక్రమంలో జాతీయ పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారుల వివరాలను ప్రకటిస్తారని జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం కార్యదర్శి రమణ యాదవ్ తెలిపారు.



హోరాహోరీగా తలపడుతున్న హైదరాబాద్, నల్గొండ క్రీడాకారిణులు



రాత్రివేళ జరిగిన పోటీ దృశ్యం

# నీలిమేఘ శ్యామునికి స్థపన తిరుమంజనం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారి సన్నిధిలో బుధవారం స్వామివారి పునర్వసు నక్షత్రం సందర్భంగా ప్రాకార మండపంలో నిత్య కల్యాణమూర్తులకు స్థపన తిరుమంజనం నేత్రపర్వంగా నిర్వహించారు. పుష్యమి మాసోత్సవాలు, రాపత్తు ఉత్సవాలు, ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ఆండాళ్లు తల్లికి 19వ పాశురం ప్రాకారం చేశారు. నీలిమేఘ శ్యామునికి జనకుని కూతురు జానకమ్మకు జరిగిన నిత్య కల్యాణాన్ని చూసి భక్తులు తరించారు. మాంగళ్యధారణ, తలంబ్రాల వేడుక వేడుకగా జరిగాయి. వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు, మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన ఈ కల్యాణ వేడుక కమణీయంగా సాగింది.

**గోదారమ్మ వద్ద రామయ్యకు రాపత్తు సేవ:** రామయ్య సన్నిధిలో జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా లక్ష్మణ సమేత సీతారాములకు బుధవారం సాయంత్రం గోదావరి నది వద్ద గల పునర్వసు మండపంలో రాపత్తు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కోలాట నృత్యాలు, ఆలయ మర్యాదల నడుమ సాయంత్రం ఆలయం నుంచి బయలుదేరిన స్వామి వారు గోదావరి నది వద్దకు చేరుకుని అక్కడ వేచి ఉన్న భక్తులకు ఆశీర్వచనం అందించారు. పునర్వసు మండపంలో రామదాసు కీర్తనలు, వేద పఠనం, చిన్నారుల కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తిరువీధి సేవకు తాతగుడి వద్దకు తీసుకువచ్చారు. తాతగుడిలో విశ్రాంతి పొందిన సీతారాములను తిరిగి ఆలయం వద్దకు తీసుకెళ్లారు.



గోదావరి నది వద్ద పునర్వసు మండపంలో రాపత్తు సేవ



రాపత్తు సేవలో పాల్గొన్న భక్తులు

**నేడు కిట్టయ్య సన్నిధిలో రామయ్యకు ఆతిథ్యం:** జానకీరాములకు జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా నేడు కల్యాణ మండపం రోడ్డులోని కిట్టయ్య ఆలయంలో రామయ్యకు ఆతిథ్యం అందించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు జగన్నాథాచార్యులు తెలిపారు. ఈ రాపత్తు వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని రామయ్య సన్నిధి నుంచి వేడుకగా సీతారాములను కృష్ణాలయం వద్దకు తీసుకువచ్చి పూజలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

### నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో జరిగే నిత్యాన్నదానానికి బుధవారం భక్తులు రూ.లక్ష విరాళం అందించారు. ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచికి చెందిన వీఎస్ఎన్ శాస్త్రి, సుబ్బలక్ష్మి ఈ విరాళాన్ని అందించారు. సీతారాముల దర్శనం చేసుకున్న అనంతరం ఈ నగదును ఆలయ వర్గాలకు అందించారు.



కలెక్టర్‌ని కలిసి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని వినతి

**కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు బుధవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీని కలిసి వినతి పత్రం అందించారు. తెలంగాణ ప్రభుత్వం అఖిలపక్ష నాయకులను దిల్లీకి తీసుకెళ్లి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి, చట్టబద్ధత కల్పించేలా కృషి చేయాలని పేర్కొన్నారు. కుల వృత్తిని నమ్ముకొని చెప్పులు కుడుతూ జీవనం సాగిస్తున్న చర్మకారులకు రూ.2 వేల పింఛను అందించాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదింపజేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ని కోరారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గొడ్ల మోహన్‌రావు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు బి.శ్రీనివాస్, శనగరపు శ్రీనివాస్, కుమార్, వికాస్, వెంకన్న, కృష్ణ, రాజు తదితరులున్నారు.

## పేద మైనార్టీ పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్ష

**ఖమ్మంవిద్యావిభాగం, న్యూస్‌టుడే:** హైదరాబాద్ జకాత్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ రెసిడెన్షియల్ కళాశాలలో మైనార్టీ విద్యార్థులు(బాలురు) కోసం అంతర్జాతీయ ప్రమాణాలు, హాస్టల్ వసతులతో కూడిన ఇంటర్ విద్యను, నిట్, ఐఐటీ, జేఈఈమెయిన్స్, ఎంసెట్ పరీక్షలకు సీనియర్ అధ్యాపకుల పర్యవేక్షణలో శిక్షణ అందిస్తున్నట్లు హైదరాబాద్ జకాత్ ఛారిటబుల్ ట్రస్ట్ జిల్లా ఇన్‌ఛార్జి అబ్దుల్ మలిక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి గాను ఈనెల 28న ఖమ్మంలోని ఆక్స్‌ఫర్డ్‌స్కూల్లో, కొత్తగూడెంలోని సిద్దార్థ ఒకేషనల్ జూ. కళాశాలలో, ఫిబ్రవరి 4న సత్తుపల్లిలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న పేద మైనార్టీ బాలురు తమ పేరు, స్కూల్, ఇతర వివరాలు ఈనెల 22వతేదీ లోపు చరవాణి నెంబర్లు 9866556876, 9848612585లను సంప్రదించాలని సూచించారు.

## ఈటీవీలో ఈనాడు

**ఉదయం**

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: సొంతింటి కల నెరవేరాలంటే చేయాల్సిన దానాలు?, వాస్తురీత్యా విద్యుత్ ఉపకరణాలు ఏ దిశలో ఉండాలి?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆడదే ఆధారం (సీత, విసు).

**మధ్యాహ్నం**

12-00: తెలుగు'రుచి': ఘుమఘుమలు 'వంకాయ ఉలవకారం', మీ చేతివంట 'పన్నీర్ చెనా కర్రీ', 'ఆలూ పాలక్‌రైస్', జస్ట్ ఎ మినిట్ 'కాజూ గోబీపకోడీ' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

**సాయంత్రం**

04-00: ఋతుగీతం (డైలీ సీరియల్), 04-30: వసంతం (డైలీ సీరియల్), 05-00: జీన్స్-2 (రిపీట్), 06-00: ఒకరి ఒకరు (డైలీ సీరియల్), 06-30: తేనెమనసులు (డైలీ సీరియల్).

**రాత్రి**

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: జబర్దస్త్ - సూపర్‌హిట్ కామెడీ షో, 10-30: జబర్దస్త్ జల్సాటైం...

## ఈటీవీ ప్లస్

ఉదయం

11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం

12:00 జబర్దస్త్ రిమిక్స్

01:00 డీజే రిపీట్

01:15 స్టే..పూలిష్ రిపీట్

01:30 పటాస్ రిపీట్

02:00 అల్లరే అల్లరి రిపీట్

02:30 సరదాగా కాసేపు రిపీట్

03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్

03:30 నా షో నా ఇష్టం రిపీట్

సాయంత్రం

04:30 ఎక్స్‌ప్రెస్ రాజా

05:00 జిల్ జిల్ జిగా

06:00 అమృతం రిపీట్

06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి

07:30 తారక్ మామా అయ్యోరామ

08:00 పోవే..పోరా

09:00 పటాస్

09:30 టాప్స్

10:00 క్రాక్ కిడ్స్ రిపీట్

11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

## ఈటీవీ లైఫ్

- ★ మానస - బ్రహ్మకుమారి (ఉ.6:00, రా.11:30)
- ★ యోగమంత్ర (ఉ.7:00, సా.6:00, రా.10:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా.6:30, రా.10:00)
- ★ అమృతం: డైరీ డిలైట్స్ (ఉ.8:00, మ.12:30, రా.8:00)
- ★ హెల్దీ & టేస్టీ (ఉ.8:30, మ.1:00, రా.8:30)
- ★ కౌంట్ యువర్ కేలరీస్ (మ.1:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు ఆడుకునే బొమ్మలు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు (ఉ.9:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు తక్కువ బరువుతో పుట్టారా? (మ.2:00, రా.7:00)
- ★ సుఖజీవనం (ఉ.10:00, మ.2:30, రా.9:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. చెడు అలవాట్లు - కీళ్ల నొప్పులు, 2. నొప్పి నివారణ మాత్రలు - వాస్తవాలు, 3. చెవిలో శబ్దాలు (ఉ.10:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. మీ జుట్టు తీరు - మీ ఆరోగ్య స్థితి, 2. బాడీ పెయిన్స్ రావడానికి కారణాలు - పరిష్కారాలు, 3. మీ పళ్ళు జుంమంటున్నాయా? (మ.3:00, రా.9:00)
- ★ డా. ఈటీవీ: క్యాన్సర్ కేర్ (ఉ.11:00)
- ★ డా. ఈటీవీ: దంత సంరక్షణ (ఉ.11:15)
- ★ డా. ఈటీవీ: అజీర్తి సమస్యలు (మ.3:30, రా.7:30)
- ★ డా. ఈటీవీ: జనరల్ హెల్త్ (మ.3:45, రా.7:45)

## ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: టెలిషాపింగ్, 7-00: సన్‌రైజ్ సినిమా: ఇద్దరు కొడుకులు (శోభన్‌బాబు, రాధ) 10-00: మార్నింగ్ షో: నిత్యాకల్యాణం పచ్చతోరణం (చలం) మధ్యాహ్నం: 1-00: మాట్నీ: దొంగమొగుడు (చిరంజీవి, రాధిక) సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఒక సినిమాకథ (రాజేంద్రబాబు) రాత్రి: 7-00: ఫస్ట్ షో: వాడెవీడు (ఎన్టీఆర్, మంజుల) 10-00: ప్రముఖ దర్శకుడు పి.సి.రెడ్డితో గుర్తుకొస్తున్నాయి... (రెండవ భాగం).

## ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలీ చెనా ముల్లంగి పరాటా & మష్రూమ్ మఫిన్స్, ఉ.8.00, రా.9.00: బ్రేక్ ఫాస్ట్ షో - కీన్వ కాబూలినా టిక్కీ & జుకిని మిల్లెట్ మఫిన్స్, ఉ.8.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మసాలా ఎనగై, ఉ.9.30: సూపర్ భీమ్ - గేమ్ షో, ఉ.11.00: గోరుముద్దలు - సగ్గుబియ్యం టిక్కీస్, ఉ.11.15, రా.8.30: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు) - బ్రొకోలి సూప్, ఉ.11.30, రా.8:00: గోదావరి నెయ్యి "బాబాయ్ హోటల్" - జొన్న రొట్టె & పండుమిరపకాయ పచ్చడి, మ.12.00, సా.5.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మిక్స్డ్ వెజ్ సాగూ, మ.12.15, రా.10.15: మమ్మీస్ కిచెన్ - చెనా ఘూర్ గరం, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ (మొగలై స్టైల్) - బెండకాయ మటన్ కర్రీ, మ.12.45, సా.6.15: ఛాట్స్ & సూప్స్ - మేతి బార్లీ సూప్, మ.1.00, సా.4.30: వావ్ ఏమి రుచి (పార్సీ క్యూసైన్) - పార్సీ బిర్యానీ & పాలక్ ఈడ, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) వంకాయ బజ్జీ, మ.1.45, రా.7.30: పెరటి రుచులు - ఆయుర్వేదిక పెరటి మొక్కలు - ఇంటి చిట్కాలు, మ.2.15: మటన్‌తో మస్తీ మస్తీ - మటన్ ఖీమ బగానీ రైస్ & గోంగూర మటన్, మ.2.30, సా.6.00: మంత్రా డిటర్జెంట్ సోప్ "చోటా షెఫ్" - టమాటో అటుకులు, మ.2.45, రా.10.30: కారాలు, పొడులు - ఉసిరి కారం & రాగి తీపి అట్టు పొడి, మ.3.30: భళా మిస్టర్ బ్రహ్మచారి - చికెన్ ఫ్రైడ్ రైస్.

## ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, అలంపురం, పశ్చిమ గోదావరి జిల్లా, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం,07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

## ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రి), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, గంగారం, వికారాబాద్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

## ఏ ఛానల్లో ఏముంది.. 04-01-2018

**ఉదయం:** 05-30 తిరుప్పావై - గోదాస్తుతి, 06-30 శుభోదయం + నిత్యపూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడ సేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకువేళాయె - దత్తాత్రేయస్వామి, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ శ్రీపద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 స్పెషల్ న్యూస్ + ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్రనామామృతం + లైవ్ డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం, **సాయంత్రం:** 04-30 యక్షప్రశ్నలు, 05-00 లైవ్ ఎస్.డి.సేవ + స్పెషల్ న్యూస్ + ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + ఖడ్గమాలస్తోత్రం, 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు నేను.. నా.. స్వామి, 08-30 మల్లికార్జున సుప్రభాతం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - రామేశ్వరలక్ష్మణేశ్వర దేవస్థానం, 09-30 శివమహాపురాణం - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 శ్రీరామ రసవాహిని - సాటులూరి గోపాల కృష్ణమాచార్యులు.

**ఉదయం:** 6-00 శ్రీసాయి హారతి, 6-30 సద్గురుస్తోత్రం, 7-00 అర్చన, 7-30 సాయి గీతామృతం, 8-00 పుణ్యక్షేత్రం, 8-30 జ్యోతి స్వరూపా అయ్యప్ప, 9-00 సంపూర్ణ మహాభారతం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 4-30 పుణ్యక్షేత్రం, 5-00 శ్రీకనకధారస్తోత్రం, 5-30 సాయిగీతామృతం, 6-00 సద్గురుస్తోత్రం, 7-00 భక్తివిశేషాలు,7-30 అమృతకలశం, 8-00 పరిహారం, 8-30 శ్రీమద్భగవద్గీత 9-00 దుర్గాసప్తశతి, 9-30 మహాభారత పాత్రలు, 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తివిశేషాలు, 11-00 గోదామృతం.

**ఉదయం:** 06-30 ఎంజాయ్ ఎవ్రిడే లైఫ్, 07-00 టెలిషాపింగ్, 07-30 శుభోదయం, 08-30 సినిమా: నాగవల్లి 11-30 వారెవా, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్ 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం (రిపీట్), 03-30 కల్యాణ వైభోగం (రిపీట్), **సాయంత్రం:** 04-00 బిగ్ సెలబ్రిటి చాలెంజ్ ఇంటర్‌నేషనల్, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 పున్నాగ, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్దమందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 ఎవరే నువ్వు మోహిని, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 నా కోడలు బంగారం (రిపీట్),11-00 బిగ్ సెలబ్రిటి ఛాలెంజ్ ఇంటర్‌నేషనల్ (రిపీట్).

**ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 హరహర మహాదేవ, 08-00 రాశి ఫలాలు దినఫలం, 08-30 జానకి రాముడు, 09-00 సినిమా: చంద్రలేఖ, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 అగ్నిసాక్షి (రిపీట్), 01-00 కుంకుమపువ్వు (రిపీట్), 01-30 చూపులు కలిసిన శుభవేళ, 02-00 కార్తీక దీపం, 02-30 సినిమా: యమదొంగ, **సాయంత్రం:** 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 అగ్నిసాక్షి, **రాత్రి:** 07-00 లక్ష్మీ కల్యాణం, 07-30 కార్తీకదీపం, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 సుందరకాండ, 09-30 పవిత్రబంధం, 10-00 నీలికలువలు, 10-30 దసరా వచ్చిందయ్య (రిపీట్).

**ఉదయం:** 06-00 టెలిషాపింగ్, 07-00 అమృతకలశం, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం (రిపీట్), 08-30 సినిమా: దేవుళ్లు, 11-30 నాగిని -2 (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 శిరిడి సాయి, 03-00 సినిమా: ఆ నలుగురు, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 జై జై వినాయక, 08-00 మాతృదేవోభవ, 08-30 శనీశ్వరుని దివ్యచరిత్ర, 09-00 నందిని, 09-30 బోల్ బేబీ బోల్ - సీజన్ 10, 10-30 సినిమా: ఆర్య.

**ఉదయం:** 06-00 స్టార్ ట్రెక్ 2: ది రాత్ ఆఫ్ ఖాన్, 07-56 ది కరాటే కిడ్ పార్ట్ 2, 09-59 బ్యాక్ టు ది ఫ్యూచర్ పార్ట్ 3, **మధ్యాహ్నం:**12-03 మ్యాన్ ఆఫ్ స్టీల్, 02-27 పుష్ ఇన్ బూట్స్, **సాయంత్రం:** 04-03 వే ఆఫ్ ది డ్రాగన్, 5-53 ది డిక్టేటర్ **రాత్రి:** 07-08 ది లాస్ట్ ఎయిర్‌బెండర్, 09-00 కుంగ్ ఫూ పాండా 2, 10-40 పాల్.

**అన్నదాతలో...** రేపు ఉదయం 6.30 గం.లకు

1. రబీ వరి పొలాల్లో ఎలుకల నిర్మూలన
2. వేరుశనగలో జిప్సం ఆవశ్యకత
3. పసుపు సాగులో ఇందూరు యువ రైతు ఆదర్శం

ఉచిత హెల్ప్‌లైన్ నెం.1800-425-4085కు ఉ.10-11 గం.ల మధ్య ఫోన్ చేయవచ్చు.




**జైకిసాన్‌లో...** నేటి సాయంత్రం 6.30 గంటలకు

1. గుర్రపుడెక్కతో సేంద్రియ ఎరువు ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఐఐసిటి
2. ఆటోమేటిక్ స్టార్టర్ల స్థానంలో 'కిసాన్‌రాజా' కొత్త పరికరం పనితీరుపై రైతుల హర్షం

జైకిసాన్ కార్యక్రమాన్ని www.youtube.com/etv2jaikisan ద్వారా కూడా వీక్షించవచ్చు.

# ఆరుతడి పైర్లలో సూక్ష్మనీటి పద్ధతులు



ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉంది. రబీ పంటల్లో నీటి యాజమాన్యం- పంటల పెరుగుదల, దిగుబడి, నాణ్యతలపై ప్రభావం చూపుతుందని వ్యవసాయాధికారి రవీందర్ తెలిపారు.

వ్యవసాయంలో నీటి వినియోగ సామర్థ్యం తక్కువగా ఉంది. వినియోగించే నీటిలో దాదాపు 60-70 శాతం వృథా అవుతోంది. దీని వల్ల సాగునీటి వృథా, భూసారం క్షీణించడం వంటి సమస్యలు వస్తున్నాయి. అధునాతన నీటి పారుదల విధానాలైన బిందు, తుంపర్ల సేద్య పద్ధతుల వల్ల దిగుబడి పెరగడమే గాకుండా, నీటి వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.

నీరు ఎక్కువగా లభ్యమయ్యే చోట ఆ నీటిని విచ్చలవిడిగా వాడటం వల్ల సారవంతమైన భూములెన్నో చౌడు భూములుగా మారి పంటల దిగుబడి క్రమేణా తగ్గుతున్నాయి. నేలలు కోతకు గురవుతున్నాయి. ఆశించిన దిగుబడులు సాధించాలంటే నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలి. నీటిని పెట్టిన మొదటి మూడు రోజులలో నేల లోపలి పొరలు నీటితో నిండిపోయి పొరలలో ఉన్న గాలి బయటికి వెళ్ళిపోతుంది. దీనివల్ల నేలలో సామర్థ్యం కంటే ఎక్కువ నీరు నిల్వ ఉంటుంది. మొక్కలకు కావల్సిన పోషకాలు భూమిలో ఉన్నా మొక్కలకు లభ్యం కావు. దీని వల్ల మొక్కల పెరుగుదల ఆగిపోతుంది. కానీ బిందు సేద్య పద్ధతిలో నీటిని ప్లాస్టిక్ గొట్టాలు, ఇతర పరికరాలతో బిందువుల రూపంలో అన్ని మొక్కలకు సమానంగా మొక్క వేరు భాగానికి కావల్సినంత అందించవచ్చు. ఈ విధానం ద్వారా భూమిలో ఎప్పుడు తేమ మాత్రమే ఉండేలా చేయవచ్చు.

★ మొక్కజొన్న జల్లు వేసేటప్పుడు, పాలు పోసుకునేటప్పుడు, గింజ గట్టిపడే సమయంలో నీరు చాలా అవసరం. వేసవిలో 7-10 రోజులకొకసారి నీటితడి ఇవ్వాలి.

★ వేరుశనగలో విత్తిన వెంటనే ఒకతడి, తరువాత 20-25 రోజులకు, ఆ తరువాత పూత, కాత దశలో ప్రతి 10-15 రోజులకు ఒక తడి ఇవ్వాలి.

★ పొద్దుతిరుగుడు పువ్వులో ఆశించిన దిగుబడులు సాధించాలంటే మొగ్గతొడిగే దశ, పువ్వు వికసించే దశ, గింజ కట్టే దశలలో నీటితడి అవసరం.

★ నువ్వు పంటకు పూత, కాయ పెరుగుదల, గింజకట్టు దశల్లో తడులు తప్పక ఇవ్వాలి.

★ శనగ పంటలో విత్తిన 20-25 రోజులలో తడి ఇవ్వాలి. శనగ పంట ఎక్కువ నీటిని తట్టుకోదు. అవసరాన్ని బట్టి నీటి తడులు అందించాలి.

★ కుసుమ పంటకు తేమ ఉన్న బలమైన నేలల్లో సకాలంలో వేసిన పంటకు నీరు ఇవ్వాల్సిన అవసరం లేదు. తేలిక నేలలకు, ఆలస్యంగా విత్తిన పంటకు ఒకటి, రెండుసార్లు తడులు ఇవ్వాలి. పూత మొదలైన తరువాత నీరు పెట్టవద్దు.

– న్యూస్‌టుడే, జైనథ్ (ఆదిలాబాద్ వ్యవసాయం)

## పాడి పరిశ్రమలో పాకల ప్రాధాన్యం


పాడి పశువులను విధిగా పాకల్లో ఉంచి పోషించడాన్ని ప్రతి రైతు కర్తవ్యంగా భావించాలి. వాతావరణ ప్రభావాల నుండి పశువులను కాపాడే పాకలను ఒక వరుసలో కానీ, రెండు వరుసల్లో కానీ కట్టేసేలా నిర్మించుకోవచ్చు. ఈ పాకల నిర్మాణానికి ప్రభుత్వం- ఉపాధి హామి పథకం ద్వారా తోడ్పాటునిస్తోంది. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా పాకలను గడ్డితో గానీ, షెడ్ రేకులతో గానీ కప్పి నిర్మించుకోవచ్చు. పాకల్లో దాణా, పశుగ్రాసం తినేందుకు 'మేంజర్', పశువుల నుండి వెలువడే మూత్రం, పేడ వెళ్లడానికి కాలువలు నిర్మించాలి. పాకల్లో నేల జరుడుగా కాక, కాస్త గరుకుగా ఉండాలి. పాడి పశువులు కూర్చున్నప్పుడు, శరీర బరువులో సగానికిపైగా వాటి మోకాళ్ళపై పడుతుంది కాబట్టి ప్రస్తుతం మార్కెట్లో లభించే రబ్బర్ మ్యాట్లను పరచడం మంచిది.

తక్కువ ధరలో పాకల నిర్మాణం చేపట్టాలి. నిర్ణీత కాల వ్యవధిలో సున్నం వేయించాలి. పశువుల మలమూత్రాలు నీటితో జారిపోయేలా వాలు ఉండేలా పాకలు నిర్మించాలి. ఒకే వరుస కానీ, రెండు వరుసలు కానీ పశువులను కట్టి మేపడం, పాలు పిండటం వల్ల పశువులు వాతావరణ తీవ్రతకు గురికావు. వ్యాధుల నివారణ కూడా సులభం అవుతుంది.

షెడ్‌లు కట్టే రైతులను ప్రోత్సహించేలా షెడ్‌లకు బీమా సౌకర్యం కల్పించేందుకు రైతులను ప్రోత్సహించాలి. షెడ్‌కు దగ్గరలోనే నీటి సౌకర్యం ఉండాలి. షెడ్‌నుండి వచ్చే పశువుల మూత్రం, పేడ, దగ్గరలోని పశుగ్రాస క్షేత్రాలకు మళ్ళించాలి. దీనిద్వారా పశుగ్రాసాలకు సహజంగా ఎరువు లభిస్తుంది. ఒకటి, రెండు పశువులున్నా పాక నిర్మాణం చేపట్టాలి. అగ్ని ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు కల్పించాలి. పాకల వల్ల చలి, ఎండబారి నుండి పశువులకు రక్షణ లభిస్తుంది. పశువుల ఆరోగ్యం మెరుగ్గా ఉండి, పాల దిగుబడి పెరుగుతుంది.

– మధుసూదనరావు, విజయ డెయిరీ, ఆదిలాబాద్

# అడవుల సంరక్షణకు కృషి చేయాలి: డీఎఫ్‌వో



శిక్షణ అభ్యర్థులకు సూచనలు ఇస్తున్న జిల్లా అటవీశాఖ అధికారి పి.సునిల్ హెరిమాత్

**ఖమ్మంవ్యవసాయం, న్యూస్‌టుడే:** అడవుల సంరక్షణకు ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలని జిల్లా అటవీశాఖ అధికారి డాక్టర్.పి.సునిల్ హెరిమాత్ అన్నారు. హైదరాబాద్‌లోని దూలపల్లి ఫారెస్టు ఆకాడమీలో శిక్షణ పొందుతున్న 40 మందికి బుధవారం ఖమ్మం వెలుగుమట్ల పార్కులో క్షేత్రస్థాయి ప్రదర్శన ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ రకాల అడవులు, వాటిలో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించేందుకు పర్యటనలో భాగంగా ఈకార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సునిల్ హెరిమాత్ శిక్షణ అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ వెలుగుమట్ల పార్కులో జరిగిన, జరుగుతున్న పనులను వివరించారు. నర్సరీల్లో మొక్కలు పెంచే విధానం, వెంకటాయపాలెం నుంచి కొదుమూరు వరకు రోడ్డుకిరువైపులా మొక్కలు పెంచే విధానం గురించి కూడా తెలిపారు. ఈకార్యక్రమంలో డివిజన్ అటవీశాఖ అధికారి సీహెచ్ ప్రకాశరావు, క్షేత్రాధికారి ప్రసాదరావు, శిక్షణ బృందానికి సారధ్యంవహించిన క్షేత్రాధికారి నాగమణి, సెక్షన్ అధికారులు వేణుమాధవ్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలపై భారం మోపుతున్న ప్రభుత్వం




సమావేశంలో మాట్లాడుతున్న పువ్వాడ నాగేశ్వరరావు

**ఖమ్మం గట్టయ్యసెంటర్, న్యూస్‌టుడే:** నోట్ల రద్దు, జీఎస్‌టీలు ప్రజావ్యతిరేక చర్యలని, మోదీ ప్రభుత్వం ప్రజలపై భారం మోపుతుందని సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ శాసనసభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు అన్నారు. నగరంలోని గిరిప్రసాద్‌భవన్‌లో దండు ఆదినారాయణ అధ్యక్షతన బుధవారం జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాల వల్ల అమెరికాలో ఉంటున్న భారతీయ ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మతోన్మాద భాజపా క్రమంగా ప్రజాదరణ కోల్పోతుందని, గుజరాత్ ఎన్నికల్లో చావు తప్పి కన్నులొట్టబోయిన చందంగా గెలిచిందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రజాకర్ష విధానాలతో అధికారంలోకి వచ్చి వాగ్ధానాలు అమలు చేయడం లేదన్నారు. కులాలు, గిరిజన తెగల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. సీపీఐ రాష్ట్ర నాయకులు టి.వి.చౌదరి మాట్లాడతుతూ కేంద్ర, రాష్ట్ర పాలకులు ప్రజలను మభ్య పెడుతూ పబ్బం గడుపుకుంటున్నారని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఖమ్మం గ్రామీణ మండలం ఏదులాపురంలో జరిగే సీపీఐ ఖమ్మం జిల్లా 21వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బాగం హేమంతరావు, మహ్మద్‌మౌలానా, పోటు ప్రసాద్, జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగునర్సింహారావు, దండి సురేష్, యర్రాబాబు, ఎస్‌కె.జానిమియా, సీహెచ్.సీతామహాలక్ష్మి, ఏపూరి లతాదేవి తదితరులు పాల్గొన్నారు.

## మహిళపై దాడి

**ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే:** మద్యం మత్తులో మహిళపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన వ్యక్తిపై ఖమ్మం మూడోపట్టణ పోలీసు స్టేషన్‌లో బుధవారం కేసు నమోదు అయ్యింది. ఏఎస్సై హవీద్ అలీ కథనం ప్రకారం.. బొక్కలగడ్డలో నివసించే చిక్కుడు సాయి మంగళవారం రాత్రి పక్కనే నివసించే రమణమ్మ అనే మహిళతో ఘర్షణ పడ్డాడు. మద్యం మత్తులో ఆమెపై దాడి చేసి చేయి విరగ్గొట్టాడు. సంఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్సై వివరించారు.

## ఆటోమేటిక్ స్టార్టర్లు తొలగించాలని అవగాహన



రామన్నపేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో

**ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే:** వ్యవసాయ విద్యుత్తు మోటార్లకు ఆటోమేటిక్ స్టార్టర్లను తక్షణమే తొలగించాలని రైతులకు అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు సరఫరా అందిస్తున్న నేపథ్యంలో ఖమ్మం నగరం 50వ డివిజను రామన్నపేటలో రైతులకు బుధవారం ఆటోమేటిక్ స్టార్టర్ల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఈవో శిరిణ్మయి మాట్లాడారు. కరెంటు కోతల సమయంలో ఆటోమేటిక్ స్టార్టర్లను వినియోగించారని, ఇప్పుడు 24 గంటల విద్యుత్తు కారణంగా వాటి అవసరం లేదన్నారు. డివిజను కార్పొరేటరు పీట్ల సక్కుబాయి, రై.స.స. సభ్యులు బంధు సూర్యం, ఉపేందర్, నరేష్, రామమూర్తి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## శాంతి సామరస్యాల బాధ్యత మనదే

**ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** దేశంలో శాంతి, సామరస్యాలను నెలకొల్పాల్సిన బాధ్యత అందరిపై ఉందని, అందుకోసం నిత్యం భగవంతుడి ధ్యానం చేయాల్సిన అవసరం ఉందని ప్రముఖ ప్రసంగీకులు థామస్ అన్నారు. నగరంలోని పెవిలియన్ మైదానంలో గత రెండురోజులుగా నిర్వహిస్తున్న గెత్సెమనీ దహించు అగ్ని స్వస్థత వాగ్ధాన మహాసభల్లో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సభల్లో కన్వీనర్ డి.యిర్మియా, రాజేష్, ఏసుమణి, విజయ్‌కుమార్, పౌలు, ఆశీర్వాదం, రవికుమార్, జోసఫ్, దానియేలు తిమితీ, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.



వాగ్దాన మహాసభల్లో పాల్గొని ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

# సైబీరియా కొంగలను తిలకించిన అధికారులు

## అటవీశాఖ సెక్షన్ అధికారుల విజ్ఞాన యాత్ర



సైబీరియా కొంగలను చూస్తున్న శిక్షణ అధికారులు

**ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే:** హైదరాబాద్ దూలపల్లిలోని తెలంగాణ ఫారెస్టు అకాడమీలో శిక్షణ పొందుతున్న 18వ బ్యాచ్ అటవీశాఖ సెక్షన్ అధికారులు విజ్ఞాన యాత్రలో భాగంగా బుధవారం ఖమ్మం గ్రామీణ మండలం చింతపల్లికి వచ్చారు. సైబీరియా కొంగలను తిలకించేందుకు వారు వచ్చారు. కొంగలను చూసి వాటిని తమ ఛాయాగ్రాహకాల్లో బంధించారు. కొంగల విషయమై గ్రామస్థులతో మాట్లాడారు. కొంగల చరిత్ర గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి సైబీరియా కొంగలకు ఉన్న అనుబంధం గురించి గ్రామపెద్దలు అటవీశాఖ సిబ్బందికి వివరించారు. సర్పంచి తోట జగన్ అటవీశాఖ అధికారులకు గ్రామం మొత్తాన్ని చూపించారు. కొంగల చరిత్ర గురించి వృద్ధులతో మాట్లాడించారు. కొంగల రక్షణకు తాము తీసుకుంటున్న చర్యల గురించి సర్పంచి వివరించారు. వలస వచ్చిన పక్షులను తమ బిడ్డల మాదిరిగా చూసుకుంటున్న గ్రామస్థులను అటవీశాఖ అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు కవితా మాధురి, రవికుమార్, సర్పంచి జగన్, శిక్షణ అధికారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

***చింతపల్లిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం: సీహెచ్ ప్రకాశ్‌రావు, ఎఫ్‌డీవో***

ప్రతి ఏడాది డిసెంబరులో చింతపల్లికి సైబీరియా కొంగలు వచ్చి జూన్ చివర్లో వెళ్తుంటాయి. ఆ కొంగలను చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. కొంగల రక్షణకు, పర్యాటలకు సౌకర్యాలు కల్పించేందుకు చింతపల్లి గ్రామాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం. కొంగల కోసం ఇటీవల కొన్ని చింతచెట్లను నాటాం. గ్రామంలో చింతచెట్లను పెంచుతున్న ప్రజలకు బహుమతులు అందజేస్తాం. చరిత్రను తెలిపే విధంగా గ్రామంలో బోర్డులు ఏర్పాటు చేస్తాం. దాహం తీర్చుకునేందుకు బోర్లు వేస్తాం. పక్షులకు ఆహారం కోసం ప్రత్యేకంగా చేపపిల్లల పెంపకం కూడా చేపడతాం.

# భాజపా దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీమాస్ రెండో పట్టణ కమిటీ నాయకులు

**ఖమ్మంమయూరిసెంటర్, న్యూస్‌టుడే:** భాజపా పాలిత రాష్ట్రాల్లో దళితులపై దాడులను నిరసిస్తూ టీమాస్ ఖమ్మం రెండో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మతోన్మాద, భాజపా దిష్టిబొమ్మను నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా టీమాస్ రాష్ట్ర బాధ్యురాలు బుగ్గవీటి సరళ మాట్లాడుతూ మహారాష్ట్రలోని పుణెలో దళితులపై భాజపా నాయకులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీమాస్ నాయకులు వినయ్‌కుమార్, భారతి, వై.విక్రమ్,నెహ్రూ, రమేష్, శోభ, వెంకట్‌కుమార్, రాము, గురుమూర్తి, ఇందిర, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

**మయూరిసెంటర్, న్యూస్‌టుడే:** దళితుల అణిచివేతనే లక్ష్యంగా చేసుకొని ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాద శక్తులు పనిచేస్తున్నాయని టీమాస్ జిల్లా కన్వీనర్ యర్రా శ్రీకాంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీమాస్ మూడవ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గ్రెయిన్ మార్కెట్ సెంటర్‌లో మతోన్మాద, ఆర్‌ఎస్‌ఎస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలోని పుణెలో దళితులపై ఆర్‌ఎస్‌ఎస్, భాజపా శక్తులు దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని అన్నారు. మతోన్మాద శక్తుల దాడులను ప్రజలు సమర్థంగా తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో టీమాస్ నాయకులు వేల్పుల నాగేశ్వరరావు, యర్రా శ్రీనివాసరావు, బాబు, సత్యం, వీరబాబు, నాగసులోచన, శ్రీనివాస్, సత్యనారాయణ,ఖాసీం, ఉపేంద్రాచారి పాల్గొన్నారు.

# అసత్యాలు వల్లెవేస్తున్న ప్రతిపక్షాలు: తెరాస



తెరాస కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

**ఖమ్మం బుర్హాన్‌పురం, న్యూస్‌టుడే:** రైతుల కోసం 24గంటల ఉచిత విద్యుత్ తెరాస ప్రభుత్వం అమలు చేస్తున్న విషయాన్ని తెదేపా, కాంగ్రెస్‌పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయని, ఏమి చేయాలో పాలుపోక అసత్యాలు చెబుతూ ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నాయని తెరాస నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, మందడపు సుధాకర్, బీరెడ్డి నాగచంద్రారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా తెరాస కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్నాయన్న విషయాన్ని గుర్తించి ఇతర రాష్ట్రాల మంత్రులు, ప్రజాప్రతినిధులు, మీడియా అభినందిస్తుంటే వాటిని పట్టించుకోకుండా కేవలం తమ ఉనికిని కాపాడుకునేందుకు చేస్తున్న యత్నాలను వారు విరమించుకోవాలని సూచించారు. ఇదే విధంగా మాట్లాడితే కాంగ్రెస్ నాయకులను రైతులు ఊళ్లలోకి రానివ్వరన్న విషయాన్ని గుర్తించాలన్నారు. తెలంగాణ రైతుల మోముల్లో ఆనందాన్ని చూడడంతో పాటు రైతునే రాజును చేద్దమన్న లక్ష్యంతో కేసీఆర్ పనిచేస్తున్నారని వారు వెల్లడించారు. సమావేశంలో తెరాస నాయకులు రాంబాబు, తిరుమలరావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

**ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే:** ఖమ్మం ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచిన నాలుగు అనాథ మృతదేహాలకు అన్నం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు, సేవా సభ్యులు రాంబాబు, ముస్తఫా, చారి, వీరభద్రం, రామారావు, హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారావు, కూరాకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అంత్యక్రియలకు సిద్ధం చేస్తున్న అన్నం సేవా బృందం

JUNIOR INTER

Chemistry

One can expect 3 to 5 VSAQs from these 4 lessons in inter exams and 5 questions in competitive exams. Inorder to cover all the basics, one must go through all Chapter and VSAQs along with solved problems. List out all important formulas at one place and be perfect with logarithams & square root based calculations for excellent score.

ప్రతిభ

# What is critical temperature?

## States of Matter, Stoichiometry, Thermodynamics, Chemical Equilibrium and Acids - Bases

### 2 Marks Questions

**Q:** Calculate Kinetic energy (in SI units) of 4 g of methane at –73°C.

**A:** $K.E = \frac{3}{2}\, nTR$

$= \frac{3}{2} \times \frac{4}{16} \times (-73 + 273) \times 8.314$

$= 1.5 \times 0.25 \times 200 \times 8.314$

$= 623.6$ J

**Q:** Calculate Kinetic energy of 5 moles of $N_2$ at 27°C.

**A:** $K.E. = \frac{3}{2} nTR = \frac{3}{2} \times 5 \times (27 + 273) \times 8.314$

$= 1.5 \times 5 \times 300 \times 8.314 = 18706.5$ J

**Q:** Which of the gases diffuses faster among $N_2$, $O_2$ and $CH_4$? Why?

**A:** At constant P & T, the rate of diffusion of a gas is inversely proportional to its molecular mass. $CH_4$ diffuses faster as it has least molecular mass (16 g/ mole).

**Q:** Calculate RMS speed, most probable speed of $CO_2$ gas at 27°C.

**A:** $U_{rms} = \sqrt{\frac{3RT}{M}}$

$= \sqrt{\frac{3 \times 8.314 \times (27 + 273)}{\frac{44}{1000}}}$

$= 4.42 \times 10^2$ m/sec

$U_{mp} = 0.8166 \times U_{rms} = 0.8166 \times 4.42 \times 10^2$

$= 3.36 \times 10^2$ m/sec

**Q:** State Dalton's law of partial pressures.

**A:** At constant temperature and volume, the total Pressure exerted by the mixture of non reactive gases is equal to sum of partial pressures of component gases ($P_1$, $P_2$)

$P_{total} = P_1 + P_2$

**Q:** What are standard ambient temperature and pressure (S.A.T.P) conditions?

**A:** 298.15 K temperature & 1 bar Pressure.

**Q:** Give the ratio of most probable (M.P), Average (AV) and R.M.S speeds of gas molecules.

**A:** $U_{M.P} : U_{AV} : U_{R.M.S}$

$= \sqrt{\frac{2RT}{M}} : \sqrt{\frac{8RT}{M}} : \sqrt{\frac{3RT}{M}}$

$= 1.000 : 1.128 : 1.224$

**Q:** What is critical temperature? Give its value for $CO_2$.

**A:** The temperature above which any gas can not be liquified by applying any pressure.

$T_C$ of $CO_2 = 30.98$°C

**Q:** What is Surface tension? Give its units in SI System.

**A:** The downward force acting per unit length perpendicular to the line drawn on the surface of liquid. Units : $Nm^{-1}$

**Q:** What is coefficient of viscosity? Give its units in SI system.

**A:** The Force, when velocity gradient $\left(\frac{du}{dz}\right)$ is unity and the area of contact is unit area (A). Units: NS $m^{-2}$

$F = n.A. \frac{du}{dz}$

**Q:** What is "Compressibility factor"?

**A:** The ratio of actual molar volume of gas to molar volume of an ideal gas. For ideal gas

$Z = 1. \qquad Z = \frac{PV}{nTR}$

**Q:** What is "Boyle's temperature"?

**A:** The temperature at which a real gas obeys ideal gas equation over appreciable range of pressure.

**Q:** Give Vander Waals equation of state.

**A:** $\left(P + a\frac{n^2}{v^2}\right)(V - nb) = nTR$

a, b = Vander Waals constants

n = no. of moles, P = pressure, V = Volume,

T = absolute temp., R = Universal gas constant

**Q:** What is "disproportionation reaction"? Give 1 example.

**A:** The redox reaction in which an element undergoes oxidation as well as reduction.

$2\,H_2O_2 \rightarrow 2\,H_2O + O_2$

**Q:** State the "Law of multiple proportions".

**A:** When 2 elements combine to form 2 or more compounds, then the mass of one element that combines with a fixed mass of other element in the ratio of whole number.

eg. CO & $CO_2$

**Q:** Give 2 redox reactions related to environment.

**A:** ★ Use of liquid $H_2$ as fuel

★ Development of OZONE hole by CFCs.

**Q:** What do you mean by "Significant figures"?

**A:** Meaningful digits which are known with certainity. Eg: 4.007 has 4 significant figures.

**Q:** Calculate the no. of moles present in

a) 540 g. of glucose b) 200 g. of $CaCO_3$

**A:** (a) $n_{glucose} = \frac{mass}{g.m.mass} = \frac{540}{180} = 3$ moles

(b) $n_{CaCO_3} = \frac{mass}{g.m.mass} = \frac{200}{100} = 2$ moles

**Q:** The empirical formula (E.F.) of a compound is $CH_2O$. Its molecular weight is 90. Calculate the molecular formula of the compound.

**A:** E.F. = $CH_2O$

E.F.Wt. = 12 + 2(1) + 16 = 30

$n = \frac{M.F.Wt.}{E.F.Wt.} = \frac{90}{30} = 3$

M.F. = $(E.F.)_n = (CH_2O)_3 = C_3H_6O_3$

**Q:** Assign oxidation number of underlined elements

a) $\underline{Cr}_2O_7^{-2}$ b) $Ca\underline{O_2}$ C) $\underline{O}F_2$ d) $K_2\underline{Mn}O_4$

**A:** a) $\underline{Cr}_2O_7^{-2}$

2x + 7 (–2) = –2

∴ x = 6

b) $Ca\underline{O_2}$

+ 2 + 2x = 0

∴ x = –1

(c) $\underline{O}F_2$

x + 2 (–1) = 0

x = +2

d) $K_2\underline{Mn}O_4$

2 (+1) + x

+ 4 (–2 ) = 0

∴ x = +6

**Q:** Calculate normality of $H_2SO_4$ solution if 50 ml of it completely neutralises 250 ml of 0.1 N $Ba(OH)_2$ solutions.

**A:** $V_1N_1 = V_2\,N_2$

$N_1 = \frac{V_2\,N_2}{V_1} = \frac{250 \times 0.1}{50}$

= 0.5 N





**Q:** Calculate the volume of 0.1 M $KMnO_4$ required to react with 100 ml of $H_2C_2O_4.2H_2O$ solution in presence of $H_2SO_4$?

**A:** 2 Moles of $KMnO_4$

= 5 Moles of $H_2C_2O_4.2H_2O$

$\frac{V_1M_1}{n_1} = \frac{V_2M_2}{n_2}$

$V_1 = \frac{V_2M_2n_1}{n_2M_1} = \frac{100 \times 0.1 \times 2}{5 \times 0.1} = 40$ ml

**Q:** What is the sign conversion of a) work done on the system and b) work done by the system?

**A:** a) work done on the system = +Ve

b) work done by the system = –Ve

**Q:** What are "intensive" and "extensive" properties?

**A:** **Intensive property:** The property of a system which depends upon the total amount of the material. eg: Mass, Volume

**Extensive property:** The property of a system which doesn't depend upon the total amount of material. eg: Density, Viscosity

**Q:** The equilibrium constant for a reaction is 10. (T = 300 K). What will be the value of Δ G°?

**A:** $\Delta G° = -2.303\, RTlog\, K_c$

$= -2.303 \times 8.314 \times 300 \times \log 10$

$= -2.303 \times 8.314 \times 300 \times 1 = -5.744$ K.J

**Q:** State 3rd law of thermodynamics.

**A:** The entropy of a pure and perfect crystal is zero at absolute zero temperature.

$\lim_{T \to 0} S = 0$

**Q:** Define "Enthalpy".

**A:** The total heat content of a system at constant pressure & temperature.

**Q:** Define "Entropy", "Standard molar entropy".

**A:** **Entropy:** The degree of disorderness of molecules of the system.

**Standard molar entropy:** The entropy of 1 mole of a substance at 1 atom pressure & 25°C.

**Q:** What is "Gibbs energy"?

**A:** The amount of energy available from a system which can be converted to useful work at constant Pressure & Temperature.

**Q:** Enthalpies of formation of CO, $CO_2$, $N_2O$ and $N_2O_4$ are –110, –393, 81 and 9.7 K.J $mol^{-1}$ respectively. Find the value of $\Delta_rH$ for the reaction $N_2O_4 + 3CO \rightarrow N_2O + 3\,CO_2$.

**A:** $\Delta_rH = H_{products} - H_{reactants}$

$= [3\,H_{CO_2} + H_{N_2O}] - [H_{N_2O_4} + 3H_{CO}]$

$= [3 \times (-393) + 81] - [9.7 + 3(-110)]$

$= -778$ K.J

**Q:** What is "homogeneous equilibrium"?

**A:** The equilibrium in which all the reactants and the products are present in same phase

$N_2\,(g) + 3\,H_2\,(g) \rightleftharpoons 2\,NH_3\,(g)$



Writer:

ANS Sankara Rao

Subject Expert

**Q:** What is "heterogeneous equilibrium"?

**A:** The equilibrium in which reactants & products are present in different phase.

$CaCO_3\,(s) \rightleftharpoons CaO\,(s) + CO_2\,(g)$

**Q:** What is meant by "dynamic equilibrium"?

**A:** The reversible reaction in which the rate of forward reaction is equal to the rate of backward reaction and both are taking place even at equilibrium state.

**Q:** Calculate pH of 0.1825% HC*l* aqueous solution.

**A:** $[H^+] = N = \frac{0.1825}{37.5} \times \frac{1000}{100} = 5 \times 10^{-2}$

pH = –log [H+]

$pH = -\log\,[5 \times 10^{-2}] = -[\log 5 + \log 10^{-2}]$

$= -[0.6990 - 2] = 1.3010$

**Q:** Calculate pH of $10^{-8}$ M NaOH.

**A:** $[OH^-] = [OH^-]_{NaOH} + [OH^-]_{H_2O}$

$= 10^{-8} + 10^{-7} = 10^{-7}\,(10^{-1} + 1)$

$= 1.1 \times 10^{-7}$

$pOH = -\log[OH^-] = -\log[1.1 \times 10^{-7}] = 6.96$

∴ pH = 14 – pOH= 14 – 6.96 = 7.04

**Q:** Calculate pH of 0.05 M $Ba(OH)_2$ solution.

**A:** $[OH^-] = N = 2 \times 0.05 = 0.1 = 10^{-1}$

$pOH = -\log[OH^-] = -\log[10^{-1}] = -(-1) = 1$

pH = 14 – pOH = 14 – 1 = 13

**Q:** Define pH.

**A:** Negative logarithm of $H^+$ ion concentration

pH = –log [H+]

**Q:** What is "Solubility Product"?

**A:** The product of concentration of Cations & Anions present in saturated salt solution.

**Units:** $(moles/lit)^n$

**Q:** 50 ml of $NH_4OH$ & 25 ml of 2M $NH_4Cl$ were mixed to make a buffer. What is its pH if its $Pk_b$ is 4.8

**A:** $pOH = pk_b + \log \frac{M_sV_s}{M_bV_b}$

$= 4.8 + \log \frac{2 \times 25}{0.1 \times 50} = 4.8 + 1 = 5.8$

∴ pH = 14 – pOH

= 14 – 5.8 = 8.2

**Q:** All the bronsted bases are Lewis bases. Explain.

**A:** Bronsted base is proton acceptor.

$NH_3 + H^+ \rightarrow NH_4^+$. Lewis base is electron pair donor. Where $NH_3$ can accept a proton ($H^+$) and donates lone pair of electrons to $H^+$ ion. So $NH_3$ is Bronsted base as well as Lewis base.

**Q:** Classify the following solutions of salts into acidic and basic A*l*$C_{l_3}$, $Na_2CO_3$, $CuSO_4$, $CH_3COONa$.

**A:** **Acidic:** $CuSO_4$ & A*lCl*$_3$

**Basic:** $CH_3COONa$ & $Na_2CO_3$

**Q:** What are 'London Forces'?

**A:** Forces of attraction between 2 temporary dipoles. Eg: n-pentane.

Send your feedback to...

pratibhadesk@eenadu.net




**ప్రపంచ వాణిజ్య సంస్థ అంతర్జాతీయ వాణిజ్యాన్ని నియంత్రించడానికి ఏర్పాటైంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ ఆర్థిక సంస్థ. భాగస్వామ్య దేశాల మధ్య జరిగే వస్తువులు, సేవలు, మేధోసంపత్తి హక్కుల వాణిజ్యాన్ని నియంత్రించడం, వాణిజ్య సంబంధాలను సమర్థంగా నిర్వహించేందుకు అనువైన కార్యాచరణను రూపొందించడం, వివాదాలను పరిష్కరించడం దీని ప్రధాన బాధ్యతలు. తాజాగా జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) 11వ మంత్రుల స్థాయి సదస్సు ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు ఏ పరిష్కారం చూపకుండానే ముగిసింది.**

ప్రతిభ

# ఆహారానికి ఏదీ భద్రత...?

## జనరల్ స్టడీస్

### డబ్ల్యూటీవో మంత్రుల స్థాయి సదస్సు - 2017

ప్రపంచ వాణిజ్య సంస్థ 11 వ మంత్రులు స్థాయి సదస్సు అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో డిసెంబరు 10 నుంచి 13 వరకు నాలుగురోజుల పాటు జరిగింది. ఈ సదస్సులో 164 సభ్య దేశాలు పాల్గొన్నాయి. సేవా వాణిజ్యాన్ని సులభతరం చేయడం, ఈ-కామర్స్ సేవలు, మార్కెట్ సౌలభ్యం, దేశీయ నియంత్రణలు, ఆహారభద్రత, వాణిజ్యం - మహిళా సాధికారిత తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సమావేశాల్లో ఆహారధాన్యాల నిల్వ, రాయితీల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశించినా ఎలాంటి పరిష్కారం చూపకుండానే చర్చలు ముగిశాయి. బహుళైచ్ఛిక వాణిజ్య విధానాల విషయంలోనూ ఎలాంటి పురోగతి లేదు. అయితే మత్స్య సంపదపై రాయితీల నిషేధం విషయంలో సభ్యదేశాలకు ఉన్న నిబద్ధతపై 2019 కల్లా పరిష్కారాన్ని చూపుతామనే భరోసా ఇచ్చేందుకు మంత్రుల స్థాయి సమావేశం ప్రయత్నించింది.

- భారత్, చైనా సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎలాంటి కఠినతర నిబంధనలు లేకుండా తమ తమ దేశాల్లో ఆహారభద్రతా కార్యక్రమాలను అమలు చేసేందుకు అమెరికా మోకాలడ్డింది. దీంతో చర్చలు విఫలమయ్యాయి. ప్రధాన విషయాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో ప్రపంచ వాణిజ్య సంస్థలోని భాగస్వామ్య దేశాలన్నీ మూకుమ్మడిగా ఏకాభిప్రాయానికి రావాల్సి ఉంటుంది. కాబట్టి ఏ ఒక్క దేశమైనా కావాలనుకుంటే ప్రక్రియను ముందుకు సాగనీయకుండా చేయొచ్చు.
- 2001 లో ప్రపంచ వాణిజ్య సంస్థ ఆవిర్భావం నుంచి నేటి వరకు ఎన్నో అపరిష్కృత సమస్యలకు పరిష్కారాలను ప్రతిపాదించకుండానే 'కొత్త అజెండా'ను తెరమీదకు తెచ్చేందుకు యూరోపియన్ సమాఖ్య (ఈయూ) దేశాలు పావులు కదుపుతున్నాయి. ఆహారభద్రత సాధనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులపై 2001 లో దోహాలో జరిగిన చర్చలు ఎటూ తేలకుండా ముగిశాయి. నాటి నుంచి నేటి వరకు ఆహారభద్రత హక్కుల విషయమై ఇతమిద్ధంగా తేలిందేమీ లేదు. సమావేశం అనంతరం వెలువరించాల్సిన మంత్రుల ప్రకటన కూడా రద్దయ్యింది. దీంతో భారత్ సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్ర నిరాశకు గురయ్యాయి.
- సభ్య దేశాలు నిరాశకు గురవడం కొంత కటువైందైనప్పటికీ అవి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డబ్ల్యూటీఓ డైరెక్టర్ జనరల్ రాబెర్టో అజ్వేడో వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ సమావేశాలకు భారత్ తరపున కేంద్రమంత్రి సురేశ్ ప్రభు హాజరయ్యారు. ఒక సభ్య దేశం వైఖరి కారణంగా ఎలాంటి నిర్ణయాలు లేకుండానే సమావేశాలు ముగిశాయని భారత్ ప్రకటించింది.

### భద్రతలేని ఆహార హక్కు

ప్రపంచ వాణిజ్య సంస్థ మంత్రులు స్థాయి సమావేశంలో అమెరికా వ్యతిరేకత చూపినా భారత్ మాత్రం ఆహార భద్రత హక్కు విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాల పక్షాన గట్టిగానే వాదించింది. గత దశాబ్ద కాలంగా తమ దేశాల్లోని వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరలను చెల్లిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు ఇదే విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మాత్రం మోకాలడ్డుతున్నాయి.

- సంపన్న దేశాలకు అనుకూలంగా రూపొందించుకున్న డబ్ల్యూటీఓ నిబంధనలను సవరించాలని భారత్, చైనా ప్రతిఘటించినా అడుగు ముందుకు పడలేదు. ఆది నుంచి భారత్ ఈ దిశగా పట్టిన పట్టు విడవకుండా కృషి చేస్తోంది. సన్న, చిన్నకారు, అల్పాదాయవర్గ రైతుల నుంచి సరైన మద్దతు ధరకు ధాన్యాన్ని సేకరించి, తిరిగి దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే యంత్రాంగాన్ని మెరుగుపరిచి, పటిష్టవంతం చేసే దిశగా భారత్ సుదీర్ఘ కసరత్తు చేస్తోంది.
- డబ్ల్యూటీఓ నిబంధనల ప్రకారం రైతుల నుంచి సేకరించే వ్యవసాయ ఉత్పత్తులకు, ఆహార రాయితీల కింద ఇచ్చే మొత్తం సొమ్ము, ఆ దేశ మొత్తం ఆహార ఉత్పత్తుల విలువలో (1986-88 నాటి ధరల ప్రకారం) 10 శాతానికి మించకూడదు. ఒకవేళ అభివృద్ధి చెందుతున్న దేశాలు రైతులకు అంతకు మించి చెల్లించినట్లయితే దాన్ని వాణిజ్య నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తారు. ఇలాంటి పరిమితులు తాము అమలు చేస్తున్న 'ఆహారభద్రత' కార్యక్రమానికి విఘాతం కలిగిస్తాయంటూ భారత్ తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. 2013 లో బాలిలో జరిగిన సమావేశంలో కూడా దీనిపై చర్చించారు. అప్పట్లో ఈ విషయమై ఒక అంగీకారానికి వచ్చి 'శాంతి నిబంధన' ప్రతిపాదించారు. ఇది ఒకరకంగా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు రక్షణ కవచం లాంటిది. దీని ప్రకారం ఏ దేశమైనా ఈ 10 శాతానికి మించి చెల్లించరాదనే నిబంధనను ఉల్లంఘిస్తే దాన్ని డబ్ల్యూటీఓలో సవాలు/ ఫిర్యాదు చేయకూడదనేది ప్రధాన సారాంశం. ఈ శాంతి నిబంధన ఉన్నా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల సార్వభౌమ హక్కులను కాలరాసి, రైతులకు ఆహార రాయితీలు ఇవ్వకుండా, కనీస మద్దతు ధర చెల్లించకుండా సంపన్న రాజ్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. కాబట్టే భారత్ ఈ బ్యూనస్ ఎయిర్స్ సమావేశంలో 'శాంతి నిబంధన' లోని అంశాలను మరింత మెరుగుపరచి, ఆహార భద్రత సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని కనుక్కునేలా దీన్ని తీర్చిదిద్దాలని డిమాండ్ చేసింది. తృతీయ ప్రపంచ దేశాలు సైతం ఈ విషయంలో భారత్‌లో గొంతు కలిపాయి.
- నిజానికి అమెరికా, యూరోపియన్ దేశాలు ఉమ్మడిగా తమ రైతులకు ఏటా 16 వేల కోట్ల డాలర్లకు పైగా భారీ రాయితీలు ఇస్తున్నాయి. స్థూలదేశీయోత్పత్తిలో వ్యవసాయరంగం నుంచి సమకూరుతున్న వాటాలో అమెరికా తిరిగి సగభాగాన్ని రైతుల సబ్సిడీల కోసమే కేటాయిస్తోంది. అమెరికాతో పోలిస్తే భారత్ రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తున్నది అత్తెసరు మాత్రమే.

> *అమెరికా సేంద్రియ సాగు, పర్యావరణ పరిరక్షణ పేరు చెప్పుకుని వ్యవసాయ స్థూలదేశీయోత్పత్తి వాటాలో 40 శాతం నిధులను 'గ్రీన్ బాక్స్' పేరిట రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తోంది. అయినా ప్రపంచవాణిజ్య సంస్థ వీటిని మార్కెట్ విచ్ఛిన్నకర రాయితీలుగా పరిగణించకపోవడం దారుణం. అమెరికా లాంటి సంపన్న దేశాలు 'గ్రీన్ బాక్స్' పేరుతో డబ్ల్యూటీఓ నిబంధనలకు చిక్కకుండా తప్పించుకుంటున్నాయి.*

- సగానికిపైగా జనాభాకు వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న, మూడోవంతు జనం అర్ధాకలితో అలమటిస్తున్న భారత్ లాంటి దేశంలోని పరిస్థితులు అమెరికాకు పూర్తి భిన్నం. రైతులకు మద్దతు ధరలు చెల్లించడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకాలపై రాయితీలు ఇవ్వక తప్పదు. ఈ తరహా చర్యలు ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్దేశించిన 'మార్కెట్ విచ్ఛిన్నకర' రాయితీల పరిధిలోకి వస్తాయని ఐరోపా, అమెరికా దేశాలు గొంతు చించుకుంటున్నాయి. ఈ రకమైన సంపన్న దేశాల దాష్టీకాన్ని భారత్ మొదటి నుంచీ అనేక వేదికలపై ఎప్పటికప్పుడు ఎండగడుతూనే వస్తోంది.
- 2013 లో బాలిలో, 2015 లో నైరోబీ సదస్సుల్లో వర్ధమాన దేశాలను కూడగట్టుకుని, న్యాయమైన తమ హక్కులు, బడుగు బలహీన వర్గాల ఆహార భద్రత కోసం, రైతులను ఆదుకోవడానికి భారత్ తన వాదనను గట్టిగానే వినిపించింది. ఆహార భద్రత హక్కుల కోసం కృషి చేస్తున్న అభివృద్ధి చెందుతున్న దేశాలపై 10 శాతం పరిమితి నిబంధనను ఎత్తేయాలని గతంలోనే 45 దేశాలను కూడగట్టుకుని డబ్ల్యూటీఓలో వాదించింది. కానీ అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు భారత్ వాదనను తోసిపుచ్చాయి. ఈసారి మాత్రం వర్ధమాన దేశాల గళం మరింత పదునెక్కింది. చైనాతో సహా 100 కు పైగా దేశాలు మద్దతు ఇచ్చాయి. ఎలాంటి నిర్ణయం లేకుండా సమావేశాలు ముగిసినా అమెరికా తీరుపై ధిక్కార స్వరం మరింత పెరగడం ఆ దేశ వైఖరిలో మార్పు తెస్తుందేమో చూడాలి.

### ప్రపంచ వాణిజ్యం - మహిళా సాధికారత

ఆహారభద్రత విషయంలో ఎటూ నిర్ణయం తీసుకోలేకపోయిన డబ్ల్యూటీఓ - 17 సమావేశం 'మహిళా సాధికారత' పట్ల మాత్రం చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించింది. ప్రపంచంలో నాలుగింట మూడోవంతు దేశాలు సభ్యులుగా ఉన్న డబ్ల్యూటీఓ వర్తక, వాణిజ్యాల్లో మహిళల భాగస్వామ్యంపై ఎదురవుతున్న అవరోధాలను తొలగించడానికి సత్వర చర్యలకు ఉపక్రమించాలని నిర్ణయించింది. లింగ సమానత, మహిళా సాధికారత కోసం విశేషంగా మద్దతు ఇస్తున్న భారత్ డబ్ల్యూటీఓలో మైనార్టీ వర్గంలో ఉన్నా, బాగా ప్రభావితం చేసేదిగా ఉండి కూడా ఈ విషయంపై సానుకూలంగా వ్యవహరించలేదు. లింగ భేదం వాణిజ్య సంబంధమైన విషయం కాదని, వాణిజ్య సంబంధిత అంశాలకు - మహిళా సాధికారకతకు లంకె పెట్టడం సమంజసం కాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

- అభివృద్ధి చెందిన దేశాలు అవలంబిస్తున్న లింగపరమైన విధానాల్లో ఉన్నత ప్రమాణాలుగా పేర్కొంటున్నవి అభివృద్ధి చెందుతున్న దేశాల ఎగుమతులకు అడ్డుకట్ట వేయడమేకాక అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ మహిళలకు ప్రోత్సాహం కల్పించడాన్ని పరోక్షంగా నియంత్రిస్తున్నాయి. అలాగే లింగసంబంధమైన అంశాలపై చర్యలు చేపట్టడానికి డబ్ల్యూటీఓ వేదికగా, ఒక సరైన వేదిక అవసరమని భారత్ అభిప్రాయపడింది. ఎందుకంటే ప్రపంచ వాణిజ్య సంస్థ అనేది కేవలం వాణిజ్య సంబంధ సంస్థ. వాణిజ్యేతర అంశాలైన కార్మికులు, పర్యావరణం- ప్రమాణాలు మొదలైనవి చర్చించడానికి డబ్ల్యూటీఓలో మరొక విభాగాన్ని ఏర్పాటు చేయడం సమంజసమని భారత్ అభిప్రాయం.
- ప్రపంచ వాణిజ్య సంస్థ చరిత్రలోనే తొలిసారిగా 119 సభ్య దేశాలు 'మహిళలు - వాణిజ్యం' అనే బ్యూనస్ ఎయిర్స్ డిక్లరేషన్‌కు మద్దతు ఇచ్చేందుకు అంగీకరించాయి. మహిళల వాణిజ్య భాగస్వామ్యంలోని ప్రతిబంధకాలను తొలగించేందుకు, ఆర్థిక - వాణిజ్య రంగంలో మహిళా సాధికారతను వేగవంతం చేసేందుకు ఇది దోహదం చేస్తుంది. డిక్లరేషన్‌లో పొందుపర్చిన కార్యాచరణ మహిళలకు మరిన్ని మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని డబ్ల్యూటీఓ పేర్కొంది. లింగ సమానత ద్వారా సాధికారత సాధ్యమవుతుందని, తద్వారా ఐక్య రాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఇవి దోహదం చేస్తాయని పేర్కొంది.
- వాణిజ్యంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా మహిళలకు సమానావకాశాలను కల్పించడం సాధ్యమవుతుందని, తద్వారా ప్రపంచ స్థూల దేశీయోత్పత్తికి 2025 నాటికి 28 ట్రిలియన్ డాలర్లు జతకూడతాయని ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్చనా గోంజాలెజ్ అభిప్రాయపడ్డారు.
- ఈ డిక్లరేషన్ మహిళల అభ్యున్నతికి ప్రతిబంధకంగా నిలుస్తున్న డబ్ల్యూటీఓ నిబంధనలను గురించి వెల్లడించడంలో విఫలమైందని, దీనికి బదులు అసమానతలు, అణిచివేతలకు దోహదం చేస్తున్న డబ్ల్యూటీఓ విధానాలకు ముసుగువేసి చూపించినట్లు ఉందని 160 దేశాలకు చెందిన మహిళా హక్కుల సంస్థలు ఒక సంయుక్త ప్రకటనలో ఖండించాయి. ప్రపంచంలోని అన్ని మహిళా హక్కుల సంఘాలు ఈ డిక్లరేషన్‌ను తిరస్కరించాయని, డబ్ల్యూటీఓ అనుసరిస్తున్న హానికారక విధానాల నుంచి దృష్టి మళ్లించడానికి చేపపిల్లలకు వేసిన ఎరగా దీన్ని ప్రకటించారని మహిళల న్యాయం, సంక్షేమ విభాగం, ఆసియా ఎకనామిక్ ఫోరం, గ్లోబల్ కో-ఆర్డినేటర్ కేట్‌లాపిన్ అభిప్రాయపడ్డారు.

> *ప్రపంచ వ్యవసాయ వాణిజ్య నిబంధనలను ప్రజాస్వామికంగా సంస్కరించాలన్నదే భారత్ ప్రధాన ఆశయం. ఆకలి, దారిద్ర్యం నుంచి ప్రపంచానికి విముక్తి కల్పించాలనేది ఐక్య రాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో కీలకమైంది. ఆహారభద్రత కల్పనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులను గౌరవించాల్సిన ఆవశ్యకత సుస్పష్టం.*

- డబ్ల్యూటీఓ సభ్య దేశాలు, మద్దతుదారులు మాత్రం వాణిజ్య, ఆర్థిక లావాదేవీల్లో మహిళల వెనుకబాటుతనాన్ని సరిదిద్ది, వారిని ప్రోత్సహించేదిగా ఉందని, మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇది దోహదం చేస్తుందని చెబుతున్నాయి. లింగ సమానత్వాన్ని దృష్టిలో ఉంచుకుని సభ్య దేశాలు విధానాలను రూపొందించి, మదింపు చేస్తాయని, దీని ప్రగతి నివేదిక 2019 లో విడుదల చేసే అవకాశం ఉందని ప్రపంచ వాణిజ్య సంస్థ పేర్కొనడం గమనార్హం. భారత్ మాత్రం ఈ చర్యను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది.

### ఈ-కామర్స్

ఈ-కామర్స్ సేవలపై ప్రపంచవ్యాప్త నిబంధనలు ఉండకూడదని భారత్ వాదిస్తోంది. ఇలాంటి నిబంధనలకు తాము వ్యతిరేకం కాకపోయినా ఇవి తమకు ఇబ్బందికరంగా ఉంటాయని భారత్ అభిప్రాయం. ఈ-ట్రాన్స్‌మిషన్‌పై సభ్యదేశాలు కస్టమ్ డ్యూటీ విధించడాన్ని నిషేధించేందుకు ఉద్దేశించిన మారటోరియాన్ని విస్తరించడంపై అంగీకారం తెలిపేందుకు భారత్ ముందస్తు షరతులు విధించింది.

- 1998 లో జరిగిన రెండో మంత్రుల స్థాయీ సమావేశంలో 'గ్లోబల్ ఈ-కామర్స్ డిక్లరేషన్'లో ఈ మారటోరియాన్ని అమల్లోకి తెచ్చారు. దీని ప్రకారం సభ్య దేశాలు తమ ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించడాన్ని కొనసాగించవచ్చని నిర్ణయించారు. ఇది తాత్కాలికమే అయినా ప్రతి రెండేళ్లకోసారి జరిగే మంత్రుల స్థాయీ సమావేశంలో దీన్ని పొడిగించుకుంటూ వస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాలు మాత్రం ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించేందుకు 'శాశ్వత మారటోరియం' విధించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ చర్య అభివృద్ధి చెందుతున్న దేశాలు చూపుతున్న చొరవను ప్రభావితం చేసేదిగా ఉందని భారత్ అభిప్రాయపడింది. ఇలాంటి చర్యలు భారత్ సహా పలు దేశాల్లోని దేశీయ ఔషధ తయారీ పారిశ్రామిక రంగానికి హాని కలిగించవచ్చనేది అభివృద్ధి చెందుతున్న దేశాల వాదన. ప్రపంచ వాణిజ్య సంస్థకు చెందిన విభాగాల్లో రూపొందించిన వర్క్ ప్రోగ్రామ్ మార్గదర్శకాలు, ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాన్ని అనుసరించి ఈ-కామర్స్‌పై చర్చలు కొనసాగించడానికి ఇతర సభ్యదేశాల అంగీకారాన్ని, మద్దతును బట్టి మారటోరియంపై భారత్ తన నిర్ణయాన్ని వెల్లడిస్తుందని పేర్కొంది.
- మొత్తానికి ఈ-కామర్స్‌పై ప్రతిబంధకంగా పరిణమిస్తున్న నిబంధనలను ఎత్తివేయాలని భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు అభిప్రాయపడుతున్నాయి. అలాగే తమ దేశ సాఫ్ట్‌వేర్, అకౌంటింగ్ నిపుణులు, నర్సులకు ఇతర దేశాల్లో అవకాశాలు కల్పించాలని భారత్ కోరుతోంది.



రచయిత:
డాక్టర్ జి.వి.ఎల్. విజయ్‌కుమార్

# ప్రజలకు ప్రత్యామ్నాయ ప్రభుత్వం కావాలి

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం**



పర్సా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని, ఎమ్మెల్యే రాజయ్య తదితరులు



కళాకారుల నృత్యాలు

**భద్రాచలం అంబేడ్కర్ సెంటర్, న్యూస్‌టుడే:** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ప్రత్యామ్నాయ ప్రభుత్వం కావాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రథమ మహాసభలు బుధవారం భద్రాచలంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో తమ్మినేని మాట్లాడుతూ... నోట్ల రద్దు దేశంలోనే పెద్ద కుంభకోణం అన్నారు. దేశ ఆర్థిక రంగంలో మోదీ ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వంలో మోదీ అధికారంలోకి వచ్చాక ఆర్థిక రంగం ఛిన్నాభిన్నం అయిందన్నారు. పేదోళ్లకు న్యాయం చేస్తామని, రూ.లక్షలు బ్యాంకుల్లో వేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పడం తప్ప అమలు కాలేదన్నారు. పరిశ్రమలు సాధిస్తామని, విదేశీ పెట్టుబడులు తెస్తామని చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయని అన్నారు. ధనవంతులకు మేలు జరిగిందని, వారికి రుణమాఫీ జరిగిందని అన్నారు. మరోవైపు మతోన్మాద రాజకీయాలకు పాల్పడుతూ దళితులను, ముస్లింలను ఊచకోత కోస్తున్నారని అన్నారు. ధనవంతులు మరింత ధనవంతులుగా పేదలు మరింత పేదలుగా మారారని అన్నారు. రాష్ట్రంలో పరిస్థితి కూడా అలాగే ఉందన్నారు. కేసీఆర్ ఊక దంపుడు ఉపన్యాసాలు, రూ. కోట్ల ప్రకటనలు తప్ప ఆచరణలో ఆవగింజంత పనికూడా జరగడం లేదని దుయ్యబట్టారు. మన నీరు, మన కొలువులు అని చెప్పి నిరుద్యోగులకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. రైతు ఆత్మహత్యల పెరిగినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. గిరిజన చట్టాలుపై కూడా అవగాహన లేకుండా పోడు భూములపై ఉక్కుపాదం మోపుతున్నారని అన్నారు. మూడున్నర ఏళ్లలో కేవలం 27 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని, 2.70 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. త్వరలో ప్రజా సంఘాలతో బహుజన ఫ్రంట్ అవతరించబోతున్నాట్టు వారు ప్రకటించారు. అంతకుముందు సీపీఎం సీనియర్ నాయకులు కుంజా బొజ్జి పతాకావిష్కరణ చేశారు. నాయకులు అమరవీరుల చిత్రపటాలకు పూల మాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతినేని సుదర్శన్, బి.వెంకట్, రాజారావు, సాయిబాబా, బండారు రవికుమార్, హైమావతి, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే సున్నం రాజయ్య, మర్లపాటి రేణుక, కొక్కెరపాటి పుల్లయ్య, నభి, డాక్టరు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కార్యకర్తలు, నాయకులు

## నాటకోత్సవాల్లో ధూంధాం

భద్రాచలం జూనియర్ కళాశాల మైదానంలో ప్రజా నాట్య మండలి వారు నిర్వహించిన నాటకోత్సవాల ధూంధాం కార్యక్రమాలు అందరిని అలరించాయి. సీపీఎం మహాసభల్లో భాగంగా బుధవారం చిన్నారులు చేసిన రైతు నృత్య రూపకం, ఎర్రని సైన్యం నృత్యం, ఆటపాటలు ఆకట్టుకున్నారు. ముందుగా నాటకోత్సవాలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన తాళ్ళూరి పంచాక్షరయ్య, పాకాల దుర్గా ప్రసాద్ కార్యక్రమాన్ని డప్పు కొట్టి ప్రారంభించారు. రైతు సమస్యలపై చిన్నారుల చేసిన నృత్యం, కష్టపడి వ్యవసాయం చేసే రైతుకు ప్రకృతి అనుకూలించక పంట చేతికొచ్చే సమయానికి ప్రకృతి వైపరీత్యాలకు ఎలా ఇబ్బందులకు గునవుతున్నాడో వివరించారు. సీతాలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బండారు రవికుమార్, జీఎస్ శంకర్ రావు, గడ్డం స్వామి, ప్రజా నాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

# ఉత్సాహభరితంగా రాష్ట్ర స్థాయి లీగ్ పోటీలు

**కొత్తగూడెం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'తెలంగాణ అంతటా క్రికెట్'లో భాగంగా తలపెట్టిన జి. వెంకటస్వామి మెమోరియల్ టీ20 క్రికెట్ లీగ్ పోటీలు బుధవారం కొత్తగూడెం ప్రకాశం మైదానంలో ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 5వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో నాలుగు జిల్లాల(సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రికొత్తగూడెం) జట్లు తలపడుతున్నాయి. కొత్తగూడెం ప్రకాశం మైదానంలో క్రికెట్ పోటీల ప్రారంభాన్ని ఉద్దేశించి జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చేకూరి వెంకట్ మాట్లాడుతూ ఉభయ జిల్లాల్లో క్రికెట్‌కు ఎంతో ఆదరణ ఉందని, ఎన్నో దశాబ్దాలుగా క్రికెట్ ఇక్కడి ప్రజల ఈ ఆటతో మమేకం అయ్యారన్నారు. ఇక్కడి నుంచి ఎందరో క్రీడాకారులు ప్రతిష్ఠాత్మక వేదికలపై ప్రతిభను చాటుకున్నారని వివరించారు. నాలుగు జిల్లాల స్థాయి పోటీలో విజేతగా నిలిచిన జట్టు ఈ నెల 9, 10 తేదీల్లో సిద్దిపేటలో జరిగే సెమీ ఫైనల్స్‌లో వరంగల్ జట్టును ఎదుర్కొంటారు. తొలుత టాస్‌ను గెలిచిన భద్రాద్రి జట్టు బ్యాటింగ్‌ను ఎంచుకొని నిర్ణీత 20 ఓవర్లకుగాను తొమ్మిది వికెట్లను నష్టపోయి 194పరుగులను సాధించింది. ప్రత్యర్థి జట్టును తొమ్మిది వికెట్లకు 94 పరుగులకు కట్టడి చేయడంతో అతిథ్య జట్టు వంద పరుగుల తేడాతో విజయాన్ని సాధించింది జట్టులో సత్య 36 బంతుల్లో 52 పరుగులు చేసి అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు. నందురెడ్డి 40(28 బంతుల్లో), సాయికుమార్ 33(12) సహకారాన్ని అందించారు. ఏడో వికెట్ భాగస్వామ్యానికి 48బంతుల్లో 83 పరుగులు జోడించడంతో మ్యాచ్ అతిథ్య జట్టు వైపు మొగ్గుచూపింది. సూర్యాపేట జట్టు బౌలర్లు బి.శివుడు 3, ఉపేందర్‌రెడ్డి 2. అనిల్, సిద్ధిఖి చేరొక వికెట్ చొప్పున తీశారు. పవర్‌ప్లే సెషన్‌లో మూడు వికెట్లు 75 పరుగులు సాధించారు. గెలుపొందిన జట్టులో బౌలర్లు సాయివంశి 5, నందు రెడ్డి 3వికెట్లు తీశారు.

▮ అనంతరం ఖమ్మం, మహబూబాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఖమ్మం జట్లు తన ప్రత్యర్థి జట్టుపై 82 పరుగుల తేడాతో విజయాన్ని సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన ఖమ్మం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లను కోల్పోయి 195 పరుగులు చేయగా, జట్టులో శ్రీనివాసరావు 56(39బంతులు), రవిసుమంత్ 58(41 బంతుల్లో) అర్ధ సెంచరీలతో ఆకట్టుకున్నారు. కె.అభిలాష్ 30(8) ఎండీ.ఆసిఫ్ 23(13) సహకారమందించారు. ప్రత్యర్థి జట్టులో శ్రీధర్‌రెడ్డి నాలుగు వికెట్లను తన ఖాతాలో వేసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన మహబూబాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లకుగాను 19.2 ఓవర్లలో 113 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఖమ్మం జట్టులో ఎస్‌కె.జావెద్ 5 వికెట్లతో రాణించగా, అభిలాష్ రెండు, ఆసిఫ్, నారాయణ తేజ చెరో వికెట్‌ను తీశారు. గురువారం ఉదయం భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జట్లు తలపడుతుండగా, మధ్యాహ్నం ఖమ్మం, సూర్యాపేట జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుందని నిర్వాహకులు వివరించారు. శుక్రవారంతో పోటీలు ముగియనున్నాయి.

# ప్రధానాచార్యుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా కేఎస్ రామారావు



కేఎస్ రామారావు, రామలింగేశ్వరరావును సన్మానిస్తున్న అధ్యాపకులు

**ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే:** ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రధానాచార్యుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నయాబజారు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కేఎస్ రామారావు ఎన్నికయ్యారు. 2005 నుంచి 2013వరకు ఆయన జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2013నుంచి నయాబజారు కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో జరిగిన సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో నిర్వహించిన ఈఎన్నికల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.రామలింగేశ్వరరావును నిర్వాహక కార్యదర్శిగా ఎన్నికున్నారు. వీరితో పాటు ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శాంతినగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల రసాయనశాస్త్ర అధ్యాపకులు పి.శంకర్‌ను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర సంఘంలో బాధ్యతలు చేపట్టిన వీరిని బుధవారం నయాబజారు జూనియర్ కళాశాలలో అధ్యాపకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి శ్రీనివాస్, సంఘం బాధ్యులు ఎం.సతీశ్, కె.విజయలక్ష్మి, ఎస్.రాంబాబు, పి.నీరజ, బి.నాగేశ్వరరావు, తోపాటు నయాబజారు, శాంతినగర్ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.



# కళల కాణాచి పాతర్లపాడు

- కోలాహలంగా జంజరగాళ్ల ప్రదర్శన
- గ్రామంలో పండుగ వాతావరణం

**చింతకాని, న్యూస్‌టుడే:** ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ముగింపు సందర్భంగా చింతకాని మండలం పాతర్లపాడులో జంజరగాళ్ళతో స్వామివారి ఊరేగింపు వైభవోపేతంగా నిర్వహించారు. గ్రామంలో ఉన్న రైతులందరి అరక దున్నే ఎద్దులను, ఆవులను అందంగా అలంకరించి వాటికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం వాటి మెడలపై కాడులు వేసి స్వామి వారి ఊరేగింపు అగ్రభాగాన వరుస ప్రదర్శనగా ఉంచి గ్రామంలోని ప్రధాన వీధులన్నీ తిరుగుతారు. దీన్ని జంజరగాళ్ల ఊరేగింపుగా నామకరణం చేసి గత 50 ఏళ్లుగా ఇలాగే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రదర్శన ముందుభాగంలో జంజరగాళ్లు తరువాత కోలాట బృందం, చెక్కభజన బృందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు కూడా ప్రదర్శనలో ఏటా పాల్గొనటం ఆనవాయితీగా వస్తుందని పలువురు పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో కులమతాలకు అతీతంగా యువకులు, మహిళలు, వృద్ధులు పాల్గొన్నారు. అందంగా అలంకరించి ప్రదర్శనలో నిలిచిన ఎద్దుల జతలకు మువ్వల పట్టెడ, గంటల పట్టెడలు బహుమతిగా అందజేశారు. ప్రథమ స్థానం బొర్రా రాంచందర్‌రావు ఎద్దుల జత, ద్వితీయ స్థానం అమరబోయిన చిన్న బసవయ్య జత సాధించాయి. ప్రదర్శనలో పాల్గొన్న ప్రతి ఎద్దుల జతకు పనకుచ్చులు(శిగమరలు) ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



ప్రదర్శన ముందు భాగంలో చెక్క భజన కళాకారులు



ఎడ్లబండిపై స్వామి వారి ఊరేగింపు

## రైతుబజారు కూరగాయల ధరలు (రూ.లలో)

టమాట 10, వంకాయ 20, బెండకాయ 30, పచ్చిమిరప 28, కాకర 30, బీర 40, కాలీఫ్లవర్ 30, క్యాబేజీ 24, క్యారెట్ 60, దొండకాయ 28, ఆలుగడ్డలు 14, ఉల్లిగడ్డలు 45, గోరుచిక్కుడు 30, దోసకాయ 24, సొరకాయ 10, పొట్లకాయ 20, అరటికాయ (1) 10, ఫీల్డుబీన్స్ 40, చామగడ్డ 44, ములగకాడ 10, ఆకుకూరలు 10, కంద 60, బీట్‌రూట్ 34, కీరదోస 20, బీన్స్ 50. (నిన్నటివి).

## శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి


**ఖమ్మంమయూరిసెంటర్, న్యూస్‌టుడే:** నగరంలోని 6వ డివిజన్ ప్రజలు శ్మశానవాటిక లేక ఇబ్బందులు పడుతున్నారని ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి అన్నారు. టీమాస్ హవేలి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆరో డివిజన్‌లో ఇంటింటి సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. టీమాస్ నాయకులు వెంకన్న, పిన్నింటి రమ్య, అమరావతి, గోపాల్, మురారి తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో విజయ డెయిరీ భవనాలు

**దశాబ్దాలు గడిచినా దశ తిరగని వైనం**

**అభివృద్ధికి నోచుకోక వెలవెలబోతున్న సంస్థ**


పూర్తిగా శిథిలమైన అతిథి గృహం


దెబ్బతిన్న క్వార్టర్లు

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

ఖమ్మం నగరం రోటరీనగర్‌లోని విజయడెయిరీ భవనాలు ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నాయి. 1975లో ప్రభుత్వం వీటిని నిర్మించింది. డెయిరీ భవనంతో పాటు ఆరు క్వార్టర్లు, అతిథి గృహం, ఉపసంచాలకుల కార్యాలయం నిర్మించారు. గత కొన్ని దశాబ్దాల నుంచి అతిథి గృహంతో పాటు దానికి అనుబంధంగా ఉన్న సముదాయాలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిని ప్రస్తుతం ఉపయోగంచటం లేరు. లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నిర్మాణాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఇక సిబ్బందికి కూడా ఆరు క్వార్టర్లు నిర్మించారు. వీటిలో నాలుగు క్వార్టర్లలో పొరుగుసేవల సిబ్బంది, పంపిణీదారుకి మరో క్వార్టరు కేటాయించారు. వీరంతా అద్దె చెల్లించి వీటిలో నివాసం ఉంటున్నారు. నెలకు రూ.1500ల చొప్పున వీరి నుంచి వసూలు చేస్తున్నారు. వర్షాకాలంలో క్వార్టర్లు అక్కడక్కడ కురుస్తాయి. గోడలన్నీ తేమతో నిండిపోతాయి. ఇవి ఎప్పుడు పడిపోతాయోనని బిక్కుబిక్కుమంటూ వాటిలో నివాసం ఉంటున్నారు. అదే విధంగా ఉపసంచాలకు కార్యాలయం కూడా శిథిలావస్థలోనే ఉంది. పైకప్పు దెబ్బతినటంతో మరమ్మతులు చేయించారు. అయినప్పటికీ వర్షాకాలంలో ఇబ్బందిగానే ఉంది. దస్త్రాలు ఎక్కడ తడిసిపోతాయోనని ఉద్యోగులు అందోళన చెందుతున్నారు. అదే విధంగా పాలు సరఫరా చేసే డెయిరీ భవనాలు సైతం చాలా వరకు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం పెద్దఎత్తున వీటికి నిధులు విడుదల చేస్తే తప్ప ఇవి బాగుపడే అవకాశం లేదు. హరిత హారం పథకంలో భాగంగా అనేక మంది ప్రజాప్రతినిధులు ఇక్కడ మొక్కలు నాటారు. కానీ చివరకు బతికినవి మాత్రం చాలా స్వల్పం. ఒకప్పుడు జిల్లాలో వెలుగు వెలిగిన విజయ డెయిరీ నేడు కనీస సౌకర్యాలు లేక వెలవెలబోతోంది. ప్రైవేటు డెయిరీల నుంచి వచ్చే పోటీని తట్టుకోవాలంటే ప్రభుత్వం దీనికి నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. గతంలో ఇక్కడ పశువుల దాణా తయారీ కేంద్రం, పాడి రైతులకు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించారు. అవి కూడా ఇంత వరకు అమలు జరగలేదు. ప్రధాన రహదారి పక్కనే ఖాళీగా ఉన్న స్థలంలో దుకాణాల సముదాయం ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు పంపారు. అవి కూడా ఇంత వరకు మంజూరు కాలేదు. కొంత మంది లీజు పేరుతో ఖాళీగా ఉన్న స్థలంపై కన్నేశారు. గతంలో ఇక్కడ బస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని కూడా ప్రతిపాదనలు చేశారు. పాడి రైతులు పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టటంతో ఆ ప్రతిపాదనను విరమించుకున్నారు. సుమారు మొత్తం 10ఎకరాల స్థలం ఉన్నప్పటికీ ఇది అభివృద్ధికి మాత్రం నోచుకోవటం లేదు.


పనికి రాకుండా ఉన్న సముదాయం

## తెదేపా 9,10 డివిజన్ కమిటీల నియామకం

**ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే:** ఖమ్మం కార్పొరేషన్ తెదేపా సంస్థాగత ఎన్నికల్లో భాగంగా బుధవారం 9వ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా వాకదాని కోటేశ్వరరావు, తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, 10వ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా పొన్నం లక్ష్మయ్య, రాచమల్ల అప్పారావులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చిరుమామిళ్ల నాగేశ్వరరావు, అడ్‌హక్ కమిటీ కన్వీనర్ కూరపాటి వెంకటేశ్వర్లు, రవి, శ్రీహరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## రాయితీ రుణాలు పంపిణీ

**రఘునాథపాలెం, న్యూస్‌టుడే:** ఇద్దరు లబ్ధిదారులకు బుధవారం రాయితీ రుణాలు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. ట్రైకార్ నుంచి శివాయిగూడెంకు చెందిన బాలాజీకి రూ.2లక్షల విలువైన ఆటో, ఎస్సీ కార్పొరేషన్ నుంచి చింతగుర్తికి చెందిన సుహాసినికి దుకాణం మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు అజ్మీరా ఈరూనాయక్, తహసీల్దారు తిరుమలాచారి, సూపరింటెండెంట్ జానిమియా, డీసీసీబీ ఏబీమార్గ్ బీఎం సత్యనారాయణ, ఆత్మ డివిజన్ ఛైర్మన్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## కాలమానిని ఆవిష్కరణ

**ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** గాయత్రి రవి యువజన విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కాలమానిని గాయత్రి గ్రానైట్ సంస్థల అధినేత వద్దిరాజు రవిచంద్ర బుధవారం ఆవిష్కరించారు. తన ఇంటి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కేక్‌కట్‌చేసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రానైట్ యజమానుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాయల నాగేశ్వరరావు, ఉపేందర్, చిరంజీవి, రాజేష్, వినోద్, గణేశ్ పాల్గొన్నారు.


కాలమానిని ఆవిష్కరిస్తున్న వద్దిరాజు రవిచంద్ర, రాయల నాగేశ్వరరావు తదితరులు

## చిమ్మపూడి పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ

**చిమ్మపూడి(రఘునాథపాలెం), న్యూస్‌టుడే:** రఘునాథపాలెం మండలం చిమ్మపూడి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను డీఈవో వాసంతి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాల ప్రార్థనలో పాల్గొన్నారు. ఉపాధ్యాయుల పనితీరు, మధ్యాహ్న భోజన నిర్వహణను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల నిర్వహణ, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. డీసీఈబీ కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, హెచ్ఎంలు ఏ.వెంకటేశ్వరరావు, మందడపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.


చిమ్మపూడి ప్రాథమిక పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో వాసంతి

# ఆకట్టుకున్న రంగవల్లులు


5వ డివిజనులో ముగ్గులను పరిశీలిస్తున్న కార్పొరేటర్లు


విజేతకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే అజయ్‌కుమార్, వసంతలక్ష్మి దంపతులు

**ఖమ్మం సాంస్కృతికం, ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలను బుధవారం నగరంలోని 2,4,5 డివిజన్‌లలో ప్రారంభించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పంచడంలో ముగ్గులకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆయా డివిజన్లకు చెందిన మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని అందమైన ముగ్గులు వేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు కమర్తపు మురళి, పగడాల నాగరాజు, సలువాది వెంకన్న, నాగండ్ల కోటేశ్వరరావు, కొత్తపల్లి నీరజ, తెరాస నాయకులు కె.పద్మ, పద్మజారెడ్డి, కె.జ్యోతిర్మయి, కె.తార, సుదర్శన్‌రావు, దయాకర్, భిక్షం, ప్రసాద్, వెంకటేశ్వర్లు, కొమరయ్య పాల్గొన్నారు.

**బహుమతులు ప్రదానం:** ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్, వసంతలక్ష్మి దంపతులు బుధవారం రాత్రి ముగ్గులను పరిశీలించి మహిళలను అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

## చర్చికి స్థలం కేటాయించాలి

**ఖమ్మంమయూరిసెంటర్, న్యూస్‌టుడే:** నగరంలోని 32వ డివిజన్ ఎన్ఎస్‌పీ రోడ్డులోని జీవము గల దేవుని సంఘం చర్చిని అధికారులు, పోలీసులు కలిసి కూల్చివేశారని కేవీపీఎస్ ప్రతినిధి బృందం ఆరోపించింది. బుధవారం చర్చి కూల్చిన ప్రాంతాన్ని కేవీపీఎస్ ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చర్చిని ఏ రకంగా కూల్చారో అదేవిధంగా చర్చికి స్థలం కేటాయించాలని, ప్రభుత్వ నిధులతో చర్చిని నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు గంటా భీమయ్య, బుర్రి ఇందిర, వెంకట్‌కుమార్, చర్చి సభ్యులు ఉన్నారు.

## బయోమెట్రిక్‌తో కార్మికుల శ్రమదోపిడీ: ఏఐటీయూసీ

**ఖమ్మం గట్టయ్యసెంటర్:** బయోమెట్రిక్ నెపంతో కార్మికుల వేతనాల్లో కోతలు విధిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని ఏఐటీయూసీ జిల్లా సహాయకార్యదర్శి మందా వెంకటేశ్వర్లు ఆరోపించారు. కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికుల వేతనాల సమస్యలపై నగరంలోని గిరిప్రసాద్‌భవన్‌లో నకరికంటి కృష్ణ అధ్యక్షతన బుధవారం మున్సిపల్ ఏఐటీయూసీ కార్మికుల సమావేశం జరిగింది. సమావేశంలో బొడ్డు పాపారావు, హనుమంతు, ఎస్‌కె.హుస్సేన్, మహేష్, .తిరపయ్య పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యా సంస్థలలో రుసుములను నియంత్రించాలి

**కామేపల్లి, న్యూస్‌టుడే:** ప్రైవేట్ విద్యాసంస్థలలో రుసుములను నియంత్రించాలని పీడీఎస్‌యూ మండల నాయకుడు బత్తుల అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జాస్తిపల్లిలో ఆచార్య తిరుపతిరావు కమిటీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ మండల కమిటీ సభ్యులు హరీశ్, రాజ్ కుమార్, వంశీ, క్రాంతికుమార్, సాయి కుమార్ పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

**కామేపల్లి, న్యూస్‌టుడే:** ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకుడు పగిడిపల్లి ప్రభాకర్ మాదిగ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం కొత్తలింగాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంద కృష్ణమాదిగను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. సమితి మండల అధ్యక్షుడు ప్రసాద్, సతీశ్, వెంకన్న, ఉప్పలయ్య, రవి పాల్గొన్నారు.

## భూగర్భ జలాల సంరక్షణకు రైతులు కృషి చేయాలి

**కామేపల్లి, న్యూస్‌టుడే:** భూగర్భ జలాల సంరక్షణకు రైతులు కృషి చేయాలని ఏవో సతీశ్ అన్నారు. బుధవారం ఆటోమెటిక్ స్టాటర్ల తొలగింపుపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ముచ్చర్ల, లింగాల, కొండాయిగూడెం, మద్దులపల్లిలో అవగాహన సమావేశాలను నిర్వహించారు. అనంతరం పంట చేనులలోని ఆటోమెటిక్ స్టాటర్లను తొలగించారు. ఎంపీటీసీ సభ్యుడు చిదంబరరావు, ఉపసర్పంచి శ్రీనివాసరెడ్డి, ఏఈవో శ్రీనివాసరాజు, రైతులు పాల్గొన్నారు.


ఆటోమెటిక్ స్టాటర్లను తొలగిస్తున్న వ్యవసాయ, విద్యుత్తు శాఖల సిబ్బంది

# ఖమ్మం

## నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

**ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే:** నగరంలోని ఇల్లెందు క్రాసురోడ్డు ఉపకేంద్రం జమ్మిబండ ఫీడర్ పరిధిలో గురువారం విద్యుత్తు సరఫరా నియంత్రిస్తున్నట్లు ఏడీఈ బాలాజీ, ఏఈ రాజ రత్నం తెలిపారు. ఫీడర్ పరిధిలోని టీటీడీసీ, సీక్వెల్, సెంచరీ స్కూల్, జమ్మిబండ పరిసరాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని బుధవారం వారు ఒక ప్రకటనలో కోరారు.



# ధీరవనిత సావిత్రిబాయి పూలే



బీసీసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలేకు నివాళులు అర్పిస్తున్న బీసీ నాయకులు



తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలేకు ఘననివాళి



తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

**ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే:** భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, బహుజన మహిళల్లో విద్యావ్యాప్తికి కృషి చేసిన సాంఘిక సంస్కర్త మహాత్మ జ్యోతీరావు పూలే సతీమణి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు బుధవారం ఖమ్మంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ర.భ.విశ్రాంతి భవనం ఎదుట ఉన్న పూలే దంపతుల విగ్రహాల వద్ద సమావేశాలు నిర్వహించారు. సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహిళలు బయటకు రావటమే నేరంగా భావించే రోజుల్లో తన భర్త ద్వార విద్య నేర్చుకుని మహిళలకు బోధించేందుకు స్వయంగా పాఠశాలను నిర్మించారన్నారు. ఎంతోమంది మహిళలను విద్యావంతులుగా చేసిన గొప్ప ధీరవనిత సావిత్రిబాయి పూలే అని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో బీసీసంక్షేమ సంఘం నాయకులు పిండిప్రోలు రామ్మూర్తి, కూరాకుల నాగభూషణం, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు కె.వి. కృష్ణారావు, చిర్రా రవి, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నాయకులు అల్లిక వెంకటేశ్వర్లు, పెరుగు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

★ ఆర్జేసీ కళాశాల ఆవరణలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుండాల కృష్ణ పూలమాల వేసి నివాళులు అర్పించారు.

**ఖమ్మంమయూరిసెంటర్, న్యూస్‌టుడే:** దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు మహాత్మా సావిత్రీజ్యోతిరావు పూలే మార్గం అనుసరణీయం అని టీమాస్ నాయకులు కొనియాడారు. సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని స్థానిక 14వ డివిజన్‌లో టీమాస్ ఒకటో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ మహిళా అభ్యున్నతి కోసం, వారి సాధికారత కోసం పోరాడిన ధీరవనిత సావిత్రిబాయిపూలే అన్నారు.



ఆర్జేసీ కళాశాలలో చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కృష్ణ

ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మహిళలు పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీమాస్ ఒకటో పట్టణ కన్వీనర్ దాసరి నాగేశ్వరరావు, మహిళా కన్వీనర్ బాగం అజిత, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు మెహరున్నీసాబేగం, టీమాస్ బాధ్యులు సరస్వతి, ఉపాధ్యాయులు పారుపల్లి సురేష్, ఉపాధ్యాయులు ఎలీనా, వసంత తదితరులు పాల్గొన్నారు.

★ సీవీరామన్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రమ్య, శ్రావ్య, స్రవంతి, భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

★ కేవీపీఎస్ రెండో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రేవతిసెంటర్‌లోని ఎస్టీ హాస్టల్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్, భీమయ్య, ఇందిర, వెంకట్‌కుమార్, లక్ష్మీ, శ్రీను, చిరంజీవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

★ టీమాస్ రెండో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి టీమాస్ రాష్ట్ర బాధ్యురాలు బుగ్గవీటి సరళ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీమాస్ బాధ్యులు వినయ్‌కుమార్, భారతి, వై.విక్రమ్, నెహ్రూ, శోభ, వెంకట్‌కుమార్, సూర్యం, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## కల్లాల్లో కొత్త మిర్చి

**రఘునాథపాలెం, న్యూస్‌టుడే:** కొత్త మిర్చి కల్లాల్లోకి వచ్చింది. రఘునాథపాలెం మండలంలోని అన్ని గ్రామాలలో మిర్చి సాగు చేశారు. వైరస్ తెగుళ్ల పైరును దెబ్బతీసినా తొలి పంట కోతలు ప్రారంభమయ్యాయి. గత కొన్ని రోజులుగా రైతులు మిర్చి పంట కోత, కల్లాల్లో ఆరబెట్టడం, తాలుకాయలు ఏరే పనులలో బిజీగా ఉన్నారు. నేడో, రేపో మార్కెట్ తరలించేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా రఘునాథపాలెం మండలం చిమ్మపూడి, కోటపాడు గ్రామాల వద్ద 'న్యూస్‌టుడే'కు కనిపించిన దృశ్యాలు ఇవి.



తాలుకాయలు ఏరుతున్న మహిళ

## రహదారి పనులు అడ్డగింత



పనులను అడ్డుకున్న పంగిడి గ్రామస్థులు

**పంగిడి(రఘునాథపాలెం), న్యూస్‌టుడే:** పదికాలాలపాటు తమకు ఉపయోగపడాల్సిన రహదారి నిర్మాణ పనులలో నాణ్యత పాటించడంలేదని, పర్యవేక్షించాల్సిన అధికారులు పత్తాలేరని రఘునాథపాలెం మండలం పంగిడి గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను బుధవారం వారు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐటీడీఏ నిధులు రూ.3.54కోట్లతో పంగిడి నుంచి రజబ్‌అలీ నగర్ వరకు సుమారు 7 కి.మీ. రహదారి నిర్మాణ పనులు చేపట్టారని తెలిపారు. బీటీ రహదారితోపాటు, గ్రామాలలో సీసీ రహదారులను అభివృద్ధి చేయాల్సి ఉందని వివరించారు. అయితే పంగిడి, చింతలతండా మధ్య జరుగుతున్న సీసీ రహదారి నిర్మాణ పనులు నాణ్యత లేకుండా జరుపుతున్నారని ఆరోపిస్తూ వారు అడ్డుకున్నారు. పనులను ఎవరూ పర్యవేక్షించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు రహదారిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



## ఆధార్ కేంద్రం ప్రారంభం

**ఖమ్మం నగరం, న్యూస్‌టుడే:** ఖమ్మం కలెక్టరేట్ ఆవరణలోని ఆంధ్రాబ్యాంక్‌లో ఆధార్ నమోదు కేంద్రాన్ని బుధవారం బ్యాంక్ మేనేజర్ రఘునాథరావు ప్రారంభించారు. ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, సవరణలు, కొత్తగా ఆధార్ నమోదు ప్రక్రియను ఈ కేంద్రంలో చేపడతారు.

## వర్గీకరణ హామీ ఇచ్చి మోసం

**ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే:** అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన భారతీయ జనతా పార్టీ మాదిగలను పచ్చి మోసం చేసిందని టీ ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరోపించారు. బుధవారం ధర్నాచౌక్‌లో ఒక్కరోజు దీక్ష చేశారు. నాయకులు మాట్లాడుతూ తక్షణమే వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టాలని, చెప్పు కుట్టే, డప్పు కొట్టే వృత్తిదారులకు రూ.2వేలు పింఛను ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రం నుంచి అఖిల పక్షానికి అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా మోదీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అఖిల పక్షాన్ని దిల్లీకి తీసుకుపోవటంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై అనుమానం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికారప్రతినిధి పేర్ల మధు, జిల్లా అధ్యక్షులు లంక వెంకటేశ్వర్లు, పులిపాటి ప్రకాశ్, బి. వెంకటేశ్వర్లు, గురవయ్య, కనకరత్నం, ప్రవీణ్, రాజరత్నం, శ్యాం పాల్గొన్నారు.



ధర్నా చౌక్ దీక్ష చేస్తున్న తెలంగాణ ఎమ్మార్పీఎస్ నాయకులు

## నేత్రదానం

**ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే:** మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన బాణోతు అనూష, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లికి చెందిన సోమరాజు శ్రీధర్‌రావు బుధవారం మృతి చెందారు. వారి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేయగా సేకరించి అపోలో, అగర్వాల్ నేత్రనిధులకు పంపినట్లు ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి రాయపూడి అనంతపద్మనాభం ఒక ప్రకటనలో తెలిపారు.

## చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పక వేయించాలి

**కామేపల్లి, న్యూస్‌టుడే:** చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పక వేయించాలని డీఐవో అలివేలు అన్నారు. బుధవారం ముచ్చర్ల, మద్దులపల్లిలో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం కామేపల్లి పీహెచ్‌సీలో వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించిన రికార్డులు, మందులను తనిఖీ చేశారు. వైద్యులు జితేందర్, సీతల్ చంద్ర పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపిక

**ఖమ్మం నగరపాలకం, న్యూస్‌టుడే:** ఖమ్మం నగరానికి 207-18 ఆర్థికసంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్‌కు దరఖాస్తుచేసుకున్న వారిలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను బుధవారం ప్రారంభించారు. నగరంలోని 1 నుంచి ఆరు డివిజన్‌లలో గ్రామసభలు నిర్వహించి లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎంపికలో పారదర్శకతను పాటించేందుకు గాను లాటరీ ప్రక్రియను, గ్రామసభకు వచ్చిన వారిని, అక్కడి పరిస్థితిని వీడియో చిత్రీకరించారు. ఈ సందర్భంగా మేయర్ డాక్టర్ గుగులోత్ పాపాలాల్ మాట్లాడుతూ ఖమ్మం నగరానికి 134యూనిట్లు మంజూరు కాగా, డివిజన్‌లలోని ఎస్సీ జనాభా ఆధారంగా యూనిట్లు కేటాయించడం జరిగిందని, ఆయా డివిజన్లలో వచ్చిన దరఖాస్తుదారులకు నెంబర్‌లు కేటాయించి, వారినుంచి లాటరీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక నిర్వహించనున్నట్టు తెలిపారు. ఒకటో డివిజన్‌లో రెండు యూనిట్లు కేటాయించగా లాటరీ ప్రక్రియలో తొలుత గద్దల శ్రీనివాస్ ఎంపికయ్యాడు. రెండో యూనిట్‌కోసం మహిళా విభాగం నుంచి లాటరీ తీయగా చందన అనే యువతికి రాగా, సిబ్బంది దానిని గద్దల నాగమణిగా ప్రకటించారు. అయితే ఒకే కుటుంబం వారికి రావడంతో నాగమణికి ఇవ్వలేమని కార్పొరేషన్ అధికారులు చెప్పారు. దీంతో కమిషనర్ సందీప్‌కుమార్ జోక్యం చేసుకొని సర్దిచెప్పడంతో వారు మిన్నకుండిపోయారు. అదే డివిజన్‌లో మరో మహిళ తాను దివ్యాంగురాలు కానప్పటికీ జాబితాలో దివ్యాంగురాలని తప్పుగా నమోదైంది. దీంతో లాటరీ ప్రక్రియకు అవకాశం కోల్పోయింది. దీనిపై ఆమె అధికారులను కోరినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ హనుమంతు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యనారాయణ శర్మ, అసిస్టెంట్ కమిషనర్ శ్రీపాద రామేశ్వర్,ఎల్‌డిఎం, స్థానిక కార్పొరేటర్‌లు పాల్గొన్నారు.



పాండురంగాపురంలో నిర్వహించిన గ్రామసభకు హాజరైన లబ్ధిదారులు, అధికారులు

# మధిర

## దాత ఆర్థిక వితరణతో చేతిపంపు నిర్మాణం

**లడక్‌బజారు(మధిర పట్టణం), న్యూస్‌టుడే:** ప్రజల నీటి అవసరాలను తీర్చేందుకు దాత వితరణతో చేతిపంపు నిర్మాణానికి బుధవారం వార్డు కౌన్సిలరు ములకలపల్లి వినయ్‌కుమార్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. నగర పంచాయతీ పరిధిలోని 15వ వార్డులో లడక్‌బజారులో ప్రజల నీటి ఎద్దడిని తీర్చేందుకు మిలీనియం పాఠశాల డైరెక్టర్ కొలగాని శ్రీనివాసరావు ఆర్థిక వితరణతో ఈ చేతిపంపును నిర్మించనున్నారు.

## విఘ్నేశ్వర ఆలయంలో అన్నదానం

**మధిర, న్యూస్‌టుడే:** స్థానిక ప్రధాన వీధిలోని శ్రీసిద్ధి విఘ్నేశ్వర ఆలయంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోనా ఈశ్వర్ ఆర్థిక సహకారాన్ని అందించారు. నాగేశ్వరరావు, కుమారి, కోనా జగదీష్, దాతతోపాటు పలువురు పాల్గొన్నారు. ప్రతీ బుధవారం ఈ ఆలయంలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**మధిర పట్టణం, న్యూస్‌టుడే:** భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా పని చేసి మహిళలు విద్య, సామాజికంగా అభివృద్ధి చెందాలని పోరాడిన సావిత్రి బాయి పూలేను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని తొలి అడుగు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డా.కోట రాంబాబు సూచించారు. కృష్ణాపురంలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఆమె జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల్య వివాహాల నిరోధానికి, బాల్యవివాహాలను అడ్డుకునేందుకు, బహుజనుల ఉద్ధరణకు సావిత్రి బాయి పాటుపడ్డారని స్మరించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అపర్ణ, గురవయ్య, అంజలి, సుశీల పాల్గొన్నారు.

**వివక్షకు ప్రధాన కారణం నిరక్షరాస్యత :** సమాజంలో వివక్షకు ప్రధాన కారణం నిరక్షరాస్యత అని గుర్తించి సావిత్రీబాయి పూలే మహిళా బోధకురాలుగా పని చేసి బాలికల చదువును ప్రోత్సహించారని యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎ.రమాదేవి పేర్కొన్నారు. మధిరలోని బాలికోన్నత పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయిని యండ్రపల్లి పద్మావతి అధ్యక్షతన సావిత్రీబాయి పూలే జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి పోరాడిన ధీరురాలు పూలే అని ప్రశంసించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తాళ్లూరి ఆంజనేయులు, డా.కోట రాంబాబు, యూటీఎఫ్ బాధ్యులు ఎం.కస్తూరిబాయి, ఎ.అనూరాధ, ఎం.అరుణకుమారి, విజయలక్ష్మి, కళావతి, శిరీషావాణి, హసీనా, జ్యోతి, వివేక, నాగమల్లేశ్వరి, కవిత, సామ్రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

**తొలి అడుగు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో...:** తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి జయంతి వేడుకల్ని బుధవారం టీవీఎం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. తొలి అడుగు స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు డా.కోట రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మధిర సీఐ సీహెచ్ శ్రీధర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాంఘిక దురాచారాలను రూపు మాపేందుకు పూలే విశేష కృషి చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు ఆర్.బ్రహ్మారెడ్డి, తాళ్లూరి ఆంజనేయులు, విజయ్, విశ్రాంత ఉద్యోగుల సంఘం బాధ్యులు పారుపల్లి వెంకటేశ్వరరావు, సిహెచ్ మందయ్య, ఉపాధ్యాయినులు వై.పద్మావతి, ఎండీ గుల్జార్, సబ్‌జైలర్ రాజ్‌కుమార్, విశ్రాంత ఎంపీడీవో మాధవరపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**సీపీఎం ఆధ్వర్యంలోనూ...:** సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ కార్యదర్శి పాపినేని రామనర్సయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు శీలం నర్సింహారావు, పడకంటి మురళి, వడ్రాణపు మధు పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



మధిర: బీసీ గురుకుల పాఠశాలలో జయంతి వేడుకలు



మధిర: సభలో మాట్లాడుతున్న ఎ.రమాదేవి



ఎర్రుపాలెం: మీనవోలులో ప్రజాప్రతినిధుల నివాళి

**లచ్చగూడెం(చింతకాని), న్యూస్‌టుడే:** జాతీయ మహిళా ఫోరం ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు లచ్చగూడెం కేజీబీవీలో బుధవారం జరిగాయి. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండలంలోని 8, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సామ్రాజ్యం, ఎంపీడీవో నవాబ్‌పాషా, ఎంఈవో అబ్రహం, మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ చావా దుర్గాభవాని, యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మీరా హుస్సేన్, నాగేశ్వరరావు, కేజీబీవీ ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

**బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో** సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు చింతకానిలో జరిగాయి. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీగౌడ్, గోపి, జాన్‌బీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**వెంకటాపురం(ముదిగొండ), న్యూస్‌టుడే:** మండలంలోని వెంకటాపురం, ముదిగొండలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వెంకటాపురంలో బడుగు, బలహీనవర్గాల ప్రజా సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దేవపంగు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో, ముదిగొండలో టీ-మాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో టీ-మాస్ జిల్లా నాయకురాలు బండి పద్మ మాట్లాడుతూ... సావిత్రి బాయిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు పయ్యావుల ప్రభావతి, మందరపు పద్మ, టీ-మాస్ నాయకులు బంకా మల్లయ్య, కల్యాణ్, మర్లపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**ఎర్రుపాలెం, న్యూస్‌టుడే:** ఎర్రుపాలెం మండలంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మీనవోలు గ్రామంలో సర్పంచి సాదాకూన్, ఎంపీటీసీ సభ్యురాలు సుజాత సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ఎర్రుపాలెంలోని సీపీఎం కార్యాలయంలో బేతి శ్రీనివాస్, మేరీ జ్యోతి, జోగయ్యల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిపారు. బుచ్చిరెడ్డిపాలెంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మారపాక బాబూరావు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు జరిపి, వారు సమాజానికి చేసిన సేవలను కొనియాడారు.

❖ కాకతీయ విశ్వవిద్యాలయంలో సహాయ ఆచార్యుడిగా విధులు నిర్వహిస్తూ, వికలాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఎర్రుపాలెం మండలంలోని బనిగండ్లపాడుకు చెందిన పెదమళ్ళ శ్రీనివాసరావుకు హైదరాబాద్‌కు చెందిన సావిత్రిబాయి పూలే సంక్షేమ సంఘం అవార్డు ప్రకటించింది. దీన్ని హన్మకొండలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు యేపూరి వెంకటేశ్వరరావు అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

**బోనకల్లు, న్యూస్‌టుడే:** భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 187వ జయంతిని బుధవారం బోనకల్లులో నిర్వహించారు. స్థానిక కస్తూర్బా విద్యాలయంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో మండలస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎంఈవో ఇందిరాజ్యోతి మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే బాలికల విద్య కోసం పరితపించారని అన్నారు. సమాజంలో నెలకొని ఉన్న అనేక దురాచారాలకు వ్యతిరేకంగా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే పోరాటం సాగించారని అన్నారు. సావిత్రిబాయి పూలేని నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.వి.నాగమల్లేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వి.రాంబాబు, మండల అధ్యక్ష, కార్యదర్శులు వై.శ్రీనివాసరావు, జి.రామకృష్ణ, కేజీబీవీ ఎస్‌వో కమలావాహిని తదితరులు పాల్గొన్నారు.

**జూనియర్ కళాశాలలో...:** బోనకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపల్ కె.రవిబాబు, అధ్యాపకులు రమాదేవి, నాగేందర్, తిరుపతిరావు, మోహన్, ధనలక్ష్మి, పద్మావతి, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. సీపీఎం కార్యాలయంలో జయంతి వేడుకల్ని నిర్వహించారు. పార్టీ జిల్లా నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, మండల నాయకులు కొమ్ము శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



చింతకాని: పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ సామ్రాజ్యం



బోనకల్లు: సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంఈవో ఇందిరాజ్యోతి

## తెలంగాణ రాష్ట్ర సాధనలో టీపీటీఎఫ్ కృషి అభినందనీయం

**మధిర, న్యూస్‌టుడే:** తెలంగాణ రాష్ట్ర సాధనలో, ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారంలో టీపీటీఎఫ్ చేసిన కృషి అభినందనీయమని ఎంపీడీవో పి.ఆల్‌బర్ట్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ముద్రించిన 2018 దైనందినిని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.ఆల్‌బర్ట్, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ బుధవారం ఆవిష్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ మాట్లాడారు. సర్వీస్ నిబంధనల సమస్యలను పరిష్కరించి ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, సీపీఎస్ పథకాన్ని రద్దు చేసి చేతల ముఖ్యమంత్రిగా కేసీఆర్ నిరూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి పీవీఆర్‌కే ప్రసాదరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.నాగేశ్వరరావు, షేక్ నాగుల్ మీరా, ఉపాధ్యాయులు నారాయణ, కృష్ణయ్య, డాన్ బాస్కో, సంగమేశ్వరరావు, జానిమియా, చిన్న సత్యనారాయణ, శ్రీమన్నారాయణ, రాంబాబు పాల్గొన్నారు.



టీపీటీఎఫ్ దైనందినిని ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో, సంఘ నాయకులు

## టీపీటీఎఫ్ కాలమానిని ఆవిష్కరణ

**చింతకాని, న్యూస్‌టుడే:** టీపీటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో చింతకానిలో ఆ సంఘం కాలమానిని, దైనందినిలను ఎంపీడీవో నవాబ్‌పాషా, ఎంఈవో అబ్రహం బుధవారం ఆవిష్కరించారు. పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఉపాధ్యాయులకు ఎంపీడీవో, ఎంఈవో సూచించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లికార్జున్‌రావు, దేవయ్య, ఐఈఆర్పీ కృష్ణారావు, బి.దస్లీ, ఎంఐఎస్ సమన్వయకర్త కాకర్ల మాధవి, సంఘం ప్రతినిధులు శ్రీనివాసాచారి, నల్లమోతు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



తెరాస యూత్ దైనందినిని ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల, బేగ్, పిడమర్తి రవి

## తెరాస యూత్ దైనందిని ఆవిష్కరణ

**మధిర, న్యూస్‌టుడే:** తెరాస యూత్ మధిర నియోజకవర్గ అధ్యక్షుడు తోటపల్లి సుధాకర్ ఆధ్వర్యంలో యూత్ దైనందినిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి, తెరాస జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బేగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల గ్రామస్థాయిలో పార్టీ అభివృద్ధికి యూత్ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మధిర నియోజకవర్గంలోని యూత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటుపై హర్షం

**మధిర, న్యూస్‌టుడే:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయటంపై తెలంగాణ జాగృతి మధిర నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బిళ్లపాటి బాబురావు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సాగర్ విహార్ విశ్రాంతి భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ప్రాతినిధ్యం వహించి విద్యార్థి లోకాన్ని ఉద్యమం వైపు నడిపిన ఘనత ఎర్రోళ్ల శ్రీనివాస్‌దేనన్నారు. తెలంగాణ ఉద్యమంలో తమదైన ముద్రవేసుకున్న ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా నియమించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మధిర ఎస్టీ సెల్ అధ్యక్షుడు గుగులోత్ కృష్ణనాయక్, యూత్ ప్రచార కార్యదర్శి దోర్నాల దినకర్‌బాబు, తెలంగాణ జాగృతి నాయకులు పగిడిపల్లి వినోద్, తదితరులు పాల్గొన్నారు.

# మధిర




## విద్యుత్తు స్టార్టర్లను తక్షణమే తొలగించాలి

**చింతకాని, న్యూస్‌టుడే:** రైతులు వ్యవసాయ విద్యుత్తు కోసం వినియోగించే ఆటోమేటిక్ స్టార్టర్లను తక్షణమే తొలగించాలని మండల వ్యవసాయశాఖ అధికారి కాసర అనీల్‌కుమార్ సూచించారు. చింతకానిలో రైసస మండల కమిటీ సభ్యులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. రైతులు ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల వ్యవసాయ విద్యుత్తును సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైసస మండల కమిటీ సభ్యులంతా ఆయా గ్రామాల్లోని రైతులకు అవగాహన కలిగించాలన్నారు. ఈ సందర్భంగా చింతకానిలో అమర్చిన ఆటోమేటిక్ స్టార్టర్లను వ్యవసాయశాఖ అధికారులు, రైసస సభ్యులు తొలగించారు. ఈ కార్యక్రమంలో రైసస మండల కన్వీనర్ కిలారు మనోహర్, తెరాస మండలాధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, చింతకాని పీఏసీఎస్ అధ్యక్షుడు ప్రకాశరావు, ఏఈవోలు రాము, హరికృష్ణ, తాహియా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

**బస్వాపురం(చింతకాని), న్యూస్‌టుడే:** వ్యవసాయానికి 24 గంటలు నిరంతరంగా విద్యుత్తును ఇస్తున్నందుకు తెరాస ఆధ్వర్యంలో మండల పరిధిలోని బస్వాపురంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. రైసస నాయకులు, తెరాస నాయకులు వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి ముఖ్యమంత్రి చేస్తున్న కార్యక్రమాలను కీర్తిస్తూ క్షీరాభిషేకం చేశారు. పుల్లయ్య, మనోహర్, చింతకాని పీఏసీఎస్ అధ్యక్షుడు సూర్యప్రకాశరావు, బుర్రా ముత్తయ్య, రైతులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

## వివేకానందుని జీవితం మానవాళికి ఆదర్శం

**బోనకల్లు, న్యూస్‌టుడే:** స్వామి వివేకానందుని జీవితం మానవాళికి ఆదర్శవంతమైందని సామాజిక సమరసత రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. వివేకానందుని జయంతి సందర్భంగా ఎబీవీపీ ఆధ్వర్యంలో బోనకల్లులో మండల స్థాయి క్రీడలు నిర్వహించారు. విజేతలకు బుధవారం అప్పాల ప్రసాద్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33 ఏళ్లు జీవించిన స్వామి చిన్న వయస్సులోనే భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటిచెప్పారని కొనియాడారు. భారత దేశ గొప్పతనాన్ని అర్థం చేసుకోవాలంటే వివేకానందుని జీవిత చరిత్ర చదవాలన్నారు. బలమే జీవనం బలహీనమే మరణం అని శారీరకంగా మానసికంగా బలంగా ఉంటే ఏ పనిలో అయినా విజయం సాధించవచ్చు అని యువతను ప్రేరేపించిన మహనీయుడు వివేకానందుడని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎబీవీపీ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మండల నాయకులు సునిల్, సాయిగోపి, నాగరాజు, అశోక్ , దిలీప్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## 2 ముక్కల్లో

చింతకాని, న్యూస్‌టుడే

❖ మండల పరిధిలోని నాగులవంచ, తిమ్మినేనిపాలెం, పాతర్లపాడు, నామవరం, రామకృష్ణాపురం గ్రామాల్లో ఆయా గ్రామ సర్పంచుల ఆధ్వర్యంలో బుధవారం గ్రామ సభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. పంచాయతీ కార్యదర్శులు బత్తిన శ్రీనివాస్, సురేశ్, కొండపల్లి అనీల్ పాల్గొన్నారు.

❖ పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని నాగులవంచ, నామవరం గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశుపోషణపై గ్రామస్థులకు అవగాహన కలిగించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ అరుణాభారతి, నాగులవంచ వైద్యాధికారి డాక్టర్ శ్రీహరి, పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

❖ వందనం-కొదుమూరు ఎత్తిపోతల పథకం విజయవంతంగా ఏర్పాటు చేసినందుకు మండల పరిధిలోని వందనం గ్రామంలో మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్కను గురువారం సన్మానించనున్నట్లు ఎత్తిపోతల పథకం ఛైర్మన్ కొండపర్తి గోవిందరావు పేర్కొన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ముగ్గురు సర్పంచులకు అవగాహన

**ఎర్రుపాలెం, న్యూస్‌టుడే:** ఖమ్మం జిల్లాలోని ముగ్గురు ఉత్తమ సర్పంచులకు రాజేందర్‌నగర్‌లోని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఎర్రుపాలెం మండలం మామునూరు సర్పంచి గూడూరు రమణారెడ్డి, మధిర మండలం నాగవరప్పాడు సర్పంచి చావలి రామరాజు, వైర్యా మండలం గరికపాడు సర్పంచి శీలబిశ్రీ, ఐఏఎస్ పౌసమిబసు, డీఎఫ్‌ఓలు ఎ.కృష్ణ, నటరాజశేఖర్‌లు విద్యుత్ వినియోగం, ఆరోగ్యం, గ్రామాల తెంగాలఅఅంశాలపై అవగాహన కల్పించినట్లు సర్పంచులు వివరించారు.

## సమస్యలు పరిష్కరించడానికే గ్రామసభలు

**బాణాపురం, వనంవారికిష్టాపురం (ముదిగొండ), న్యూస్‌టుడే:** గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని ఈవోఆర్డీ శ్రీనివాస్‌రావు కోరారు. మండలంలోని బాణాపురం, అమ్మపేట, పమ్మి, ముత్తారం, కొత్తలక్ష్మీపురం గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించటానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచులు వేముల రాజకుమారి, భద్రమ్మ, శ్రీదేవి, తుపాకుల యలగొండస్వామి, పాల్వంచ స్వరూపరాణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ సైనికుడికి ఘన సన్మానం

**మడుపల్లి(మధిరపట్టణం), న్యూస్‌టుడే:** భారత ఆర్మీలో సైనికుడిగా పని చేసి పదవీ విరమణ పొందిన మడుపల్లి గ్రామానికి చెందిన పొదిలి వేణుగోపాలరావుకు స్వగ్రామంలో ఘనంగా సన్మానం చేశారు. ఆర్మీలో 22 ఏళ్లుగా సైనికుడిగా పని చేసి గత నెలలో లక్నోలో పదవీ విరమణ పొందారు. స్వగ్రామానికి చేరుకున్న ఈ మాజీ సైనికుడికి గ్రామస్థులంతా కలసి ఘన సన్మానం చేశారు. శీలం వెంకటరెడ్డి, వార్డు కౌన్సిలరు పుచ్చకాయల వెంకటనారాయణ, మాజీ సర్పంచి శీలం వెంకటరెడ్డి, విశ్రాంత ఎంపీడీవో వరవరరావు, రామయ్య, తెరాస జిల్లా నాయకులు శీలం వీరవెంకటరెడ్డి పాల్గొన్నారు

## మహిళా చట్టాలపై అవగాహన అవసరం

**ఎర్రుపాలెం, న్యూస్‌టుడే:** మహిళా చట్టాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై జె.ఆంజనేయులు పేర్కొన్నారు. ఎర్రుపాలెంలోని గురుకుల బాలికల గురుకుల కళాశాలలో బుధవారం షిటీమ్ బృందాలపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎక్కడైనా మానసికంగా, శారీరకంగా వేధింపులు చేస్తే తమకు సమాచారమివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో షీటీమ్స్ ఇన్‌చార్జ్ ఏఎస్సై నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ ఉజ్వలకుమారిలు పాల్గొన్నారు

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

**బోనకల్లు, న్యూస్‌టుడే:** ఎస్సీ వర్గీకరణ కోసం దీక్ష చేపట్టిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అక్రమ అరెస్టును ఖండిస్తూ బుధవారం ఆ సంఘం కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. తెరాస ప్రభుత్వ మాదిగల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. 24 ఏళ్లుగా సుదీర్ఘ పోరాటం నిర్వహిస్తుండగా అన్ని వర్గాల నుంచి స్పందన వస్తున్నా పాలక వర్గాలు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. పొట్టిపింజర బాలస్వామి, నాయకులు వెంకటేశ్వర్లు, హనుమంతరావు, వేణు, కొండ, సైదులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

## వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే బాధ్యత తీసుకోవాలి


తహసీల్దార్ మంగీలాల్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు

**మధిర పట్టణం, న్యూస్‌టుడే:** ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేలా అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చే బాధ్యత తెరాస ప్రభుత్వం తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌ఛార్జి యంగల కనకయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు ఆ సంఘం బాధ్యులతో కలసి బుధవారం తహసీల్దార్ మంగీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గద్దల వెంకటేశ్వర్లు, ఎస్‌కే రంజాన్, స్వామి, కోటేశ్వరరావు, సునీల్, దస్తగిరి పాల్గొన్నారు.

**ఎర్రుపాలెం, న్యూస్‌టుడే:** జనవరి 1 నుంచి 5 వరకు జరుగనున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన బిల్లు ప్రవేశపెట్టాలని, అఖిలపక్షాన్ని దిల్లీ తీసుకెళ్లాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చేపట్టిన దీక్షను భగ్నం చేసి, అక్రమ అరెస్టుకు నిరసనగా ఎర్రుపాలెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్యకర్తలు బుధవారం ధర్నా చేసి, తహసీల్దార్ అన్నారికి వినతిపత్రం అందించారు. నాయకులు కూరపాటి ప్రభాకర్‌మాదిగ, కనకపూడి శ్రీనుమాదిగ, ఆదూరి రమేష్‌మాదిగ, దానయ్య, పోతయ్య, వెంకటేశ్వర్లు, సతీష్, రాజేష్, కళ్యాణ్, కమలాకర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## కమనీయం.. రాములోరి కల్యాణం

**మధిర పట్టణం, న్యూస్‌టుడే:** సిగ్గులొలికే సీతమ్మ మెడలో జగదభిరాముడు మంగళసూత్రం కట్టే కల్యాణ వేడుకల్ని పునర్వసు నక్షత్రం సందర్భంగా బుధవారం మధిరలోని పురాతన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీనివాసుల జనార్దనాచార్యులు, శేషాచార్యుల వేద మంత్రోచ్చారణల నడుమ సీతారామచంద్రస్వామి కల్యాణ వేడుకల్ని శాస్త్రోక్తంగా జరిపారు. కమనీయంగా సాగిన ఈ క్రతువును తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.


శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా కల్యాణ వేడుకలు

## శ్మశాన వాటికకు స్థలం వితరణ

**నామవరం(చింతకాని), న్యూస్‌టుడే:** మండల పరిధిలోని నామవరం గ్రామస్థులు శ్మశాన వాటిక లేక కొన్నేళ్లుగా తీవ్ర అవస్థలు పడుతున్నారు. బుధవారం జరిగిన గ్రామసభలో గ్రామానికి చెందిన రాయపూడి మురళీధర్‌రావు భూమిని కొనుగోలు చేసి శ్మశాన వాటికకు వితరణగా అందజేశారు. స్థల పత్రాలను ఎంపీడీవో నవాబ్‌పాషా, ఈవోఆర్డీ రామయ్యలకు అందజేశారు. మురళీధర్‌రావును సర్పంచి వేల్పుల నాగమణి, మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి సురేశ్, గ్రామస్థులు రామారావు, కొండయ్య, నారాయణ, విజయచందర్ అభినందించారు.

### పాఠశాలకు నగదు...

**ఎరుపాలెం, న్యూస్‌టుడే:** మండలంలోని సత్యనారాయణపురం ప్రాథమిక పాఠశాలకు కృష్ణా జిల్లా మైలవరానికి చెందిన వెలిమెల రాంబాబు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె దాత మౌనిక వితరణ చేసిన నగదును రూ.5000లను ఆమె బంధువు వెంకటేశ్వరరావు బుధవారం అందించారు. దాతను ఎంఈఓ వై.ప్రభాకర్, సర్పంచి దాతను సర్పంచి పిట్టల శివయ్య, పాఠశాల కమిటీ అధ్యక్షుడు సురేష్‌లు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.నాగేశ్వరరెడ్డి, ఉపాధ్యాయురాలు సౌజన్యలు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమానికి సరకుల వితరణ

**ఎరుపాలెం, న్యూస్‌టుడే:** రాజులదేవరపాడులో అమ్మా, నాన్న వృద్ధాశ్రమానికి కృష్ణా జిల్లాకు చెందిన ఊటుకూరుకు చెందిన వాసవీ క్లబ్, వనితా క్లబ్ ఆధ్వర్యంలో పద్మనాభుని చిన్న నరసింహారావు బుధవారం నిత్యావసర సరకులు అందించారు. నిర్వాహకురాలు దుర్గాప్రసన్నకు క్లబ్ కోశాధికారి సర్వేస్వరరావు అందించారు. నేరెళ్ళ స్వాతి, నాగేందర్‌రావు, రమాదేవి, యుగంధర్, మైలవరపు శ్రీనివాసరావు, సౌభాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన కార్యదర్శిగా బ్రహ్మయ్య

**బోనకల్లు, న్యూస్‌టుడే:** రజక సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బోనకల్లు మండలం గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన తమ్మారపు బ్రహ్మయ్యను నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు సత్యనారాయణ ఉత్తర్వులు ఇచ్చారు. ఈమేరకు బుధవారం బాధ్యతలు చేపట్టారు. బ్రహ్మయ్య విలేకర్లతో మాట్లాడుతూ... రజకుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. తెరాస ప్రభుత్వం రజకుల అభివృద్ధికి ఇప్పటికే రూ.200 కోట్లు కేటాయించిందన్నారు. తనకు జిల్లా బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.


పాశురాన్ని అందజేస్తున్న దాతలు

## లడక్ వీధిలో ఇంటింటా గోదా అమ్మవారు

**లడక్‌వీధి(మధిర), న్యూస్‌టుడే:** ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా వర్తక సంఘం ఆవరణలో వేంచేసి ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటింటా గోదా అమ్మవారు కార్యక్రమంలో భాగంగా లడక్‌వీధిలోని పెల్లవల్లి సుబ్బారావు ఇంట్లో గోదా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటి ఆవరణలో ప్రత్యేకంగా అలంకరణ చేసి గోదా అమ్మవారి విగ్రహాన్ని ఉంచి పూజలు నిర్వహించారు. వికాస తరంగణి సభ్యులు, శ్రీరామరామానుజ సుప్రభాత సేవా సంఘం సభ్యులు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీవారి ఆలయంలో ఉదయం జరిగిన కార్యక్రమంలో గోదా అమ్మవారికి పాశురాన్ని అయ్యగారి శేషకల్యాణ్ భార్గవ్ తరపున తల్లిదండ్రులు శర్మ, రవితేజ, అందజేశారు. కంఠమాలను నందిగామకు చెందతి పబ్బతి సుశీల సమర్పించారు. ఆలయ అర్చకులు రజనీకాంతాచార్యులు, సంపత్‌కుమారాచార్యులు, శ్రీనివాసాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.